
'సంక్షేమ పథకాలతో ఎప్పటికీ ప్రజల మనస్సుల్లో ఉండిపోతాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 302

మంగళవారం 23-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జొకోవిచ్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రిక్వార్టర్‌లో కొరియా ప్లేయర్ చుంగ్ చేతిలో ఓటమి – స్పోర్ట్స్‌లో



4వ రోజూ రికార్డ్‌ల ర్యాలీ

ఇంట్రాడేలో, ముగింపులో కొత్త శిఖరాలకు స్టాక్ సూచీలు - 15లో

మూసీ.. ముప్పు!



పీర్జాదిగూడలోని నారాయణరావు కత్వ వద్ద రసాయన వ్యర్థాలతో మూసీ పరిస్థితి ఇదీ..

డంపింగ్ యార్డును తలపిస్తున్న నది

రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం

ఏమాత్రం తగ్గని విష రసాయనాల చేరిక

- నదిలోకి నిత్యం 140 కోట్ల లీటర్ల వ్యర్థ జలాలు
- ఇందులో 70 కోట్ల లీటర్ల మురుగు జలాలే శుద్ధి
- ప్రక్షాళనపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం
- మరో పది శుద్ధి ప్రాజెక్టులు, పలు రీసైక్లింగ్ యూనిట్లు అవసరం
- నది అభివృద్ధి, సుందరీకరణ ప్రణాళికలు కాగితాలకే పరిమితం
- ఆక్రమణలు, చెత్త డంపింగ్‌తో నదిలో మురికి గుంటలు
- మూసీ పరీవాహక ప్రాంతాల్లో వందల ఎకరాల్లో పంటలు
- కాలుష్య భరిత నీటితోనే సాగు.. ఆ పంటలు తింటే అనారోగ్యమే..
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైన చేదు నిజాలు

సాక్షి, హైదరాబాద్

మూసీ నది.. ఒకప్పుడు ఈ నదిలో నాణెం వేస్తే పైకి కనిపించేదట. కానీ ఇప్పుడు మూసీకి బారెడు దూరంలో ఉన్నా ముక్కు పుటాలు పగిలిపోతున్నాయి. నిండా చెత్త చెదారంతో, హానికర కలుషితాలతో నది అత్యంత ప్రమాదకరంగా మారిపోయింది. ప్రక్షాళనపై ప్రభుత్వాల నిర్లక్ష్యం, రోజురోజుకూ పెరుగుతున్న నగర జనాభా, వ్యర్థాలను నదిలోనే డంప్ చేస్తుండటం, పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కలుషిత జలాలతో మూసీ నది వైతరణీ నదిని తలపిస్తోంది. నది వెంట ఉన్న బస్తీలు, కాలనీల వాసులు రోగాల బారిన పడుతున్నారు. గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో మూసీని ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. ఆచరణలో అడుగు ముందుకు పడటం లేదు. ప్రక్షాళన కోసం రూ.1,200 కోట్లతో, తీర ప్రాంత అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ.3 వేల కోట్లతో రూపొందించిన ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఏడాది కింద 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినా.. నామమాత్రంగానే మిగిలిపోయింది. ఇక కొందరు నది వెంట ఈ కలుషిత నీటితోనే

మిగతా 2వ పేజీలో ▶

- ➤ నగరం నుంచి మూసీ నది బయటికి వెళ్లే పీర్జాదిగూడ, పర్వతాపూర్, కాచవాని సింగారం, ప్రతాప సింగారం ప్రాంతాల్లో మూసీ నది 'పచ్చని విషాన్ని'వెదజల్లుతోంది.
- ➤ మూసీ కాలువలకే నేరుగా మోటార్లు బిగించి నీటిని తోడి.. పొలాలకు మళ్లిస్తున్నారు.
- ➤ మూసీ నీటిలోని విష రసాయనాలు, హానికర పదార్థాలు ఈ పంటల్లోకి చేరుతున్నాయి.
- ➤ ఈ కలుషిత నీటితోనే పాలకూర, తోటకూర, మెంతి, కొత్తిమీర తదితర ఆకుకూరలు పండిస్తున్నారు. ఆకుకూరలను ఉప్పల్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



యాదాద్రి లడ్డూకు డిమాండ్

- తిరుపతి లడ్డూ తర్వాత అధిక ప్రాధాన్యత దీనికే..
- రోజూ లక్ష లడ్డూల విక్రయం
- ఉత్సవాల సమయంలో రెండు మూడు రెట్లు డిమాండ్
- ఆలయానికి అధిక ఆదాయం లడ్డూ ప్రసాదం నుంచే..

యాదగిరికొండ

యాదాద్రి నర్సన్న లడ్డూ ప్రసాదానికి డిమాండ్ పెరుగుతోంది. సాధారణంగా తిరుపతి లడ్డూ అంటే బాగా క్రేజ్ ఉంటుంది. అదే తరహాలో తెలంగాణలో మాత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూకు చాలా ప్రాధాన్యత ఉంది. రుచి అమోఘంగా ఉంటుండటంతో ఈ ఆలయానికి వచ్చేవారంతా వీలైనన్ని లడ్డూలు తీసుకెళుతుండటం ఆనవాయితీగా మారింది. ఒక్కోసారి భక్తుల డిమాండ్ మేరకు

మిగతా 2వ పేజీలో ▶

మే 6న 'నీట్'

నెలాఖరు నుంచి దరఖాస్తుల ప్రక్రియ ● రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్‌లోనే పరీక్షలు

- మొత్తం 75 కేంద్రాలు ఏర్పాటు!
- జూన్ 12 నుంచి కౌన్సెలింగ్
- ఆగస్టు 31తో ప్రక్రియ ముగింపు
- షెడ్యూల్ ఖరారు చేసిన సీబీఎస్ఈ



సాక్షి, హైదరాబాద్

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)–2018కు ఏర్పాట్లు మొదలయ్యాయి. పరీక్షను మే 6న నిర్వహించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెలాఖరులో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మొదలవుతుందని, మార్చితో ముగుస్తుందని, ఫీజు చెల్లింపు గడువు మార్చితోనే పూర్తవుతుందని తెలిపింది. ఈ మూడు ప్రక్రియలకు సంబంధించి కచ్చితమైన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొంది. జూన్ మొదటి వారంలో ఫలితాలు వెల్లడిస్తామని.. జూన్ 12న కౌన్సెలింగ్ మొదలవుతుందని, ఆగస్టు 31తో అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుందని స్పష్టం చేసింది. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) మినహా దేశవ్యాప్తంగా అన్ని వైద్య కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలు నీట్ ర్యాంకుల ప్రకారమే జరగనున్నాయి.

రాష్ట్రంలో 60 వేల మంది

నీట్–2017కు రాష్ట్రం నుంచి 56,804 మంది హాజరు కాగా.. ఈ ఏడాది 60 వేల మంది హాజరయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్, వరంగల్‌లో పరీక్ష నిర్వహిం చనున్నారు. గతేడాది హైదరాబాద్‌లో 59, వరంగల్‌లో 16 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. పరీక్షలో 180 ప్రశ్నలు, 720 మార్కులు ఉంటాయి. ఇంగ్లిష్, హిందీ, తెలుగుతోపాటు మరో ఏడు భాషల్లో పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో బీడీఎస్, ఎంబీబీఎస్, ఆయుష్ కోర్సుల సీట్లను నీట్ ఆధారంగా భర్తీ చేస్తున్నారు. రాష్ట్రంలో 3,200 ఎంబీబీఎస్, 1,140 బీడీఎస్, 695 ఆయుష్ సీట్లున్నాయి. వచ్చే ఏడాది సిద్దిపేట వైద్య కళాశాలకు అనుమతి రానుంది.

రెండు రాష్ట్రాల్లో పోటీ చేస్తాం

2019 ఎన్నికలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్



సోమవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

- బలాన్నిబట్టి ఎన్ని సీట్లలో పోటీ చేయాలో నిర్ణయం
- తెలంగాణ అంటే నాకెంతో ప్రేమ, ఇష్టం
- సినిమాలు పక్కనపెట్టి పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వస్తున్నా
- ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చే అవసరం నాకు లేదు
- కేసీఆర్ హార్డ్ వర్కర్, స్మార్ట్ సీఎం
- జనసేనకు, చిరంజీవికి సంబంధం లేదు

- 6లో

ప్రత్యేక హోదానే మాకు ప్రధానం



- ఎవరిస్తే వారికే మా మద్దతు
- అబద్ధాలు, అవకాశవాద పొత్తులతోనే బాబుకు అధికారం
- నాలుగేళ్లలో రాజధానిలో ఒక్క ఇటుక కూడా వేయని ఏపీ సీఎం
- సీఎన్ఎన్‌న్యూస్ 18 చానెల్ ఇంటర్వ్యూలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- వివరాలు 5లో

తీవ్రమైన అంశాలున్నాయి!

- లోయా మృతిపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు
- అన్ని డాక్యుమెంట్లను క్షుణ్నంగా పరిశీలిస్తాం
- లోయా కేసు విచారణ ప్రారంభించిన జస్టిస్ దీపక్ మిశ్రా ధర్మాసనం
- ఫిబ్రవరి 2కు తదుపరి విచారణ వాయిదా

11 లో

గోడు వినరు.. గూడు కట్టరు!

- ప్రధాన ప్రాజెక్టుల కింద పదేళ్లైనా పూర్తి కాని పునరావాస పనులు
- అరిగోస పడుతున్న నిర్వాసితులు
- ఇళ్లు లేక కొందరు.. ఉన్నా వసతుల్లేక ఎందరో..
- పలు కాలనీల్లో తాగునీరు, కరెంట్‌కు కటకట

6 లో

ఫిబ్రవరి 18న కలెక్టర్ అమ్రపాలి వివాహం



హన్మకొండ అర్బన్: వరంగల్ అర్బన్ కలెక్టర్ అమ్రపాలి కాట త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారు. ఢిల్లీకి చెందిన 2011వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి సమీర్ శర్మతో వివాహం నిశ్చయమైనట్లు సమాచారం. సమీర్‌శర్మ ప్రస్తుతం కేంద్ర పాలితప్రాంతమైన డయ్యూ, డామన్‌లో ఎస్పీ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాల పునర్విభజ సమయంలో అర్బన్ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన అమ్రపాలి పాలనలో తనదైన ముద్ర వేశారు. ఓడీఎఫ్‌లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపి జాతీయస్థాయిలో అవార్డు కూడా అందుకున్నారు. పెళ్లి కార్యక్రమాల కోసం ఈ నెలాఖరు నుంచి సెలవులో వెళ్లనున్నట్లు సమాచారం.

వణికిస్తున్న చలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గత 24 గంటల్లో రాష్ట్రంలో సాధారణం కంటే ఏడు డిగ్రీల వరకు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆదిలాబాద్‌లో రాత్రి 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లో 11 డిగ్రీలుగా రికార్డయింది. ఖమ్మంలో 12 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. ఐదు డిగ్రీలు తక్కువగా రామగుండంలో 12, భద్రాచలంలో 13 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. హకీంపేటలో 13, హైదరాబాద్‌లో 14, మహబూబ్‌నగర్‌లో 16, హన్మకొండలో 17 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

మూసీ.. ముప్పు!



ప్రతాప సింగారం వద్ద కాలుష్య నీటితో పండిస్తున్న ఆకు కూరలు. ఇన్‌సెట్‌లో పంటచేలకు మూసీ నీటిని పంప్ చేస్తున్న దృశ్యం

▶ మొదటి పేజీ తరువాయి

కూరగాయలు, ఆకుకూరలు పండిస్తుండటంతో.. వాటిని తిన్నవారు రోగాల పాలవుతున్నారు. మూసీ హైదరాబాద్ నగరంలోకి ప్రవేశిస్తోన్న బాపూఘాట్ ప్రాంతం నుంచి ప్రతాప సింగారం వరకు సుమారు 44 కిలోమీటర్ల పొడవునా మూసీ పరిస్థితిపై 'సాక్షి'బృందం సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఈ సందర్భంగా ఎన్నో విస్తుగొలిపే అంశాలు వెల్లడయ్యాయి.

మూసీ దుస్థితి ఇదీ..

వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండలు మూసీ జన్మస్థానం. అక్కడి నుంచి సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి.. బాపూఘాట్ వద్ద హైదరాబాద్‌లోకి ప్రవేశిస్తుంది. ఇక్కడి నుంచి నగర శివార్లలోని ప్రతాప సింగారం వరకు సుమారు 44 కిలోమీటర్లు నగరంలో ప్రవహిస్తుంది. గృహ, వాణిజ్య, పారిశ్రామిక వాడల నుంచి నిత్యం 140 కోట్ల లీటర్ల మురుగునీరు నదిలోకి చేరుతోంది. పారిశ్రామిక వ్యర్థాలతో నదిలో రసాయన కాలుష్యం పెరుగుతోంది. నదిపై ఉన్న ఐదు మురుగు శుద్ధి కేంద్రాల్లో నిత్యం 70 కోట్ల లీటర్ల మురుగు నీటిని మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మరో పది చోట్ల మురుగు శుద్ధి కేంద్రాలు, పలు చోట్ల రీసైక్లింగ్ యూనిట్లు నిర్మించాలని ప్రణాళికలు కూడా వేశారు. కానీ అమల్లోకి రాలేదు.




ఫిర్జాదిగూడలో చెత్తాచెదారంతో ఉన్న మూసీ నది

బాపూఘాట్-చాదర్‌ఘాట్: చెత్తా చెదారం, మురుగు మధ్య..

- నగరంలోకి మూసీ నది ప్రవేశించే లంగర్ హౌస్ బాపూఘాట్ ప్రాంతం నుంచి పురానాపూల్, ముస్లిం జంగ్ బ్రిడ్జి, నయాపూల్, చాదర్‌ఘాట్ వరకు డంపింగ్ యార్డును తలపిస్తోంది.
- ➤ నది వెంట ఉన్న కాలనీలు, బస్తీల నుంచి మురుగు నీరంతా నదిలో కలుస్తోంది. ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలతో నిండి కనిపిస్తోంది.
- ➤ లంగర్‌హౌజ్ టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద నదిలోనే శ్మశాన వాటిక ఉంది. మృతదేహాలను దహనం చేయడం, ఇతర వ్యర్థాలన్నీ నదిలోకే చేరుతున్నాయి.
- ➤ నది ఒడ్డున దోబీ ఘాట్‌లు ఉన్నాయి. ఆ నీటితోనే బట్టలు ఉతుకుతున్నారు.
- ➤ అత్తాపూర్ బ్రిడ్జి వద్ద జీహెచ్‌ఎంసీ వాహనాలు భవన, మురుగు వ్యర్థాలను నదిలోనే డంప్ చేస్తున్నాయి.
- ➤ పలు చోట్ల నది వెంట ఆ నీటితోనే ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

చాదర్‌ఘాట్-ఉప్పల్: మురికి గుంట



చాదర్‌ఘాట్ వద్ద మూసీ నది

- ➡ చాదర్‌ఘాట్ వద్ద ఒకవైపు ఎంజీబీఎస్ బస్‌స్టేషన్, మరో వైపు రెండు మెట్రో కారిడార్లు కలిసే చోట నిర్మిస్తోన్న ఇంటర్ చేంజ్ మెట్రోస్టేషన్ నిర్మాణంతో మూసీ ఇరుగ్గా మారిపోయింది.
- ➡ చాదర్ ఘాట్ ప్రధాన వంతెన, దిగువ వంతెనలకు ఆనుకుని అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దానికి తోడు చెత్తా చెదారం నిండి నది మురికినీటి గుంటలా మారిపోయింది. మూసారాంబాగ్, గోల్నాక, అంబర్‌పేట్‌ల వద్ద కూడా ఇదే పరిస్థితి.
- ➡ మురికి నీరు నిలవడంతో దోమలుఉండి.. సమీప ప్రాంతాల వాసులు రోగాలబారిన పడుతున్నారు.
- ➡ అంబర్‌పేట్ వద్ద మురుగు శుద్ధికేంద్రం వద్ద నది నీటిలోని చెత్తా చెదారాన్ని మాత్రమే తొలగిస్తున్నారు. హానికర రసాయనాలను తొలగించే ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ లేకపోవడం ఆందోళనకరం.

మూసీ ప్రక్షాళన రెండోదశ ఏదీ?

మూసీని కాలుష్యం కోరల నుంచి రక్షించాలంటే రెండో దశ ప్రక్షాళనను తక్షణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.1,200 కోట్లు అవసరం. మూసీ నది ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ఐదేసి చొప్పున మొత్తం పది సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. మరో నాలుగు చోట్ల రీసైక్లింగ్ యూనిట్లు నిర్మించాల్సి ఉంది. దీనిపై జలమండలి ప్రతిపాదనలు రూపొందించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు.

డంపింగ్ యార్డును తలపిస్తోంది

చెత్తా చెదారం, ప్లాస్టిక్ బ్యాగులు, పారిశ్రామిక వ్యర్థాలతో మూసీనది డంపింగ్ యార్డుగా మారిపోయింది. పురానాపూల్-చాదర్‌ఘాట్ మధ్య ఒకప్పుడు సుందరంగా ఉండేది. ఇప్పుడు కాలుష్యకాసారంగా కనిపిస్తోంది. మురుగు నీటి శుద్ధి సరిగా జరగడం లేదు..

– ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, పర్యావరణవేత్త

ఉప్పల్- ప్రతాపసింగారం: పచ్చని విషం

- ❖ నగరం నుంచి మూసీ నది బయటికి వెళ్లే ఫిర్జాది గూడ, పర్వతాపూర్, కాచవాని సింగారం, ప్రతాప సింగారం ప్రాంతాల్లో మూసీ 'పచ్చని విషాన్ని'వెదజల్లుతోంది.
- ❖ మూసీ కాలువలకే నేరుగా మోటార్లు బిగించి నీటిని తోడి.. పొలాలకు మళ్లిస్తున్నారు.
- ❖ ఈ కలుషిత నీటితోనే పాలకూర, తోటకూర, మెంతి, కొత్తిమీర, పుదీనా, గంగవాయిలి తదితర ఆకుకూరలు, పశువుల కోసం గడ్డి పండిస్తున్నారు. ఆకుకూరలను ఉప్పల్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.
- ❖ మూసీ నీటిలోని విషపూరిత రసాయనాలు, హానికర పదార్థాలు ఈ పంటల్లోకి చేరుతున్నాయి.
- ❖ కాచవాని సింగారం, ప్రతాప సింగారం ప్రాంతంలో పలు చోట్ల బోర్లు వేసినా.. కలుషిత నీరే వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీనివల్ల చర్మవ్యాధులు, ఇతర రోగాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు.
- ❖ పంటలకు మూసీ నీటిని తరలిస్తున్న సమయంలో చుట్టూ రెండు మూడు కిలోమీటర్ల పరిధిలో భయంకరమైన దుర్గంధం వ్యాపిస్తోంది.
- ❖ మూసీ జలాలు, కలుషిత గాలి కారణంగా ఇళ్లకు వినియోగించిన ఉక్కు తుప్పుపట్టి గోడలకు, పైకప్పులకు పగుళ్లు వస్తున్నాయని రియల్‌ఎస్టేట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆకుకూరలు పండిస్తున్నాం..



మూసీ నీటితోనే అన్ని రకాల ఆకుకూరలు పండిస్తున్నాం. రోజూ పొద్దున్నే ఉప్పల్ మార్కెట్‌కు తరలిస్తాం. మూసీ నీళ్లు బాగా లేవని తెలిసినా తప్పదు. బోరు వేసినా కలుషిత నీళ్లే వస్తున్నాయి..

– వీరమణి, ఫిర్జాదిగూడ

ఏళ్లుగా ఉతుకుతున్నాం

మా తాతల కాలం నుంచి మేం లంగర్‌హౌజ్ టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద బట్టలు ఉతుకుతున్నాం. దాదాపు 25 మంది వరకు ఈ పనిలో ఉన్నాం. నదిలో నీటిని పక్కన ఏర్పాటు చేసుకున్న నీటి హౌజుల్లో నింపుకొని వాడుతున్నాం..''

– కమల్‌సింగ్, లంగర్‌హౌస్

కాగితాలపైనే సుందరీకరణ ప్రాజెక్టు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూసీ ప్రవహిస్తున్న మార్గం వెంట రహదారులు, ఫ్లైఓవర్లు, పార్కులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటు సౌకర్యం, ఇటు మూసీ సుందరీకరణకు తోడ్పడే ఈ ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లతో ప్రణాళికలు కూడా సిద్ధం చేసింది. కానీ ఇదంతా కాగితాలకే పరిమితమైపోయింది. ఇందులో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ల నుంచి బాపూఘాట్ వరకు (19 కిలోమీటర్లు, రూ.647.98 కోట్ల వ్యయం), బాపూఘాట్ నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు (21.50 కిలోమీటర్లు, రూ.2,162.01 కోట్లు వ్యయం), నాగోల్ బ్రిడ్జి నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు (గౌరెల్లి) వరకు (15 కిలోమీటర్లు, రూ.155.52 కోట్లు వ్యయం) అంచనాలను రూపొందించారు. ఇవి అమల్లోకి వస్తే.. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తప్పుతాయి.

గతేడాది అక్టోబర్-నవంబర్-డిసెంబర్ నెలల్లో మూసీ కాలుష్య స్థాయిలు

కాలుష్యం	టీడీఎస్	బీఓడీ	ఎపిహెచ్	సీఓడీ
మూసారాంబాగ్	660-722-782	145-125-170	6.97-7.1-7.46	323-336-428
నాగోల్	792-775-847	200-135-135	6.87-7.33-7.28	433-332-276
పీర్జాదిగూడ	727-762-786	78-78-68	7.33-7.32-7.64	213-228-288
ప్రతాపసింగారం	717-693-774	45-52-52	7.32-7.53-7.37	160-196-152
పిల్లాయిపలి	867-718-793	39-24-18	7.08-7.42-7.29	144-120-116

దేశంలోనే నాలుగో స్థానం

దేశంలోని అత్యంత కాలుష్యభరిత నదుల్లో మూసీ నాలుగో స్థానంలో ఉండడం నది దుస్థితికి అద్దం పడుతోంది. హైదరాబాద్ పరిధిలో నదిలో టీడీఎస్ (టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్), బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్-బీఓడీ)లు ప్రమాదకర స్థాయికి చేరుకోవడం ఆందోళనకరంగా మారిం ది. దీంతో సూక్ష్మజీవులు వినియోగించే ఆక్సిజన్ పరిమాణం కనిష్ట స్థాయికి పడిపోయింది. వ్యర్థ రసాయనాలు అత్యధికంగా కలవడం వల్ల కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీఓడీ) కూడా బాగా పెరిగినట్లు తేలింది. సాధారణంగా నీటిలో సీఓడీ ఉండకూడదు. కానీ పరిస్థితి చేయిదాటింది. ఇక నీటి క్షారత (పీహెచ్) పెరిగింది. కొద్దినెలలుగా మూసీ నదిలో కాలుష్య పరిమితి ప్రమాదకర స్థాయిలో పెరిగిందని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తాజా నివేదిక వెల్లడించింది.

ఉండాల్సిన పరిమితి..

టీడీఎస్ (నీటిలో కరిగి ఉన్న ఘన పదార్థాలు):	500
బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్):	4
సీఓడీ (కెమికల్ ఆక్సిజన్ డిమాండ్):	0 (అసలు ఉండరాదు)
పీహెచ్ (నీటి ఆమ్ల/క్షార లక్షణం):	6.5

(ప్రతి లీటర్ నీటికి మిల్లీగ్రాముల్లో..)

యాదాద్రి లడ్డూకు డిమాండ్

▶ మొదటి పేజీ తరువాయి


లడ్డూలు సరిపోని పరిస్థితి కూడా ఏర్పడుతోంది.

పెద్ద లడ్డూ కోసం..

యాదాద్రి దేవస్థానంలో పెద్ద లడ్డూ ప్రసాదం కోసం డిమాండ్ పెరుగుతోంది. చిన్న లడ్డూలు 100 గ్రాములు, పెద్ద లడ్డూలు 500 గ్రాముల పరిమాణంలో తయారు చేస్తున్నారు. నిత్యం 20 వేల నుంచి 30 వేల వరకు పెద్ద లడ్డూలు, 50 వేల వరకు చిన్న లడ్డూలు విక్రయిస్తున్నారు. ఇక శని ఆదివారాలు, ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని బట్టి ఈ డిమాండ్ రెండు మూడు రెట్లకుపైగా ఉంటుంది. లడ్డూ ప్రసాదానికి డిమాండ్ పెరగడంతో రోజూ ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు తయారు చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో మరికొంత మందిని నియమించారు. కాగా దేవస్థానానికి వచ్చే ఆదాయంలో సగానికిపైగా లడ్డూ ప్రసాదం నుంచే సమకూరుతుందని అధికారులు వెల్లడించారు.

కార్పొరేట్ కాలేజీల్లో ఆత్మహత్యలపై హైకోర్టుకు లేఖ

- లేఖపై స్పందించిన హైకోర్టు.. పిల్‌గా పరిగణన
- నేడు విచారణకు వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు కార్పొరేట్ కాలేజీలు, ఐఐటీల్లో ఇటీవల జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణకు ఆదేశించడంతో పాటు ఆయా కాలేజీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ తమకు అందిన లేఖపై హైకోర్టు స్పందించింది. ప్రకాశం జిల్లాకు చెందిన లోక్‌సత్తా అజిటేషన్ సొసైటీ జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ రాసిన లేఖను హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా పరిగణించింది. ఇందులో ఉభయ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, హోం, విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, నిమ్స్, స్విమ్స్ డైరెక్టర్లతో పాటు, కార్పొరేషన్ కాలేజీలైన నారాయణ, శ్రీచైతన్య కాలేజీల యాజమాన్యాలను ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిల్‌పై మంగళవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపే అవకాశం ఉంది.

సాంకేతికతను అందిపుచ్చుకోండి: బుర్రా

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. సోమవారం దామోదరం సంజీవయ్య సంక్షేమభవన్‌లో నాయీబ్రాహ్మణ యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులు, మార్పులకు అనుగుణంగా వ్యాపార మెలకువలు నేర్చుకోవాలన్నారు. మోడ్రన్ హెయిర్ స్టైల్, బ్యూటీషియన్ కోర్సులపై పదిహేను రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంబీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే తొలి ఏడాదే రూ.వెయ్యి కోట్లు కేటాయించిందని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి సైదా, అదనపు సంచాలకుడు మల్లయ్యభట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో గీత కార్మికుడి ఆత్మహత్య

- ఆస్పత్రిలో మృతి
- మండల కో ఆప్షన్ సభ్యుడి వేధింపులే కారణమని ఆరోపణ



ఆస్పత్రిలో రామాగౌడ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల / మంచిర్యాల సిటీ: కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఓ గీత కార్మికుడు సరైన స్పందన రాకపోవడంతో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతి చెందాడు. ఈ ఘటన మంచిర్యాల కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జరిగింది. మంచిర్యాల జిల్లా నెన్నెలకు చెందిన గీత కార్మికుడు రంగు రామాగౌడ్ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నాడు. మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఆయన భార్య గ్రామ సర్పంచ్ అస్మా ఇబ్రహీం భూ కబ్జాలకు పాల్పడుతున్నారని రామాగౌడ్ టీడీ పీ మండలాధ్యక్షుడి హోదాలో పత్రికా ప్రకటనలు ఇచ్చాడు. సర్పంచ్ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. రామా గౌడ్‌పై కక్ష పెంచుకున్న ఇబ్రహీం ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టించాలని భావించి తన వద్ద పనిచేసే పల్లె మహేశ్ ద్వారా డిసెంబర్ 13న నెన్నెల పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించాడు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో తనపై అక్రమ కేసు నమోదు చేశారని ఈనెల 2న జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్‌కు ఫిర్యాదు చేశాడు. అయినా, స్పందన లేకపోవడంతో సోమ వారం ప్రజావాణిలో జేసీ సురేందర్‌రావు వద్దకు వచ్చి న్యాయం చేయాలని కోరాడు. నెన్నెల తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించామని జేసీ చెప్పారు. దీంతో తనకు న్యాయం జరగదని మనస్తాపానికి గురై తెచ్చుకున్న పురుగుల మందును అక్కడే తాగి పడిపోయాడు. పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఇదం జగత్



65 స్థానాల్లో ఓకే

- వచ్చే ఎన్నికల అభ్యర్థులపై ఉత్తమ్
- ఫిబ్రవరి రెండో వారంలో బస్సు యాత్ర
- యాత్ర మధ్యలో రాహుల్ బహిరంగ సభ
- నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల యోచన
- షరతుల్లేని చేరికలకు ఓకేనని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో 60–65 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై స్పష్టత వచ్చిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. డిసెంబర్‌లోనే ఎన్నికలు జరిగే అవకాశముందని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చూస్తే ఎన్నికల వాతావరణంలోకి ప్రవేశించినట్లే అనిపిస్తోందన్నారు. పార్టీ సంస్థాగత, రాజకీయ పరిస్థితులకు సంబంధించిన పలు అంశాలను సోమవారం గాంధీభవన్‌లో ఉత్తమ్ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రియాశీలకంగా ఉన్న ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, కార్యదర్శులను కొనసాగిస్తామని.. అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న నేతల స్థానంలో ఉత్సాహవంతులకు అవకాశమిస్తామన్నారు. ప్రస్తుతం 10 జిల్లాల డీసీసీ అధ్యక్షుల పనితీరు సంతృప్తిగానే ఉందని తెలిపారు. కేంద్రంతోపాటు టీఆర్‌ఎస్ కూడా 31 జిల్లాలను గుర్తించినట్లు లేదని.. కొత్త జిల్లాలకు అధ్యక్షులను టీఆర్‌ఎస్ నియమించలేదన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతం ఆధారంగా పార్టీ నిర్మాణం ఉండేలా యోచిస్తున్నామని, ఇందుకు నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను అధికారికంగా ప్రకటిస్తే సరిపోతుందని చెప్పారు.

పవన్ యాత్రపై ఇప్పుడేమీ మాట్లాడలేం

ఫిబ్రవరి రెండో వారంలో బస్సుయాత్ర చేస్తామని, ప్రతి నియోజకవర్గం పర్యటించేలా యాత్ర ఉంటుందని తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల రోజుల్లో యాత్రను ఆపుతామన్నారు. జూన్ 2న బహిరంగసభ నిర్వహించనున్నామని, యాత్ర మధ్యలోనూ రాహుల్‌తో బహిరంగసభ ప్రతిపాదన ఉందన్నారు. కాంగ్రెస్‌లో చేరేవారందరికీ ప్రాధాన్యం ఉంటుందని.. టికెట్ల హామీ ఇస్తే చేరుతామనే వారి విషయంలో పరిమితులున్నాయన్నారు. పరిస్థితులు, ప్రాంతం ఆధారంగా టికెట్ల హామీ అందరికీ సాధ్యం కాదని.. అవకాశాలను బట్టి పార్టీలో పనిచేసే వారందరికీ ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనేక మంది టీఆర్‌ఎస్, బీజేపీ నేతలు తమకు టచ్‌లో ఉన్నారని, ఫిబ్రవరి రెండోపక్షంలో చేరికలు ఉంటాయని తెలిపారు. పవన్ యాత్రపై ఇప్పుడేమీ మాట్లాడలేమని, యాత్రలో మాట్లాడే అంశాలను బట్టి స్పందిస్తే బాగుంటుందని చెప్పారు.

దక్షిణ తెలంగాణలో స్వీప్ చేస్తాం: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా 70 స్థానాలకు తక్కువ కాకుండా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ అభ్యర్థులు పూర్తిగా విజయం



సాధిస్తారని, రంగారెడ్డి జిల్లాలో 12 స్థానాలు కాంగ్రెస్‌వేనని చెప్పారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం టీడీపీ నేతలు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ఇప్పటికే 31 రిజర్వుడు నియోజకవర్గాల్లో ఎల్‌డీఎంఆర్‌సీ కార్యక్రమంతో పార్టీని పటిష్టం చేశామన్నారు. జనరల్ నియోజకవర్గాల్లోనూ కార్యక్రమం చేపడతామని చెప్పారు. పోలింగ్ బూత్ స్థాయి కమిటీలను సిద్ధం చేస్తున్నామని.. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది నేతలతో సైన్యం సిద్ధమవుతోందన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ తొలి సీఎం కేసీఆర్.. కళ్లు నెత్తికెక్కి నియంతృత్వ, అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కుటుంబమే బంగారుమయం అయిందని.. దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలు సంతోషంగా ఉంటాయని చెప్పారు.

దూర విద్యా కోర్సుల ప్రవేశ గడువు పొడిగింపు

హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం దూర విద్యా కోర్సుల ప్రవేశ గడువును పొడిగించారు. రూ.300 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 28 వరకు ఫీజును చెల్లించవచ్చని దూరవిద్యా కేంద్రం ఇన్‌చార్జీ డైరెక్టర్ డాక్టర్ భాగవతుల సేతురాం సోమవారం తెలిపారు. మరిన్ని వివరాల కోసం తెలుగు విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో లేదా www.teluguuniversity.ac.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

‘అన్ని రంగాల్లో రాష్ట్రం దూసుకెళ్తోంది’



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్లడానికి ఉద్యోగులు అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రభుత్వ సీఎస్ ఎస్పీ సింగ్ కొనియాడారు. సోమవారం సచివాలయంలో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని టీఎన్జీవో గౌరవాధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు మమతతో కలిసి ఆవిష్కంచారు. రైతులకు 24 గంటల విద్యుత్, భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు దేశం దృష్టిని ఆకర్షించాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్రం కోసం పుట్టిందని, నేడు ప్రభుత్వ పథకాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. 2018 జూలై నుంచి కొత్త పీఆర్సీ అమలుతో పాటు ఆర్డర్ టు సర్వ్ కింద ఉన్న ఉద్యోగులను ఫైనల్ అలాట్‌మెంట్ చేయాలని మమత కోరారు.

టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ కానుక

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఉద్యోగులకు రూ.13,125 చొప్పున బ్రహ్మోత్సవ కానుక ఇచ్చేందుకు అనుమతిస్తూ దేవాదాయ శాఖ ఏపీ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గత సెప్టెంబర్ 23 నాటికి టీటీడీలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, టైంస్కేలు ఉద్యోగులకూ రూ.6,562 చొప్పున కానుకగా ఇచ్చేందుకు అంగీకరించారు.

సాక్షి
మంగళవారం, జనవరి, 23

ట్రంప్ కళ్లు తెరుస్తారా?!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికార పీఠం ఎక్కి ఏడాదికాలం పూర్తయిన ప్రస్తుత తరుణంలో ఆయన సాఫల్య వైఫల్యాలపై చర్చించాల్సింది పోయి ఆయన పదవి ఉంటుందా, ఊడుతుందా అన్నదే అందరికీ ఉత్కంఠ రేపే అంశమైంది. ముఖ్యంగా నీలి చిత్రాల తార స్టార్మీ డేనియల్స్‌తో పదేళ్లక్రితం ఆయనకున్న సంబంధాలు, అవి బయటపడకుండా ఉండటం కోసం ఆమెకు భారీ మొత్తంలో డబ్బు వెదజల్లి నోరుమూయించిన వైనం వెల్లడై అల్లరవుతోంది. ఈలోగా పులి మీద పుట్రలా అమెరికా ప్రభుత్వం మూతబడి చర్చంతా దానిపైకి మళ్లింది. ట్రంప్ పదవికి ముప్పు తీసుకురాగల వివిధ అంశాల జాబితాలో అది కూడా చేరింది. అమెరికాలో ఇలా జరగడం ఇది మొదటిసారి కాదు గనుక, ఇప్పుడొచ్చిన ఈ తాజా సంక్షోభం రేపో మాపో సమసిపోతుందన్న ఆశ అందరిలోనూ ఉంది. కానీ ట్రంప్ స్థానంలో మరొకరెవరైనా ఉన్నట్టయితే సమస్య ఇంత ముదిరేది కాదన్నది వాస్తవం. సంప్రదాయానికి విరుద్ధమైన తోవన వెళ్లి 'ఎలాగోలా' బిల్లును గట్టెక్కించుకోవడానికి ఆయన అంతా సిద్ధం చేశారని అంటున్నారు. అదే జరిగితే తాత్కాలికంగా ఈ సమస్య నుంచి బయటపడినా భవిష్యత్తులో రిపబ్లికన్ పార్టీకి అదో పెద్ద గుదిబండగా మారకతప్పదు.

అమెరికా సర్కారు మూతబడి అప్పుడే మూడురోజులు కావస్తోంది. శుక్రవారం అర్ధరాత్రితో మొదలైన ఈ సంక్షోభం ఆదివారానికల్లా ఓ కొలిక్కి వస్తుందని, అధికార రిపబ్లికన్ పార్టీ, విపక్ష డెమొక్రటిక్ పార్టీ ఒక అవగాహనకొచ్చి ఈ గండం నుంచి దేశాన్ని గట్టెక్కిస్తాయని అందరూ ఆశించారు. కానీ అదేం జరగలేదు. ఫలితంగా వైట్ హౌస్‌లో పనిచేసే సిబ్బందిలోనే చాలామందిని విధుల నుంచి తాత్కాలికంగా తప్పించాల్సివచ్చింది. సైన్యంలో కొత్తగా చేరినవారికి ఇస్తున్న శిక్షణ ఆగిపోయింది. జాతీయభద్రతా విభాగంలో, మరికొన్ని అత్యవసర విభాగాల్లో సిబ్బంది మినహా మిగిలినచోట్ల వేతనాలు లేని సెలవు మంజూరు చేశారు. విద్య, గృహ నిర్మాణం, పర్యావరణం, వాణిజ్యం వగైరా విభాగాల్లోని వేలాదిమంది ఉద్యోగులు ఇళ్లకే పరిమితమయ్యారు. న్యూయార్క్‌లోని స్వేచ్ఛాప్రతిమ ఉండే పార్క్‌తోసహా దేశంలోని మూడోవంతు పార్కులు మూతబడ్డాయి. మ్యూజియంలకు తాళాలు వేశారు. చాలినంతమంది సిబ్బంది లేకపోవడంతో ఆ దేశ ప్రైవేటు అంతరిక్ష యాన సంస్థ స్పేస్ ఎక్స్ భారీ రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. ఇలా ఎనిమిది లక్షలకు పైగా సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎప్పుడు సంక్షోభం సమసి తమకు మళ్లీ కొలువుకు పిలుపు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

వాస్తవానికి ట్రంప్‌కు దిగువసభలోనూ, సెనేట్‌లోనూ కూడా మెజారిటీ ఉంది. దిగువసభలోని 435మంది సభ్యుల్లో 238మంది రిపబ్లికన్లు. డెమొక్రాట్ల సంఖ్య 193 మాత్రమే. అటు సెనేట్‌లో ఉన్న 100 మంది సభ్యుల్లో 51మంది రిపబ్లికన్లు. 47మంది డెమొక్రాట్లు. దిగువ సభలో ఉన్న మెజారిటీతో వినిమయ బిల్లును సులభంగా గట్టెక్కించుకోగలిగిన ట్రంప్ సెనేట్‌లో బోల్తా పడ్డారు. వినిమయ బిల్లు ఆమోదానికి సాధారణ మెజారిటీ సరిపోదు గనుక మరో పది ఓట్లు రిపబ్లికన్లకు తప్పనిసరి. కనుకనే కొందరు డెమొక్రటిక్ సభ్యులతో మంతనాలు జరిపి వారిలో అయిదుగురిని అనుకూలురుగా మార్చుకున్నారు కూడా. ఈలోగా స్వపక్షంలోని అయిదుగురు వినిమయ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయడంతో ఆ వ్యూహం వృథా అయింది. దీనికి పరిష్కారం కనుచూపు మేరలో లేదనుకుంటే దేశాధ్యక్షుడు తన ప్రత్యేకాధికారాలు ఉపయోగించి సాధారణ మెజారిటీతో బిల్లు ఆమోదం పొందడానికి అనుమతించవచ్చు. అమెరికా చరిత్రలో 1976 మొదలుకొని ఇంతవరకూ 18సార్లు ఇలా ప్రభుత్వం మూతబడిన సందర్భాలు ఎదురైనా ఏ అధ్యక్షుడూ ఈ అధికారాన్ని వినియోగించుకోలేదు. ప్రతిపక్షంతో ఓపిగ్గా చర్చించి, వారి అభిప్రాయాలకు కూడా ప్రాధాన్యమిచ్చి ఏదో విధంగా సంక్షోభాలను అధిగమించారు. ఇలా విపక్షానికి విలువ ఇవ్వడం వెనక ఓ భయం కూడా ఉంది. ఇటువంటి కీలకమైన బిల్లును సాధారణ మెజారిటీతో ఆమోదించవచ్చునన్న మినహాయింపునిస్తే భవిష్యత్తులో తమ ప్రత్యర్థి పక్షం కూడా అధికారంలోకొచ్చి ఆ మాదిరే వ్యవహరిస్తుందని అటు డెమొక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు కూడా ఈ ప్రత్యామ్నాయాన్ని ఇంతవరకూ ఎంచుకోలేదు. కానీ ట్రంప్ ఇప్పటివరకూ వచ్చిన అధ్యక్షుల్లో మొండి ఘటం. ఎప్పుడో ఏదో అవుతుందని భయపడుతూ తలొంచడం ఆయనకు ససేమిరా ఇష్టం లేదు. ఈ విషయంలో పార్టీ సలహాను కూడా ఆయన బేఖాతరు చేయొచ్చని చెబుతున్నారు.

ఇంతకూ డెమొక్రాట్లు అడుగుతున్నవి గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. అక్రమంగా అమెరికాకు వచ్చి నివాసం ఉంటున్నవారి పిల్లల(స్వాప్నికులు) విషయంలో పునరాలోచించాలని, వారిని వచ్చే మార్చిలో బలవంతంగా బయటకు తరిమేసే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండు చేస్తున్నారు. నిజానికి ట్రంప్ ఏడాది పాలనలో స్టాక్ మార్కెట్‌లో తళతళలున్నాయి. ఉపాధి అవకాశాలు కూడా అంతో ఇంతో పెరిగాయి. కానీ ప్రభుత్వ రుణం ప్రకోపిస్తోంది. రష్యాతో లాలూచీ, ఇరాన్‌తో కొత్త పేచీలు, ఉత్తర కొరియాతో కయ్యం, నీలి చిత్రాల తారతో సంబంధాలు వగైరా అంశాల్లో ఆయన జనాదరణ గ్రాఫ్ పడిపోతోంది. వీటన్నిటి పర్యవసానంగా వచ్చే నవంబర్‌లో కాంగ్రెస్‌కు జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని జనం ఛీకొడతారన్న భయం కూడా ఆయనలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వలసల విషయంలో మొండిగా ఉన్నట్టు కనబడితేనే అధ్యక్ష ఎన్నికల సమయంలో వలే శ్వేత జాతి అమెరికన్లు తనవైపే ఉండగలరని ఆయన విశ్వసిస్తున్నారు. అందుకోసమే తాజా సంక్షోభం విషయంలో పట్టువిడుపుల్లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం ఉంటుందని, సాధించిన కొద్దో గొప్పో విజయాలను కాస్తా ఊడ్చిపెట్టేస్తుందని ట్రంప్ గ్రహించకపోతే అంతిమంగా అది ఆయన మెడకే చుట్టుకోవడం ఖాయం. కోట్లాదిమంది పౌరుల జీవితాలతో, వారి భవిష్యత్తుతో ముడిపడి ఉండే కీలకమైన వ్యవహారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలతో, పరువు ప్రతిష్టలతో తూచడం తగని పని.



ప్రభుత్వం స్తంభించి పోవడం అంటే ప్రజలపై పరోక్ష యుద్ధానికి తెరతీయడమే. దీనికంటే విదేశీ భూభాగంలో శత్రువుతో పోరాడటం సులువు, ఉత్తమం.

– మైక్ రోజెర్స్
రిపబ్లికన్ పార్టీ మాజీ సెనేటర్

గ్రహం అనుగ్రహం


శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.షష్ఠి ప.12.35 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం రేవతి తె.4.53 వరకు (తెల్లవారితే బుధవారం), వర్జ్యం సా.4.51 నుంచి 6.27 వరకు దుర్ముహూర్తం ఉ.8.49 నుంచి 9.33 వరకు, తదుపరి రా.10.54 నుంచి 11.44 వరకు, అమృతఘడియలు రా.1.27 నుంచి 4.03 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.45
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.34	మగ్రీబ్	6.06
జొహర్	12.28	ఇషా	7.22
అసర్	4.30		

పరిణామమే ప్రథమ శత్రువు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ఆయన ప్రపంచ విజ్ఞానశాస్త్రాన్ని ప్రభావితం చేసి, మానవ వికాస చరిత్ర పుట్టుపూర్వోత్తరాలను వెల్లడించిన డార్విన్ రచనను స్వయంగా అధ్యయనం చేయలేదనీ, వినికిడి మీదనే పరిణామవాదాన్ని ద్వేషించిన ఫలితంగానే డార్విన్ సిద్ధాంతాన్ని ఆడిపోసుకుంటున్నారనీ భావించక తప్పదు. మానవ ఆవిర్భావం, వికాసం, ప్రకృతికీ ఉన్న అనుబంధాన్ని తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు శాస్త్రీయ, అశాస్త్రీయ ధోరణులకూ, దృక్పథాలకూ కారణాలను తవ్వితే పరివార్ ప్రగతి నిరోధక మూఢ విశ్వాసాల వ్యాప్తికి గండి పడుతుందని భయం.

చదవేస్తే ఉన్న మతి పోయిందట. సాటి కవి ఒకరు కుకవితను కవితగా చలామణీ చేయబోతే తెనాలి రామలింగడు అది వినలేకపోయాడని జన బాహుళ్యంలో ఓ కథ ఉంది. ఆ కుకవితని తట్టుకోలేక, 'ఉమ్మెత్త కాయలు తిని చెప్పావా?' అంటూ ఎత్తిపొడిచాడట. చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం గురించి కేంద్రంలోని బీజేపీ– పరివార్ సర్కార్‌లో మానవ వికాస మంత్రిత్వ శాఖ అమాత్యులు సత్యపాల్ సింగ్ చేసిన వ్యాఖ్యానాలు ప్రజలకు కర్ణకఠోరంగానే భాసించాయి. మన పాఠశాలలు, కళాశాలల్లో బోధిస్తున్న పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించివేయాలని ఆయన (20–1–2018)ఒక సరికొత్త ప్రతిపాదనను ముందుకు నెట్టారు.

ఆధారం ఎక్కడిది అమాత్యా?

శాస్త్ర పరీక్షకీ, కాల పరీక్షకీ నిలిచిన ఆ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా ఎందుకు తొలగించాలి? అది నిరూపితం కాకుండానే 'అది శాస్త్రీయంగా తప్పుడు సిద్ధాంతం' అని ప్రకటించారు. విద్యాధికుడు కూడా అయిన ఆ అమాత్యుడు 'వానరం (కోతి) మనిషిగా పరిణమించినట్టు మన పూర్వీకులు చెప్పలేదు', కాబట్టి డార్విన్ పరిణామవాదం చెల్లదని దబాయించేందుకు యత్నించారు. అయితే ఏ 'శాస్త్రీయ' నిరూపణ ద్వారా (పూర్వీకులు అన్న పదం మినహాయించి) డార్విన్ సిద్ధాంతాన్ని తాను తోసిపుచ్చడానికి సాహసించారో కూడా ఆ అమాత్యుడు వెల్లడించలేదు. 'భూమ్మీద కనిపించిన మనిషి యథాతథంగానే ఉండిపోయాడు గానీ వేరే పరిణామం ఎక్కడిది?' అంటూ తన పేరులోని 'సత్య'రూపాన్ని సైతం విస్మరించి ఆ అమాత్యుడు వైదిక పురాణ ప్రేలాపనలో మునిగిపోయారు.

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, భౌతిక, రసాయన శాస్త్రవేత్తలు, ఉద్దండ పరిశోధకులు గుర్తించిన డార్విన్ పరిణామవాదాన్ని నిరాకరించడం ఓ వికృత సాహసం. విద్యాధికులంతా భౌతికవాదులు కానక్కరలేదు. నైతిక వాదులుగా ఉంటూ కనీసం వివేకానందస్వామి వంటి ఆచరణాత్మక వేదాంత ప్రవచకులుగా ఉన్నా కొంత నయమే. కార్యకారణ సంబంధి అయిన హేతువుకు నిలబడలేని వాదనలకు అలవాటు పడినవారంతా నాస్తికులుగా మారడం శ్రేయస్కరమన్న మహనీయుడు వివేకానందుడు. ఇప్పటి విద్యాధికులైన కొందరు ఐపీఎస్/ఐఏఎస్ అధికారులు కూడా పేరుకు ఆధ్యాత్మిక విలువల చాటున అన్ని రకాల భౌతిక సుఖాలను దండిగా అనుభవిస్తున్నవారే. మన కథానాయకుడు సత్యపాల్ కూడా ఈ కోవకు చెందినవారే అయి ఉండాలి. బహుశా అందుకే ఔరంగాబాద్ (మహారాష్ట్ర)లో ప్రారంభమైన వైదిక సమ్మేళనానికి హాజరై ఉంటారు. 'మన పూర్వీకులు సహా ఎవరూ లిఖిత పూర్వకంగా గానీ వాచా గానీ వానరం మానవుడిగా పరిణమించినట్టు చెప్పలేదు' అని ఆ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మంత్రి అన్నారు. ఈ పరిణామం గురించి మన తాతముత్తాతలు ఏ గ్రంథంలోనూ వివరించలేదని సత్యపాల్ వాదన. దీనిని బట్టి అర్థం చేసుకోవలసినది ఒకటి ఉంది. సత్యపాల్ విద్యాధికుడు, రసాయనిక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా సాధించుకున్నారు. ఉద్యోగావకాశాలు దండిగా వినియోగించుకున్నారు. అయినా కూడా ఆయన ప్రపంచ విజ్ఞాన శాస్త్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేసి, మానవ వికాస చరిత్ర పుట్టుపూర్వోత్తరాలను వెల్లడించిన డార్విన్ రచనను స్వయంగా అధ్యయనం చేయలేదనీ, వినికిడి మీదనే పరిణామవాదాన్ని ద్వేషించిన ఫలితంగానే డార్విన్ సిద్ధాంతాన్ని ఆడిపోసుకుంటున్నారనీ భావించక తప్పదు. కారణం–మానవ ఆవిర్భావం, వికాసం, ప్రకృతికీ ఉన్న అనుబంధాన్ని తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు శాస్త్రీయ, అశాస్త్రీయ ధోరణులకూ, దృక్పథాలకూ కారణాలను తవ్వి తీస్తే పరివార్ వర్గీయుల ప్రగతి నిరోధక మూఢ విశ్వాసాల వ్యాప్తికి

రెండో మాట



గండి పడుతుందని భయం.

మేధో వికాసమంటే భయం

నేడు మన అనుభవంలోకి వస్తున్న ప్రతి నూతన భౌతిక ఆవిష్కరణలు రోజుకొక తీరున కనువిందు చేస్తున్నాయి. నిజానికి అవన్నీ మానవ పరిణామ వాద ఫలితాలే. కానీ ఈ సత్యాన్ని గ్రహించలేకపోవడం ఎందుకంటే అంధ విశ్వాసాల ఫలితమే. మానవుడు సాధిస్తున్న విజ్ఞాన శాస్త్ర విజృంభణను అనుభవిస్తూ కూడా గుర్తించడానికి 'సిగ్గు'పడిపోవడం కూడా. జీవశాస్త్ర సంబంధమైన ఒక పరిణామవాదాన్ని కనుగొని నిరూపించిన డార్విన్ మహాశయుడిని కీర్తిస్తూ కారల్‌మార్క్స్ ఇలా అన్నారు: 'అంతవరకూ ప్రకృతి గురించిన అశాస్త్రీయ అవగాహననే డార్విన్ మార్చి జీవశాస్త్ర రహస్యాలెన్నింటినో ఆవిష్కరించాడు. పరిణామవాదానికి ఆయన శాస్త్రీయ పునాదులు వేసి బలవర్ధకం చేసిన తరువాతనే ప్రపంచం నలుమూలలా విజ్ఞాన శాస్త్ర అవగాహన రెక్కలు విప్పుకుంది, మానవాళి మనోనేత్రాలు వికసించాయి. మానవ సేంద్రియ, నిస్సేంద్రియ ప్రకృతి మధ్య అంతరాన్ని ప్రయోగాలతో నిరూపించడం జరిగింది' అని చెప్పారు. జీవశాస్త్ర పరిణామవాదంలో అసలు రహస్యాన్ని మార్క్స్ ఇంకా ఇలా వివరించాడు: 'మొత్తం మానవాళి సంపదకంతకూ మూలం శ్రమశక్తి. మానవుడిని సృష్టించి తీర్చిదిద్దిన శక్తి. డార్విన్ సరిగ్గా ఈ మన పూర్వీకుల గురించిన పరిణామాన్ని వర్ణించాడు. మానవుడి వికాసానికి సంబంధించిన ఈ అన్యోన్య సూత్రం ('కొరిలేషన్ ఆఫ్ గ్రోత్') ద్వారానే మానవ శరీరం ప్రయోజనం పొంది పరంపరాభివృద్ధి చెందింది' అన్నాడు. మన గతితార్కిక పునాదులన్నీ ఈ ప్రకృతిలోనే పొదిగి ఉన్నాయనీ, తాను బతికి బట్టకట్టడానికి మానవుడు ఎంత ఘర్షణపడతాడో ఆ ఘర్షణాత్మక పోరాటమే డార్విన్ పోరాటమనీ, ఇది ప్రకృతి నుంచి మానవ సమాజానికి సహజంగానే బదిలీ అయిన పోరాటమనీ మార్క్స్ అభివర్ణించాడు. డార్విన్ పరిణామవాద సిద్ధాంతంలో అంతర్లీనంగా ఉన్న ఈ ఘర్షణ స్వభావంతోనే, కొన్ని మత శక్తులూ, కులీన వర్గాలూ, సంపన్నులూ; వీరికి వత్తాసుగా మెట్ట సిద్ధాంతాలు వల్లించే రాజకీయ శక్తులూ ప్రపంచవ్యాపితంగా చాలాకాలంగా డార్విన్ 'పరిణామవాదాన్ని'(థియరీ ఆఫ్ ఇవల్యూషన్) వ్యతిరేకిస్తూ వక్రభాష్యాలు వల్లిస్తున్నారు.

ఆ క్రమంలోనే మన 'పరివార్' సిద్ధాంతి సత్యపాల్ కూడా కొత్త సీసాలో పాత సారా నింపి ప్రచారంలోకి దిగారు. అందుకే శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, విద్వత్ సంస్థలూ మంత్రి ప్రకటనను ఖండించాల్సి వచ్చింది. మానవుడు ప్రకృతి అంగ సౌష్ఠవంలో ఒక భాగమేనన్నాడు డార్విన్. అందుకే, ఈ పరిణామక్రమంలోనే ముందు తొలి మానవుడు (హోమో ఎరెక్టస్) అనీ, ఆధునిక మానవుడిని 'హోమో సెపైన్' అనీ, తిరిగి సృష్టికర్తగా మారిన ఆ మానవుడిని ఆలోచనాపరుడిగానూ (హోమో షేబర్) శాస్త్రవేత్తలు నామకరణం చేయవలసి వచ్చింది. పరిణామక్రమం స్వాభావికమైన (నేచురల్ సెలెక్షన్) అన్నాడు డార్విన్. ఈ మాట విన్నప్పుడు 'ఋగ్వేదం'లో 'నాసదీయ సూక్తం'లో ఆణిముత్యం లాంటి వాదన వినిపించింది: 'మనిషిని సృష్టించింది దేవుడ'ని ఒకరంటే, సూక్తికారుడు 'మరి ఆ దేవుడిని సృష్టించిందెవర'ని ఎదురు ప్రశ్నిస్తే సమాధానం కరువై వాదకుడి నోరు మూసుకుపోయింది. ప్రాచీనమైనదంతా మేలైన సరుకని మోసపోరాదని కాళిదాసు మహాకవి ('పురాణమిత్యేవ న సాధు సర్వమే') చెప్పాడు.

వికటకవి ప్రశ్నలు అనంతం

అలాంటి మేలిమి సరుకును మైథిలీ సాహిత్యంలో ఉద్దండ పిండమూ, సర్వోన్నతమూర్తిగా పేరుపొందిన ఆచార్య హరిమోహన్ ఝా 'పురాణ ప్రలాపం' పేరిట ఒక 'వికటకవి' పాత్రతో ఛాందస సంప్రదాయాలను, విశ్వాసాలను వ్యంగ్య వినోద ప్రసంగంతో ప్రశ్నింపచేశారు. రామాయణం, భారతం, భగవద్గీత, జ్యోతిషం, ప్రాచీన, వైదిక సాహిత్య ఆధారాల ద్వారానే తూర్పారబడుతూ 'వికటకవి' చెప్పిన మాటలు వినండి: 'మన ప్రాచీన శాస్త్ర వచనాలు ఎక్కడినుంచి ఊడిపడ్డాయ'న్న ప్రశ్నకు సమాధానం: 'ఈ శ్రుతులు, స్మృతులు ఆకాశం నుంచి ఊడిపడలేదు. ఏది వినడం జరిగిందో అది 'శ్రుతి', ఏది జ్ఞాపకం ఉండిపోయిందో అది 'స్మృతి' అయింది. ఏ మాట ఎప్పుడు ఏ ఉద్దేశంతో ఎవడు చెప్పడం జరిగిందో, దాని సందర్భం ఏమిటో ప్రజలు మర్చిపోయారు. ఆ మాటల్ని మాత్రం కళ్లు మూసేసుకుని తలపైన పెట్టుకుని మోసుకొస్తున్నాం'. అలాగే 'ప్రాచీనులు చెప్పారని మోసుకొచ్చే 'శాస్త్ర వచనాల'కు ఏమైనా వైజ్ఞానికమైన ఆధారం, పాడూ ఉందేదా' అన్న ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పించాల్సి వచ్చింది: 'వైజ్ఞానిక ఆధారం లేకపోయినా వాటికి మనోవైజ్ఞానిక ఆధారం మాత్రం ఉంది. ఎవరో బ్రాహ్మడు నదిలో స్నానం చేసేటప్పుడు ప్రవాహంలో కొట్టుకుపోయి ఉంటాడు. అప్పుడాయన బొడ్డు (నాభి)కి మించి లోతు ఉన్న నీళ్లలో నిలబడి స్నానం చేయకూడదని నిశ్చయించుకున్నాడు. ఇంకేముంది నియమం పెట్టేశాడు: సరిగ్గా నాభివరకు ఉన్న నీళ్లలోనే స్నానం చేయాలి. నీళ్లు అంతకు ఎక్కువ ఉంటే నీ ఆయువు నశిస్తుంది, తక్కువ ఉంటే నీ తపస్సు నశించిపోతుంది'అని. మరొకాయన మీకు 'జ్యోతిషంమీద నమ్మకం ఉందా' అని ప్రశ్నిస్తే 'వికటకవి' పండితుడు ఇచ్చిన సమాధానం: 'ఈ జ్యోతిషమే గనక నిజమైతే, నేను ఇప్పటికి 2,500 సార్లు చచ్చిపోయి ఉందును' అని.


అంతేగాదు, 'మన ప్రాచీన పండితమ్మన్యులు రాజభోగాలకు అలవాటుపడి ప్రజలను తమ అధీనంలో ఉంచుకునేందుకు కొన్ని బంధనాలు సృష్టించారు. పశువుల కాళ్లు కట్టేస్తారు చూశావా! అలాగ. ప్రతి విషయంలో ప్రభుత్వాలు విధించలేని నిబంధనలు విధించారు. ప్రభుత్వమైనా ఆదివారం సెలవిస్తుందేమో కానీ, మన శాస్త్రకారులు ఆ రోజు విషయంలో ముగుతాడు మరింతగా బిగించేశారు. ధర్మశాస్త్రంలో వారికి ఏదైనా కొరత కనిపించిందా, దాన్ని కాస్తా జ్యోతిషంతో పూర్తి చేశారు. మనువు, యాజ్ఞవల్క్యుడు ధర్మమనే బేడీలు ప్రజల చేతులకు బిగించారు. భృగువు, పరాశర మునులు, మహర్షులు కాళ్లకు కాలపు సంకెళ్లు తగిలించారు. ఈ దేశంలో బంధనాలకు ముఖ్య కారణం– 'శ్రుతులు, స్మృతులు, జ్యోతిషం, పురాణాలు' అని 'వికటకవి' ద్వారా హరిమోహన్ తేల్చిపారేశాడు. ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి కనిపించని దేవుడికి మొక్కుకునేకన్నా కార్యకారణ సంబంధాన్ని వడపోసి వెన్నముద్దను చేతిలో పెట్టే హేతువాదాన్ని ఆశ్రయించమన్నాడు గణిత శాస్త్రవేత్త యూక్లిడ్ (క్రీ.పూ. 300). మన ఆర్యభట్టను, భాస్కరాచార్యను వెనక్కి నెట్టేసి, మన గణిత శాస్త్రాన్ని గ్రీకులకు అప్పగించి, పనికిమాలిన గ్రీకుల జ్యోతిష శాస్త్రాన్ని మాత్రం మనం దిగుమతి చేసుకున్నామని వివేకానందుడన్నమాట అక్షర సత్యం.

abkprasad2006@yahoo.co.in

ఇళ్లు చూపే అంతరాలు

ముంబైలో మురికివాడల ఉనికిని చాలామంది గుర్తించనప్పటికీ నగర ఆర్థిక వ్యవస్థకు బాగా దోహదం చేస్తున్న పలు పరిశ్రమలు అక్కడే ఉన్నాయన్న వాస్తవాన్ని మర్చిపోరాదు. నిజానికి మురికివాడలు లేకుంటే ముంబై స్తంభించిపోవచ్చు.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

భూమ్మీద సంపన్నులు, పేదల మధ్య అంతరం మరీ కొట్టొచ్చినట్లు కనిపించే నగరం ఉందంటే అది ముంబైనే అని చెప్పాలి. దేశంలోనే అతి సంపన్నుడైన ముఖేష్ అంబానీ నివసిస్తున్న 27 అంతస్తుల నివాస భవనం ఇక్కడే ఉంది. 36 ఫ్లోర్లతో టెక్స్‌టైల్ టైకూన్ గౌతమ్ సింఘానియా నిర్మించిన భారీ భవంతీ ఇక్కడే ఉంది. అనిల్ అంబానీ 19 ఫ్లోర్ల భవనంలో ఉంటున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఛగన్ భుజ్‌బల్ తన కుటుంబం కోసం తొమ్మిదంతస్తుల భవంతి నిర్మించుకున్నారు. ఎంపీ, నటుడు శత్రుఘ్న సిన్హా ఏడు ఫ్లోర్లతో కూడిన నివాసంలో కుటుంబంతో ఉంటున్నట్లు తెలిసింది. ఈ సామాజిక శ్రేణిలో ఉంటున్న ఇతరులకు కూడా అద్భుత భవనాలు ఉన్నాయి కానీ పైన చెప్పిన ఆకాశ హర్మ్యాలు వీరికిలేవు.

ఈ సంపన్నుల సంపదపై లేక వారి డాంబికాలతో నాకు పేచీ లేదు. కానీ ఇదీ కొన్ని పోలికలకు తావిస్తోంది. నందన్ నీలేకని రాసిన 'ఇమేజింగ్ ఇండియా: ఐడియాస్ ఫర్ ది న్యూ సెంచురీ' పుస్తకంలో ఆసియాలోనే అతి పెద్ద మురికివాడగా చెబుతున్న ధారవిలో ఉన్న తుక్కు, తోలు, రీసైక్లింగ్ పరిశ్రమ సంవత్సరానికి 1.7 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆదాయాన్ని సృష్టిస్తోందని తెలిపారు. ఇది అంబానీ నూతన గృహ నిర్మాణానికి పెట్టినంత వ్యయానికి సమానమని అంచనా. ఈ ఆకాశహర్మ్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తుండగా, కనిపించని గుడిసెలు ముంబైలో అధిక భాగంలో వ్యాపించి ఉన్నాయి. వర్ధిల్లుతున్న ఆర్థిక వ్యవస్థతో అతి పెద్దనగరంగా ముంబైకి ఉన్న ప్రతిష్టను ఇది పలుచబారుస్తోంది. మురికివాడల శ్రమతో ముంబై ఆర్థిక వ్యవస్థకు కలుగుతున్న తోడ్పాటును ఆర్థికవేత్తలెవరూ అర్థం చేసుకోలేదు. మురికివాడలు లేకుంటే ముంబై నగరం స్తంభించిపోవచ్చు.

మురికివాడల పునరావాస ప్రాధికార సంస్థ ముంబై నగరంలో 12.5 లక్షల గుడిసెల్లో 62 లక్షల మంది గుడిసెవాసులు ఉన్నట్లు తేల్చింది. 1995కి ముందునుంచీ నగరంలో ఉన్న గుడిసె వాసులకు ఉచితంగా గృహాలను కల్పిస్తామని మొదట్లో చెప్పారు. తర్వాత దానిని 2000 సంవత్సరం వరకు పొడిగించారు. ఇక్కడ చెప్పొచ్చే అంశం మురికివాడల ఉనికి, నత్తనడకన నడుస్తున్న వాటి పునరావాసం మాత్రం కాదు. మురికి వాడలు, గుడిసెవాసుల పట్ల అనుసరిస్తున్న వైఖరి ఇక్కడ చర్చనీయాంశం. ఇటీవలే నగరంలోని అసల్ఫా మురికివాడ సుందరీకరణలో భాగంగా దాని వెలుపలి గోడలకు రంగులద్దారు. గుడిసెవాసుల జీవితాలకు కాస్త రంగులద్దడం అన్నమాట. కంటికి వికారంగా ఉండే వారి జీవితాలను పరోక్షంగా చిన్నచూపు చూసే చర్య ఇది.

మురికివాడలకు వెలుపల ఉన్నవారు నగరంలో మురికివాడలు ఉన్నాయన్న విషయాన్ని నమ్మేందుకు కూడా ఇష్టపడరు. పైగా నగరాన్ని వృద్ధి చేయడంలో



వారి పాత్రను గుర్తించాలని కూడా వీరు భావించరు. అనియత రంగంలో చాలాభాగం మురికివాడల నిర్వహణలోనే సాగుతోంది. మీ ఇళ్లలో పనిమనుషులు, మీ డ్రైవర్లు లాగే ఫైవ్ స్టార్ హోటల్స్‌లో వెయిటర్లు కూడా ఈ మురికివాడలకు చెందినవారే. చాలా సందర్భాల్లో వీరు నివసించే గుడిసెలు కుటుంబం మొత్తానికి కూడా 100 నుంచి 140 చదరపు అడుగులకు మించి ఉండవు.

పునరావాసం కింద వీరికి కల్పిస్తున్న గృహాలు 225 చదరపు అడుగుల్లో ఉంటాయి. అంటే వారు ఇంతవరకు నివసిస్తున్న నివాస ప్రాంతం ఇప్పుడు రెట్టింపు అవుతుందన్నమాట. కానీ ఇవి కూడా వారికి అందటం కష్టమే. ఎందుకంటే వీరికి గృహాలను నిర్మించి ఇవ్వవలసిన బిల్డర్లు, డెవలపర్లు మురికివాడల్లో నిర్మాణ హక్కులను పొందడమే కాకుండా అనుమతించిన మేరకు గుడిసెవాసులు కాని వారికి ఇలా కట్టిన గృహాలను అమ్ముకుంటారు. దీనికి వీరు గుడిసెవాసులకు డబ్బు చెల్లిస్తారు.

గత రెండు దశాబ్దాల్లో ఉచితంగా 1.7 లక్షల మందికి గృహ నిర్మాణ పథకాలు మంజూరయ్యాయి. వీటిలో 1,441 ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. కానీ ఇవన్నీ అమలై ఉంటే నగర గృహ కల్పన విధానంపై ఇది ప్రభావం చూపి పేదలకు మెరుగైన జీవితాన్ని అందించే అవకాశముండేది. ఇప్పుడు ప్రభుత్వం గుడిసెవాసులకు 322 చదరపు అడుగులలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తలుస్తోంది. ఈ అదనపు స్థలంలో కుటుంబాలు కాస్త సౌకర్యవంతంగా ఉంటాయి. మొదట్లో 100–140 చదరపు అడుగుల్లో ఉన్న స్లమ్ యూనిట్లు తర్వాత పునరావాసంలో 225 చదరపు అడుగులకు పెరిగాయి. తర్వాత వీటిని 269 చదరపు అడుగులకు పెంచారు. ఈ పెంపుదల ప్రభుత్వం ఉదారంగా తీసుకున్నది కాదు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 322 చదరపు అడుగుల పరిమితిని విధించింది మరి.

అందుచేత, భూమి లభ్యతపైనే ఇంటి పరిమాణం ఆధారపడుతుంది. ముంబైలో ఇళ్లలో 10 శాతం మాత్రమే సగం జనాభా ఉంటున్న మురికివాడల స్వాధీనంలో ఉన్నాయి. అందుకే ముంబైలో కొన్ని అతి భారీ భవంతులు ఉండగా మరికొన్ని బతకడానికి మాత్రమే సరిపోయే పరిమాణంలో ఉంటున్నాయి. చివరకు మురికివాడలకు దూరంగా ఉండే ప్లాట్‌లలోని వారు కూడా ప్రధానమంత్రి అవాస్ యోజన పథకంలో తలపెట్టనున్న పరిమాణం కలిగిన ఇళ్లలోనే నివసిస్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

ఒళ్లంతా ముళ్లుండే కాలం..!

''ఈ దేశంలోని ఆడదానికి ఒళ్లంతా ముళ్లుండే రోజు ఎప్పుడొస్తుందా'' అన్నారొక రచయిత్రి. స్త్రీలు అవసరమైనపుడు ఒళ్లంతా ముళ్లు పుట్టించుకుని తమను తాము రక్షించుకోగల విద్యలో తర్ఫీదు అవ్వాల్సి ఉంది.



సామాన్య

ఢిల్లీ కోర్టులో 2014లో నమోదైన ఒక కేసుపై నిన్న తీర్పు ఇస్తూ జస్టిస్ సీమా మైని ''స్త్రీ తన శరీరమంతటికీ తానే హక్కుదారు. ఆమె అనుమతి లేకుండా ఆమె శరీరాన్ని తాకే హక్కు ఎవరికీ లేదు. తీవ్ర వాంఛాపరులైన, లైంగికంగా విపరీతబుద్ధి కలిగిన మనుషులు ఇలాంటి చర్యల ద్వారా శృంగారపరమయిన కిక్కును పొందుతారు'' అని పేర్కొంటూ ఆ నేరస్తుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షను, పదివేల జరిమానాను విధించారు. తల్లితో వెళుతున్న తొమ్మిదేళ్ల పాపను జన సమ్మర్థంలో తాకరాని చోట తాకి పైశాచికపు ఆనందాన్ని పొందిన ఒక వ్యక్తికి పడ్డ శిక్ష అది. అలా తాకాలనే కాంక్ష వున్న మగవాళ్లు తమ కోరికను తమలోనే అణిచివేసుకోవాలన్నంతగా భయపెట్టే తీర్పు ఇది. అయితే మన వార్తాపత్రికలు ఆ వార్తకు అతికష్టం మీద 70 పదాల స్థలాన్ని మాత్రమే కేటాయించాయి. బహుశా మీడియాకి వున్న మగ దృక్పథమే కారణం కావచ్చు.

'భారత్ వంటి స్వేచ్ఛాయుతమైన, వేగంగా అభివృద్ధి చెందుతున్న, సాంకేతికంగా బలమైన దేశంలో, మహిళలు వారు పెద్దవారైనా లేక చిన్నపిల్లలైనా సరే.. బహిరంగ స్థలాల్లో, ప్రత్యేకించి జనంతో నిండి ఉండే మార్కెట్లు, బస్సులు, మెట్రోలలో నిత్యం బాధితులుగా కొనసాగుతుండటం దురదృష్టకరం' అన్నారు జస్టిస్ సీమా మైని. దేశంలో ప్రతిరోజు ఎన్నో అత్యాచారాలు జరుగుతుండగా వాటిలో వెలుగులోకి వచ్చే అత్యాచారాల సంఖ్యే అతి తక్కువగా ఉంటుంది. అటువంటిది బస్సులో ఏమీ తెలియనట్టు, పనిలో ఏ ఫైలో ఇస్తున్నట్టు ఎరిగీ ఎరగకుండా తాకి ఆనందపడే మగవాళ్ల సంఖ్య రోజుకి కోట్లల్లో ఉంటుంది. నమోదు చేస్తూ వెళితే ఒక్క రోజులోనే, అత్యున్నత స్థానంలో ఉండీ, తోటి మహిళాధికారి రూపెన్‌తో అసభ్యకరంగా ప్రవర్తించి, పిర్రమీద చరిచిన కేసులో జైలుపాలైన కేపీఎస్ గిల్ లాంటి వాళ్లు బోలెడు మంది కనబడతారు.

ఇలాంటి కోట్ల మంది కామ పిశాచుల అత్యాచారాలను అంతరాలు లేకుండా స్త్రీలు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఇటీవలి ఇంటర్వ్యూలో మగవాళ్లు అభ్యంతరకర రీతిలో తాకడంపై మాట్లాడుతూ కథానాయిక అనుష్క ''ఈ మధ్య హైదరాబాద్‌లో నాకిలాంటి ఓ ఘటన జరిగింది. ఆ మూమెంట్లో చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది. కానీ, అలా చేయలేం కదా. అందుకే కొట్టాను. ఆ ఘటన జరిగిన రోజు రాత్రి నిద్ర పట్టలేదు. వక్రబుద్ధి ఉన్నవాళ్లే ఇలా చేస్తారనుకుంటా'' అని పేర్కొన్నారు. అనుష్క చదువుకున్న, ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న, చుట్టూ మందీ మార్బలం ఉన్న వ్యక్తి. ఆమె ఆ క్షణంలో అనుకుని ఉంటే, చంపెయ్యాలన్నంత తన కోపానికి ఒక రూపాన్ని ఇచ్చి ఉండొచ్చు. బాంబే హైకోర్ట్ 2014లో మహేంద్ర చాటే కేసును విచారిస్తూ, 'మీరు మహిళ భుజంపై మీ చేయి ఉంచినా

ఆలోచనం



సరే, ఆ స్పర్శ స్వభావం స్నేహపూర్వకమైనదా, సోదరపూర్వకమైనదా లేక పితృవాత్సల్యంతో కూడినదా అనే అంశంపై వ్యాఖ్యానించవలసింది ఆ మహిళ మాత్రమే' అని వ్యాఖ్యానించిందని తెలిసి ఉంటే, తనని అభ్యంతరకర రీతిలో తాకిన ఆ వ్యక్తిని కొట్టడానికైనా సరే అతనికి చేయి తగిలించాల్సిన పని లేకుండా అనుష్క కేసు నమోదు చేసి ఉండొచ్చు, ఏ రెండేళ్లో జైలులో కూర్చోబెట్టి మిగిలిన ఆడవాళ్లకు ఒక సెలెబ్రిటీగా మార్గదర్శకం చేసి ఉండొచ్చు. ఆమెకైనా లేదా ఇతర స్త్రీలకైనా చట్టం తమకేం సౌలభ్యతలు కల్పిస్తుందో తమను ఎలా కాపాడుతుందో తెలియకపోవడం, ఆ చట్టాలను ఉపయోగించుకునే చొరవ, తెగువ లేకపోవడం పెద్ద లోపం.

అలా తెలిసిన స్త్రీలను కూడా మగవాళ్లు సాంప్రదాయాల పేరు చెప్పి, సామాజిక అస్పృశ్యత బూచిని చూపించి అణచిపెడుతూ ఉంటారు. మగవాళ్లు, తమను తాము రక్షించుకోవడానికి రచించుకున్న ఈ భావ జాలాలనుంచి బయటపడే తర్ఫీదు స్త్రీలకూ ఇవ్వాలి. స్త్రీవాద కవి జయప్రభ స్త్రీవాదం తొలిదశలో ''చూపులు'' అని ఒక కవిత రాశారు. ఇందులో ఆమె.. సెక్సిస్ట్ వైఖరితో ఆడదాన్ని గాయపరచగల మగవాడి చూపులెలా ఉంటాయో.. అవి ఆడవాళ్లని ఎంతగా హింస పెడతాయో చెబుతారు.. ''రెండు కళ్లనించి చూపులు సూదుల్లా వచ్చి/ మాంసపు ముద్దలపై విచ్చలవిడిగా తిరుగుతుంటాయి /చూపులెప్పుడూ ముఖంలోకి చూడవు /మాట ఎప్పుడూ మనసు నించి పుట్టదు /కనిపించినప్పుడల్లా కంపరం పుట్టేలా/ఒంటిమీద చూపులు చెదల్లా పాకుతూ ఉంటాయి'' అని చెపుతూ ''ఈ దేశంలోని ఆడదానికి/ఒళ్లంతా ముళ్లుండే రోజు/ ఎప్పుడొస్తుందా'' అని ముగిస్తారు.

పాలనా యంత్రాంగంలో ఆకాశంలో సగమన్న స్త్రీకి చిటికెడు చోటుకూడా ఇవ్వని పురుష పరిపాలకులున్న ప్రపంచం ఇది. కవి సుధ ''ఎవరి యుద్ధం వాళ్ళే చేయాలి/నీ యుద్ధం నువ్వే గెలవాలి/నీ రక్తంతో నీ మూలిగతో/నీ కత్తి డాలు నువ్వే చేసుకోవాలి'' అని చెప్తారు స్త్రీలకు. స్త్రీలు మరోసారి ఉద్యమమై ఒకరికి ఒకరై ఈ వాక్యాలను పునరావృతం చేసుకుంటూ ముందుకు వెళ్లవలసిన అవసరాన్ని ఈ అతిచిన్ని వార్తాకథనం నాకు జ్ఞాపకం చేసింది. స్త్రీలు అవసరమయిన పుడు వళ్లంతా ముళ్ళు పుట్టించుకుని తమను తాము రక్షించుకోగల విద్యలో తర్ఫీదు అవ్వాల్సిన అవసరాన్ని కూడా నాకీ వార్తాకథనం గుర్తుచేసింది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి | 80196 00900

ప్రత్యేక హోదానే మాకు ప్రధానం

ఎవరిస్తే వారికే మా మద్దతు

- అబద్ధాలు, అవకాశవాద పొత్తులతోనే బాబుకు అధికారం
- నాలుగేళ్లలో రాజధానిలో ఒక్క ఇటుక కూడా వేయని ఏపీ సీఎం
- సీఎన్ఎన్‌న్యూస్ 18 చానల్ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్

సాక్షి, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా సాధించడమే తమకు ప్రధానమని, హోదా ఎవరిస్తే వారికి మద్దతిచ్చేందుకు తాము సిద్ధమని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీకి మద్దతిచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని ఆయన అన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రజాసంకల్ప పాదయాత్రలో ఉన్న జగన్ 'సీఎన్ఎన్‌న్యూస్ 18' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ భూపేన్ చౌబేకు సోమవారం ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వమే అబద్ధాలమయమని, అసలు ఆయన అబద్ధాలాడే అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ప్రజలకు భ్రమలు కల్పించడమే తప్ప ఏపీ రాజధాని శాశ్వత నిర్మాణానికి ఒక్క ఇటుకను కూడా ఈ నాలుగేళ్లలో చంద్రబాబు వేయలేదని జగన్ దుయ్యబట్టారు. తన మీద కేసులన్నీ కాంగ్రెస్, టీడీపీ కుట్రతో బనాయించినవేనని ఆయన వివరించారు. ఇంటర్వ్యూ ఈ విధంగా సాగింది.

✦ 2014 లోక్‌సభ ఎన్నికల్లో మీ బలం ఏమిటి? ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో మీరు చూస్తున్న మార్పు ఏమిటి?

2014లో చంద్రబాబు, బీజేపీ కలిసి సినీనటుడు పవన్ మద్దతుతో నాపై తలపడ్డారు. వారంతా కలిసి పోటీ చేసినా మా కన్నా కేవలం 1.5 శాతం ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌కు 44.5 శాతం ఓట్లు వస్తే, వారికి సుమారు 46 శాతం ఓట్లు వచ్చాయి. దీనికి కారణం కేవలం చంద్రబాబు అబద్ధాలే...రూ 87,612 కోట్ల మేరకు రైతు రుణాలను బేషరతుగా మాఫీ చేస్తానని, సుమారు రూ 15,000 కోట్ల నుంచి రూ 16,000 కోట్ల వరకూ ఉన్న స్వయం సహాయక గ్రూపుల రుణాలను కూడా మాఫీ చేస్తానని చంద్రబాబు అబద్ధాలు చెప్పారు. రైతులను, మహిళలను అసలు బ్యాంకులకు బకాయిలు చెల్లించవద్దన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని, ఇవ్వలేక పోతే రూ 2,000లు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పారు. మోదీ హవా కూడా చంద్రబాబుకు ఉపయోగపడింది.

✦ అమరావతి నిర్మాణంలో చంద్రబాబు వృథాగా ఖర్చు పెడుతున్నారని, బాహుబలి దర్శకుడు రాజమౌళిలాంటి వారిని రప్పించి అనవసరంగా నిధులు ఖర్చు పెడుతున్నారనే విమర్శలున్నాయి. రాజధాని నిర్మాణం అనేది అబద్ధమేనంటారా?

చంద్రబాబు ప్రభుత్వమే అబద్ధాల మయం. అబద్ధాలతోనే ఆయన అధికారంలోకి వచ్చారు. ఇప్పటికీ నిరంతరం అబద్ధాలు చెబుతూనే ఉన్నారు. జీఎస్‌డీపీలో ఆయన చెబుతున్న తప్పుడు లెక్కలే నిదర్శనం. రాజధాని నిర్మాణం విషయానికి వస్తే ఇప్పటికి శాశ్వత సచివాలయానికి గాని, శాశ్వత అసెంబ్లీ, హైకోర్టుకు గాని ఈ నాలుగేళ్లలో ఒక్క ఇటుకను కూడా వేయలేదు. ఈయనకన్నా ఒక గుడ్డి వ్యక్తికి పదవి ఇచ్చి ఉంటే మెరుగ్గా పనిచేసేవారు.

✦ 2019లో బీజేపీతో భాగస్వాములయ్యేది ఎవరు?

మా విధానం సుస్పష్టం. ఏపీ బాగు పడాలంటే ప్రత్యేక హోదా కావాలని చాలా కాలంగా మేం కోరుతున్నాం. పార్లమెంటులో అప్పటి ప్రధాని మాకు దీనిపై హామీ ఇచ్చారు. కాంగ్రెస్సే కాదు,



ప్రతిపక్షంలో ఉండిన బీజేపీ కూడా మాకు ఆరోజు హామీ ఇచ్చింది. ప్రత్యేక హోదా లేకుండా మేం పొరుగు రాష్ట్రాలతో పోటీ పడలేం. చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం ఈ రోజుకూ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వైపే చూస్తున్నారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ, చెన్నైతో కూడిన తమిళనాడు, బెంగళూరుతో కూడిన కర్ణాటకతో మేం పోటీ పడలేం. అక్కడి మౌలిక సదుపాయాలు మన వద్ద లేవు. ఏమీ లేనప్పుడు మావద్దకు విజయవాడ, గుంటూరులో పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకు వస్తారు?

✦ ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నారని మీరు చెబుతున్నారు కదా.. అలాంటి ముఖ్యమంత్రితో మీరు పోవద్దని, మీ మద్దతు బీజేపీకి అవసరం అవుతుందని, మీరు సంకేతాలు ఇస్తున్నారా? తమిళనాడులో రాజా మీద ఉన్న కేసులన్నీ కొట్టేశారు. ఇక్కడ మీ కేసులు ఇంకా ఉన్నాయి కదా?

నా కేసులకు సంబంధించి మీరు తెలుసుకోవాలి. మా నాన్న వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించి ఉన్నంత వరకూ నేను గౌరవప్రదమైన వ్యక్తినే. కాంగ్రెస్ దృష్టిలో కూడా వైఎస్ గౌరవనీయమైన వ్యక్తే... ఆయన చనిపోయాక, నేను కాంగ్రెస్ పార్టీని వీడిన తరువాతనే నాపై అక్రమంగా కేసులు కుట్రపూరితంగా పెట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే శంకర్‌రావు (తరువాత ఆయనకు మంత్రి పదవి ఇచ్చారు), టీడీపీకి చెందిన ఎర్రన్నాయుడు, అశోక్‌గజపతిరాజు నాకు వ్యతిరేకంగా కోర్టులో కేసులు వేశారు.

✦ ఇంతకూ 2019లో మీరు ఎవరికి మద్దతు నిస్తారు?

మద్దతుకు సంబంధించినంత వరకూ... మాకు ఒకటే అంశం ఉంది. అది ప్రత్యేక హోదా... అది బీజేపీ కావచ్చు. మరొకరు కావచ్చు. ప్రత్యేక హోదాను ప్రధానమంత్రి ఒక్క సంతకంతో మంజూరు చేయవచ్చు. హోదా ఇవ్వడానికి బీజేపీ ముందుకు వస్తే నేను వారితో వెళ్లడానికి సిద్ధం. ఇందులో దాపరికం లేదు. మేం ఎప్పటి నుంచో ఇదే చెబుతూ వస్తున్నాం.

✦ చంద్రబాబు తప్పుడు విధానాలు అనుసరిస్తున్నారని, అలాంటి వారితో ఉంటూ మీరు కూడా తప్పు చేస్తున్నారని మీ పాదయాత్ర ద్వారా బీజేపీకి సందేశం పంపదల్చుకున్నారా?

జాతీయ పార్టీలకు రాష్ట్రంలో అంత బలం ఏమీ లేదు. మాకు కావాల్సిందల్లా ప్రత్యేక హోదా... ప్రధానిగా అది మోదీ అభీష్టంపై ఆధారపడి ఉంటుంది. పార్లమెంటులో ఇచ్చిన హామీని గౌరవించండి అని మేం కోరుతున్నాం. బీజేపీ కనుక ప్రత్యేక హోదా ఇస్తే... మేం వారికి మద్దతిస్తాం. ఇందులో రెండో మాటే లేదు. ఏపీలో ప్రస్తుతం మా లక్ష్యం చంద్రబాబునాయుడే...

రాష్ట్రంలో జపాన్, కొరియా పరిశ్రమలు

ప్రభుత్వ సలహాదారు జి.వివేకానంద

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి వచ్చే ఏడాది జపాన్, దక్షిణ కొరియా నుంచి పరిశ్రమలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.వివేకానంద అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల పరిస్థితులను వారికి వివరించామన్నారు. మంత్రి కేటీఆర్ బృందంతో కలసి ఈ రెండు దేశాల్లో పర్యటించిన విశేషాలను సోమవారం విలేకరులకు వివరించారు. కొరియా సహకారంతో వరంగల్‌లో ఏవియేషన్ అకాడమీ ఏర్పాటు చేయనున్నామన్నారు. అక్కడ ఏర్పాటు చేస్తోన్న మెగా టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని ఆ దేశ పారిశ్రామికవేత్తలను కోరామన్నారు. టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల ప్రదర్శన కోసం నగరంలో ఫ్యాషన్ సిటీతో పాటు కొరియా లాంగ్వేజ్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ అంగీకరించినట్లు తెలిపారు. క్లీన్ ఎనర్జీ, పౌల్ట్రీ రంగాల్లో సహకారం కోసం జపాన్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఆటోమొబైల్ పరిశ్రమ స్థాపన కోసం సుజూకీతో చర్చలు జరిపామన్నారు.

వచ్చే నెలలో కొరియా కాన్సులేట్

హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో దక్షిణ కొరియా కొత్త కాన్సులేట్‌ను కార్యాలయాన్ని ఆ దేశ రాయబారి ప్రారంభించానున్నారని తెలంగాణలో కొరియన్ గౌరవ కాన్సుల్ జనరల్ సురేశ్ చుక్కపల్లి తెలిపారు.

బీసీ గురుకుల విద్యార్థులకు ఐఐటీ శిక్షణ

ప్రత్యేకంగా శిక్షణ సంస్థ ఏర్పాటు ● 360 మంది విద్యార్థుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: వెనుకబడ్డ తరగతుల (బీసీ) గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు శుభవార్త. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని మహాత్మా జ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల సొసైటీ నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) పేరిట శిక్షణ సంస్థను ఏర్పాటు చేసింది. విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడే దీర్ఘకాలిక శిక్షణ ఇస్తే ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులతో పాటు ప్రఖ్యాత విద్యా సంస్థల్లో సీట్లు వస్తాయని భావించిన అధికారులు ఈమేరకు చర్యలు వేగవంతం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 19 బీసీ గురుకుల జూనియర్ కాలేజీలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 5 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రతిభావంతులను గుర్తించి వారికి ప్రత్యేక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఇటీవల అర్హత పరీక్ష నిర్వహించిన యంత్రాంగం 360 మందిని అర్హులుగా గుర్తించింది. ఈ విద్యార్థులను సీఓఈ కేంద్రంలో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతారు.

ఒకటి రెండురోజుల్లో తరగతులు ప్రారంభం

సీఓఈని ప్రస్తుతం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ప్రారంభించనున్నారు. ఈ మేరకు హయత్‌నగర్ మండలం బాటసింగారం సమీపంలో ఉన్న ఓ ఇంజనీరింగ్ కాలేజీ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఇప్పటికే అర్హులను గుర్తించిన అధికారులు, ఒకట్రెండు రోజుల్లో అక్కడ తరగతులు ప్రారంభించనున్నారు. 360 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా... ఇందులో ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌కు చెందిన 180 మంది, సెకండియర్ చదువుతున్న 180 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో సగం మంది బాలికలున్నారు. విద్యార్థులకు గురుకుల పాఠశాలలో నిర్వహించే తరగతులతో పాటు అదనపు శిక్షణ కోసం ప్రత్యేకంగా సబ్జెక్ట్ నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ప్రధాన సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులను సైతం నియమించారు. ఈ కేంద్రాన్ని రెండ్రోజుల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న ప్రారంభించనున్నారు. వారాంతంలోగా తరగతులు ప్రారంభించనున్నట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి మల్లయ్యభట్టు 'సాక్షి'కి తెలిపారు.

టీజీటీ పోస్టుల వెబ్‌ఆప్షన్లకు మరో అవకాశం

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పోస్టుల భర్తీలో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు కొందరు జోనల్ వెబ్ ఆప్షన్లను ఇవ్వలేదని, అలాగే గురుకుల సొసైటీ ఆప్షన్లు ఇవ్వలేదని, ఆప్షన్లు ఇచ్చిన వారు సరిగ్గా ఇవ్వలేదని టీఎస్‌పీఎస్సీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. వారికోసం మరో అవకాశం ఇస్తున్నామని, ఈ నెల 23 నుంచి 25లోగా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించింది. వెబ్‌ఆప్షన్లు సరిగ్గా ఇచ్చిన వారు మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

వెబ్‌సైట్‌లో లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైనవారి జాబితా ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో లైబ్రేరియన్ పోస్టుకు ఎంపికైన వారి జాబితాను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఎంపికై న వారి హాల్‌టికెట్ నంబర్లను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

పీసీబీలో పలు పోస్టుల ఫలితాలు విడుదల: కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో వివిధ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. స్టెనో కమ్ టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన వారి హాల్‌టికెట్ నంబర్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్–తిరుపతి (02734/ 02733) రైలు 25న సాయంత్రం 7.30కి సికింద్రాబాద్‌లో బయలుదేరి నల్లగొండ మీదుగా మరుసటి రోజు ఉదయం 8.50కి తిరుపతి చేరుకుంటుంది. 28న సాయంత్రం 5 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.25కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. కాకినాడ–సికింద్రాబాద్(07002) రైలు ఈ నెల 28న సాయంత్రం 6 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి సామర్లకోట మీదుగా మరుసటి రోజు ఉదయం 4.10కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఎమ్మెల్యే రోజా ఇంట్లో భారీ చోరీ

రూ.10 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, పూజాసామగ్రి అపహరణ

హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, సినీనటి రోజా నివాసంలో చోరీ జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను దొంగలు అపహరించారు. హైదరాబాద్ రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణికొండ గ్రామపంచాయతీ పంచవటి కాలనీలో రోజా కుటుంబం నివసిస్తోంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆమె భర్త సెల్వమణి చెన్నైకి వెళ్లారు. ఏపీలోని తన నియోజకవర్గం నగరిలో సాగుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రోజా ఉండిపోయారు. ఆదివారం రాత్రి రోజా, సోమవారం ఉదయం సెల్వమణి తిరిగి ఇంటికి వచ్చారు. పండుగకు ఊరెళ్లి వచ్చిన పనిమనిషి ఆదివారం సాయంత్రం బీరువా, కప్‌బోర్డుల తాళాలు తీసి ఉండటాన్ని గమనించింది. దీంతో దొంగతనం విషయం వెలుగులోకి వచ్చింది. చిన్న, చిన్న వెండి వస్తువులు, ప్లేట్లు, లక్ష్మీదేవి దీపాలు, కప్పులు, పన్నీర్‌పుట్టి, మూడు చేతి గడియారాలు, బంగారు గొలుసు, నెక్లెస్, డైమండ్ కమ్మలు, డైమండ్ బిల్ల, బంగారు గాజులు కలిపి మొత్తం 14 తులాల బంగారం, 2 కిలోల



మణికొండలోని ఎమ్మెల్యే రోజా నివాసంలో పోలీసుల విచారణ

వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ నెల 12 నుంచి ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళంచెవుల సెట్టు చాలారోజుల నుంచి కనిపించడంలేదు. దానిని చేజిక్కించుకున్నవారే నేరుగా ఇంట్లోకి ప్రవేశించి ఆభరణాలను తస్కరించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు రోజా దంపతులు సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో తమ వద్ద పనిచేసి మానేసిన డ్రైవర్లు, పనివాళ్ల వివరాలను పోలీసులకు అందజేశారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకే టూర్

పవన్‌కల్యాణ్‌పై బీజేపీ విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికార టీఆర్‌ఎస్ వ్యతిరేక ఓటును చీల్చేందుకే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు విమర్శించారు. జనం బాధలపై పవన్‌కు అవగాహన లేదని, కేవలం రాజకీయ అవకాశ వాదంతోనే యాత్ర పేరుతో రోడ్డెక్కారన్నారు. ఇది సీఎం కేసీఆర్ కనుసన్నల్లో జరుగుతోందని ఆరోపించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా, సినిమా విభాగాల కన్వీనర్లు సుధాకరశర్మ, సీవీఎల్ఎన్ రావుతో కలసి మీడియాతో మాట్లాడారు. జనసేన స్థాపించి ఏళ్లు గడుస్తున్నా ఓ విధానం అంటూ లేదని విమర్శించారు. కేసీఆర్, చంద్రబాబు భజన చేస్తూ పవన్ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. పవన్‌ది విడుదలకు ముందే ఫ్లాప్ అయిన పార్టీ అని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తిట్టుకున్న కేసీఆర్, పవన్ ఇప్పుడు ఎందుకు ఒక్కటయ్యారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై పవన్‌కు చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించాలని చెప్పారు.

వాళ్లు ప్రగతి నిరోధకులు

ప్రతిపక్షనేతలపై మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నవి ప్రతిపక్ష పార్టీలు కావని.. ఆ పార్టీల నేతలు ప్రగతి నిరోధకులని విద్యుత్‌శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి దుయ్యబట్టారు. అర్థం చేసుకునే విజ్ఞత ప్రజలకు ఉందని, అందుకే బారులు కట్టి మరీ టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, టీడీపీలకు చెందిన పలువురు నేతలు టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో మంత్రి వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎల్పీ నేత జానారెడ్డికి ప్రధాన అనుచరుడైన నిడమనూరు మండల అధ్యక్షుడు దాసరి నరసింహ టీఆర్‌ఎస్‌లో చేరారు. అదే నియోజకవర్గంలోని పెద్దవూర మండలం కొత్తలూరు సర్పంచ్ ఒద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, సిరసనగండ్ల సర్పంచ్ పవన్‌కుమార్‌లతో పాటు నెల్లికల్ మాజీ సర్పంచ్ జఠావత్ పంతులు నాయక్, త్రిపురారం మండల టీడీపీ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు కూడా గులాబీ కండువా కప్పుకున్నారు.

హరీశ్‌లాగా దాడి చేశామా?: భట్టి



సాక్షి, హైదరాబాద్: మంత్రి హరీశ్‌రావులాగా తాము గవర్నర్‌పై పుస్తకాలు విసిరేయలేదని, బల్లలెక్కి దాడికి దిగలేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హరీశ్‌రావు మాదిరి గవర్నర్ పట్ల ఏనాడూ అనుచితంగా ప్రవర్తించలేదన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్ బాధ్యతలను మాత్రమే గుర్తుచేస్తున్నామన్నారు. కాళేశ్వరం టెండర్లలో ప్యాకేజీల వారీగా అవకతవకలు జరిగాయని, ప్రాజెక్టుల అంచనాలు భారీగా ఎందుకు పెరిగాయనే ప్రశ్నకు సమాధానం చెప్పలేదన్నారు. కేవలం రూ. 28వేల కోట్లతో పూర్తి కావాల్సిన అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును, కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చి రూ.80 వేల కోట్ల అంచనా వ్యయానికి పెంచారని భట్టి విమర్శించారు. దీని గురించి గవర్నర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వాణిజ్య బ్యాంకుల నుంచి అప్పులు తీసుకురావడానికి ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్‌ను ప్రజల ముందు పెట్టాలని భట్టి డిమాండ్ చేశారు. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు పనులలో ప్యాకేజీల వారీగా గవర్నర్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాల్సిన గవర్నర్ వీటిపై స్పందించకుంటే కేంద్ర విజిలెన్సు కమిషన్‌కు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రాజెక్టులను నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారనే విషయం తెలియదా అని ప్రశ్నించారు.

గవర్నర్ ఆహ్వానం తిరస్కరించిన నారాయణ



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఎట్ హోం కార్యక్రమానికి హాజరుకావాలంటూ గవర్నర్ నరసింహన్ పంపిన ఆహ్వానాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తిరస్కరించారు. ఈ కార్యక్రమానికి తాను హాజరుకాలేనని ఆయన స్పష్టం చేశారు. గవర్నర్ అంటే వ్యక్తిగతంగా తనకు గౌరవమేనని, కానీ ఆ హోదాలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు, వ్యవహరిస్తున్న తీరు అసంతృప్తిగా ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గవర్నర్‌పై కాంగ్రెస్ అనుచిత వ్యాఖ్యలు

టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ పదవికే వన్నె తెచ్చిన తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌పై కాంగ్రెస్ నీచ రాజకీయం చేస్తోందని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. సోమవారం టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రంలో జరిగే ప్రతి పనిని వ్యతిరేకించి అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ ప్రధాన విధిగా పెట్టుకుందని మండిపడ్డారు. గవర్నర్ పదవిని రబ్బర్ స్టాంప్‌గా మార్చి, రాజ్‌భవన్‌లను తమ రాజకీయాలకు అడ్డాగా మార్చింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకాన్ని క్షేత్ర స్థాయిలో గవర్నర్ పరిశీలిస్తున్నారని తెలిపారు. గవర్నర్ల వ్యవస్థ గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. గవర్నర్లను తమ ఏజెంట్లుగా మార్చుకొని గిట్టని ప్రభుత్వాలను బర్తరఫ్ చేయించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్‌దని దుయ్యబట్టారు.

'సెలవుకు ఎంఈవో అనుమతి రద్దు'

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆకస్మిక సెలవు కోసం ఎంఈవో అనుమతి పొందాలన్న ఉత్తర్వులను రద్దు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. ఈ మేరకు సోమవారం సచివాలయంలో విద్యా శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆచార్య, పాఠశాల విద్య డైరెక్టర్ కిషన్‌తో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి భుజంగరావు, సదానందంగౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

సిరికొండ (నిజామాబాద్ రూరల్): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వేర్వేరుగా ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మైలారానికి చెందిన సల్ల మోహన్‌రెడ్డి మూడున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. ఆరు బోర్లు వేయగా, ఒక్కదాంట్లోనూ సరిపడా నీళ్లురాలేదు. దీంతో వరి పూర్తిగా ఎండిపోయింది. గల్ఫ్ వెళ్లగా, ఏజెంట్ మోసంతో నెల రోజులకే తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో రూ. 10 లక్షల వరకు అప్పులు అయ్యాయి. భూమి అమ్మినా అప్పు తీరడం లేదని, ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు ఎలా చేయాలనే ఆందోళనకు గురైన మోహన్‌రెడ్డి సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం అయ్యవారిపల్లికి చెందిన నాగయ్యల రాములు(45) ఉపాధి కోసం దుబాయికి వెళ్లి పని లేక తిరిగి వచ్చాడు. గల్ఫ్ వెళ్లేందుకు, కూతురి పెళ్లి చేసేందుకు అప్పు చేసిన రాములు.. అవి తీర్చే దారి కనిపించక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

పట్టా కోసం రైతు ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



జగిత్యాల: తన భూమి పట్టా చేయడం లేదంటూ సోమవారం ఓ రైతు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. అధికారులు ఆస్పత్రికి తరలించగా, రాత్రి చనిపోయాడు. సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన చిట్యాల గంగయ్య 2001లో 210 సర్వేనంబరులో 1.20 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన జితేందర్‌రెడ్డి వద్ద సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశాడు. ఇటీవల పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, భూమి అమ్మిన వ్యక్తి చనిపోవటంతో ఆయన కుటుంబసభ్యులు సదరు భూమి తమదేనని చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సోమవారం గంగయ్య తన భార్య సుశీలతో కలిసి ప్రజావాణికి వచ్చాడు. కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చిన అనంతరం అందరి ముందే వెంటతెచ్చుకున్న క్రిమిసంహారక మందు డబ్బా తీసి తాగేందుకు ప్రయత్నించాడు. వెంటనే అక్కడున్న సిబ్బంది, ఏవో మహేశ్ బాధితుడిని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా, రాత్రి గంగయ్య చనిపోయాడు.

గోడు వినరు.. గూడు కట్టరు!



పాలమూరు జిల్లా సంగంబండ ఆర్‌ఆర్ సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం

ప్రధాన ప్రాజెక్టుల కింద పదేళ్లయినా పూర్తి కాని పునరావాస పనులు

- అరిగోస పడుతున్న నిర్వాసితులు
- ఇల్లు లేక కొందరు.. ఉన్నా వసతుల్లేక ఎందరో..
- పలు కాలనీల్లో తాగునీరు, కరెంట్‌కు కటకట
- 84 ముంపు గ్రామాల్లో సామాజిక సర్వే పూర్తయింది 77 గ్రామాల్లోనే
- 44,794 నిర్వాసితుల్లో 24,891 మంది మాత్రమే తరలింపు
- 35,385 ఇళ్లకుగానూ పూర్తయింది కేవలం 16,859

సాక్షి, హైదరాబాద్

ఏళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో నిర్వాసితుల వెతలు మాత్రం తీరడం లేదు! ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల కింద సహాయ, పునరావాస ప్రక్రియ పదేళ్లయినా ఇంకా సాగుతూనే ఉంది. మిడ్ మానేరు, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, ఇందిరమ్మ వరద కాల్వ వంటి ప్రాజెక్టుల కింద సహాయ, పునరావాస పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నా... పునరావాస ప్రక్రియ మాత్రం నత్తనడకను తలపిస్తోంది. నిధుల కేటాయింపు, పట్టాల పంపిణీ, గృహ వసతి కల్పన, ఇప్పటికే నిర్మించిన పునరావాస కాలనీల్లో వసతుల లేమి.. ఇలా ఒక్కటేమిటి అన్నింటా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది.



పగులు బారిన సీసీ రోడ్డు

ఇళ్లు కట్టేది ఇంకెప్పుడు?

పద్నాలుగేళ్ల క్రితం చేపట్టిన ఎస్ఎల్‌బీసీ, ఎస్సారెస్పీ స్టేజ్–2, దేవాదుల, వరద కాల్వ, ఎల్లంపల్లి, సుద్దవాగు, కొమురం భీం, గొల్లవాగు, నీల్వాయి, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టు కింద 65 గ్రామాలు పూర్తిగా, 19 పాక్షికంగా కలిపి మొత్తంగా 84 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ గ్రామాలలో 44,794 మంది నిర్వాసితులవుతున్నారు. వీరందరికీ పునరావాస (ఆర్‌అండ్‌ఆర్) కేంద్రాలు ఏర్పాటు చేసి.. గృహాల నిర్మాణం, రోడ్లు, తాగునీరు, కరెంట్ కనెక్షన్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. అయితే ఇప్పటివరకు 84 ముంపు గ్రామాలకుగానూ 77 గ్రామాల్లోనే సామాజిక ఆర్థిక సర్వే (ఎస్ఈఎస్) పూర్తయింది. 44వేల పైచిలుకు మందిలో 24,891 మందిని మాత్రమే ఇప్పటివరకు పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరికోసం 16,859 నివాస గృహాలను నిర్మించారు. ఇంకా 18,526 గృహాలు, ఇతర వసతుల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. దీనికోసం మరో రూ.1,262 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. అయితే ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంతో ఎప్పటిలోగా పునరావాసం పూర్తవుతుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది.



పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

ప్రాజెక్టుల కింద అన్నీ సమస్యలే..

రానున్న జూన్ నాటికి పనులు పూర్తి చేసి సాగుకు నీటిని అందించాలని భావిస్తున్న ప్రాజెక్టుల్లో పాలమూరు జిల్లా ప్రాజెక్టులు కీలకం. ఇక్కడి భీమా ప్రాజెక్టు కింద 8 ముంపు గ్రామాలుండగా, మొత్తంగా 6,156 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. అయితే ఇందులో 3,500 మందికి మాత్రమే పట్టాల పంపిణీ పూర్తయింది. మౌలిక వసతుల పనులు ఇంకా మధ్యలోనే ఉన్నాయి. కనాయిపల్లి, శ్రీరంగాపూర్, నేరేడ్‌గావ్, భూత్పూర్, ఉజ్జెల్లి గ్రామాలలో నిర్వాసితులకు గృహాల నిర్మాణం వేగిరం చేయాల్సి ఉంది. సంగంబండలో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. నెట్టెంపాడు కింద ముంపునకు గురయ్యే చిన్నొనిపల్లి, ఆలూర్, రేతామ్‌పాడ్ గ్రామాల నిర్వాసితులకు పట్టాలు ఇచ్చినప్పటికీ అక్కడ ఈ ఏడాది చివరికి రోడ్లు, నీరు, విద్యుత్ సదుపాయాలు సమకూర్చాల్సి ఉంది.



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆర్‌ఆర్ కాలనీలో సీసీ రోడ్లపైకి వాలిన ముళ్ల చెట్లు

కాలనీల్లో వసతులేవీ..?

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 25 టీఎంసీల సామర్థ్యంతో మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మిస్తుండగా, బోయినపల్లి మండలంలో కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి, శాభాష్‌పల్లి, తంగళ్లపల్లి మండలంలో చీర్లవంచ, చింతలఠాణా, వేములవాడ రూరల్ మండలంలో అనుపురం, రుద్రవరం, కొడుముంజ, సంకెపెల్లి గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఆయా గ్రామాల్లో 11,731 కుటుంబాలు నిర్వాసితులవుతున్నాయి. వీరందరికి పునరావాసం కోసం సుమారు రూ.100 కోట్లతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేశారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి 242 చదరపు గజాల ఇంటి స్థలం ఇచ్చారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో సుమారు మూడు వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మరో 1,500 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇదే ప్రాజెక్టు కింద కొదురుపాక, నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో రూ.80 లక్షల అంచనాలతో నీటి పథకాలు నిర్మించారు. అయితే సీసీ రహదారులు నిర్మించాక పైప్‌లైన్లు వేయడానికి కందకాలు తవ్వారు. కొన్ని చోట్ల రోడ్లు బ్లాస్ట్ చేశారు. దీంతో పలు సీసీ రహదారులు పగుళ్లు బారాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అనాలోచిత చర్యతో శాభాష్‌పల్లి వాగులో నీటి వసతి కోసం మంచినీటి బావులు తవ్వించారు. అయితే వాగులో నీరు చేరడంతో బావులు మునిగిపోయాయి. రోడ్డు నిర్మాణంలో పైప్‌లైన్ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. దీంతో పునరావాస కాలనీల్లో నీరు దొరక్క నిర్వాసితులు పుట్టెడు కష్టాలు ఎదుర్కొంటున్నారు. పలు పునరావాస కాలనీల్లో నిర్వాసితులకు ఇళ్లను అప్పగించడంలో తీవ్ర జాప్యం వల్ల మురుగు కాలువలు మట్టి, పిచ్చి చెట్లతో పూడుకు పోయాయి. పలుచోట్ల విద్యుత్ సదుపాయం లేక నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు.



మురుగు నీరు వెళ్లే దారి లేక నిండిపోయిన మురుగు నీరు

అరిగోస పడుతున్నారు



మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి నీరు చేరిందని.. పునరావాస కాలనీలకు తరలాలని అధికారులు ఆదేశించడంతో కట్టు బట్టలతో ఊళ్లు వదిలి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు చేరాము. ఇక్కడ నీటి వసతి లేదు. వాగులో బావులు తవ్వితే మునిగిపోయాయి. సీసీ రోడ్లు పగుళ్లు బారాయి. మౌలిక వసతులు లేక నిర్వాసితులు అరిగోస పడుతున్నారు. *– కూస రవీందర్, ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు*

ఇళ్ల బిల్లులు చెల్లించలేదు



సంగంబండ ఆర్ఆర్ సెంటర్‌లో ఇళ్లు కట్టుకోవాలంటే బిల్లులు ఇవ్వడంలేదు. జీవో విడుదల చేసి సంవత్సరాలు గడిచినా కొంత మందికి ప్లాట్లు రాలేదు. సర్వం కోల్పోయిన తమను ఆదుకుంటామని చెప్పడం తప్ప సమస్యలు పరిష్కరించడం లేదు. *– అనంతరెడ్డి, సంగంబండ, బీమా ప్రాజెక్టు నిర్వాసితుడు*

ఇంటి నిర్మాణ బిల్లులు చెల్లించాలి



ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో వేల మంది నిర్వాసితులు రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు విడుదల చేయాలి. *– ఆడెపు రాజు, వరదవెల్లి, మిడ్‌మానేరు నిర్వాసితుడు*

10 మంది డీసీలకు ఐఏఎస్ హోదా

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన 10 మంది డిప్యూటీ కలెక్టర్ల(డీసీ)లకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న కొర్రా లక్ష్మి, కె.ధర్మారెడ్డి, చిట్టెం లక్ష్మి, టి.వినయ్ కృష్ణారెడ్డి, సీహెచ్ శివలింగయ్య, వి.వెంకటేశ్వర్లు, ఎం.హనుమంతరావు, డి.అమయ్‌కుమార్, కె.హైమవతి, ఎం.హరితకు ఐఏఎస్ హోదా (కన్ఫర్డ్ ఐఏఎస్) కల్పిస్తూ సోమవారం కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమోషన్ కోటాలో రాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఏఎస్ ఖాళీల్లో వీరిని భర్తీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం ఈ ప్రమోషన్ల జాబితాలను విడుదల చేసింది. 2014 బ్యాచ్ ఖాళీలకు అర్హులెవరూ లేరని, అందుకే ఆ జాబితాను తయారు చేయలేదని సెలెక్షన్ కమిటీ ప్రకటించినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2015 సంవత్సరపు ఖాళీల్లో కొర్రా లక్ష్మి, కె.ధర్మారెడ్డి, 2016 ఖాళీల్లో మిగతా 8 మందిని ఎంపిక చేసింది. ఐఏఎస్ పదోన్నతులకు సంబంధించి ఎ.వాణీప్రసాద్, వి.కరుణ, ఎం.ప్రశాంతి దాఖలు చేసిన కేసుల్లో కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (సీఏటీ) ఇచ్చిన తీర్పుపై కేంద్రం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో సెలెక్షన్ కమిటీ సిఫారసులు హైకోర్టు ఇచ్చే తీర్పునకు లోబడి ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా, కేంద్ర ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 10 మంది అధికారులకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ గెజిట్‌లో పొందుపరిచినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'పరోక్ష విధానం మంచిది కాదు'



సాక్షి, హైదరాబాద్: వార్డు మెంబర్ల ద్వారా పరోక్షంగా సర్పంచ్‌లను ఎన్నుకునే ఎన్నికల విధానం మంచిది కాదని బీసీ సంక్షేమ సంఘం నేత, టీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఇతర బీసీ నేతలతో కలసి వినతిపత్రం అందజేశారు. పరోక్ష పద్ధతిలో ఎన్నికలంటే కొనుగోళ్లు, ప్రలోభాలు, క్యాంపులు, భయాలు, బెదిరింపులను గ్రామస్థాయి రాజకీయాల్లోకి మళ్లించడమేనని పేర్కొన్నారు. పరోక్ష పద్ధతి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీల నాయకత్వం దెబ్బతింటుందని, ధనవంతులు, భూస్వాములే ఎన్నికవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన ఆలోచనను విరమించుకుని ప్రత్యక్ష పద్ధతిలోనే సర్పంచ్‌ల ఎన్నికను చేపట్టాలని కోరారు.

పాత భవనంలో పనిచేయలేం..

- ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనం కోసం వైద్యుల నిరసన
- గంటపాటు ఓపీ సేవలు నిలిపివేత.. ఇబ్బంది పడ్డ రోగులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఉస్మానియా వైద్యులు, సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆస్పత్రి పాత భవనంలో పనిచేయలేమంటూ వైద్యులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు వైద్య, ఉద్యోగ సంఘాలు జేఏసీగా ఏర్పడ్డాయి. వైద్యులు, ఉద్యోగులు తొలిరోజు సోమవారం ఉదయం గంటపాటు ఔట్‌పేషంట్ (ఓపీ) సేవలను నిలిపివేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి పరిపాలనా భవనం ముందు ధర్నా చేశారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుందని, తరచూ పైకప్పు పెచ్చులూడుతున్నాయని వైద్యులు తెలిపారు. బిక్కుబిక్కుమంటూ సేవలందించలేమని స్పష్టం చేశారు. రోగులకు ఈ భవనం ఏమాత్రం సురక్షితం కాదని, వెంటనే కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం హామీ వచ్చేవరకు నిరసన కొనసాగుతుందన్నారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నిరసన లో పాల్గొనడంతో వైద్యసేవలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రోగులు ఇబ్బందిపడ్డారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ భవనం నిర్వహణాలోపంతో శిథిలావస్థకు చేరుకుంది. వైద్యచికిత్సలకు ఈ భవనం సురక్షితం కాదని, వెంటనే ఖాళీ చేయాలని పదేళ్ల క్రితమే ఇంజనీరింగ్ నిపుణులు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

2019లో రెండు రాష్ట్రాల్లో పోటీ చేస్తాం

జనసేన అధినేత పవన్ కల్యాణ్

- బలాన్నిబట్టి ఎన్ని సీట్లలో పోటీ చేయాలో నిర్ణయం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, జగిత్యాల: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పోటీ చేస్తామని సినీనటుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. పార్టీ బలాన్ని, సామర్థ్యాన్నిబట్టి ఎన్ని సీట్లలో పోటీ చేయాలనేది ఎన్నికలకు రెండు నెలల ముందు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కరీంనగర్‌కు వచ్చిన పవన్ కల్యాణ్ సోమవారం సాయంత్రం ఇక్కడి ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అంటే తనకెంతో ప్రేమ, ఇష్టమన్న పవన్...తెలంగాణపై పూర్తి అవగాహన ఉండి జనసేనతో కలిసి వచ్చే మేధావులతో చర్చిస్తున్నానన్నారు. సినిమాలు పక్కనబెట్టి పూర్తిస్థాయి రాజకీయాల్లోకి వస్తున్నానని చెప్పారు. తన ఇలవేల్పు ఆంజనేయస్వామి అని, అందుకే కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీర్వాదంతో యాత్ర మొదలు పెడుతున్నానని పేర్కొన్నారు. జనసేన పార్టీలోకి రావడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు, అభిమానులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించాకే ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు.

సమస్యలపై కార్యాచరణ....

రెండు రాష్ట్రాల్లో సున్నితమైన సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించి, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని పవన్ కల్యాణ్ వివరించారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయాక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు చాలెంజింగ్‌గా పనిచేస్తున్నారని పవన్ కితాబిచ్చారు. తెలంగాణలో పార్టీ కార్యాలయాన్ని గతంలోనే ఏర్పాటు చేసుకున్నామని, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభించి ఈ నెల 27 నుంచి అనంతపురంలో కరువుపై పరిశీలన యాత్ర చేస్తామన్నారు. జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి అడుగునూ నిర్మాణాత్మకంగా వేస్తున్నామని తెలిపారు. తననెవరూ రాజకీయంగా వాడుకోలేదని, ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చే అవసరం తనకు లేదని పవన్ స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్ హార్డ్‌వర్కర్ అని, తెలంగాణ సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. జనసేన ఆవిర్భావం తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి పరిస్థితులను బట్టి తెలుగుదేశం, బీజేపీలకు మద్దతు ఇచ్చామన్నారు. 'ఓటుకు కోట్లు'కేసు సున్నితమైందని, అందుకే తానంతగా స్పందించలేదన్నారు. అధికార పార్టీలపై విమర్శలే పనిగా పెట్టుకోబోమని, గొడవ పెట్టుకునే అంశాలున్నా సున్నితంగా వ్యవహరిస్తామన్నారు. జనసేన పార్టీకి చిరంజీవికి ఎలాంటి సంబంధమూ లేదని, భవిష్యత్తులో మద్దతు ఇస్తే ఆలోచిస్తానన్నారు.



జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్

కొండగట్టులో పవన్ పూజలు...

పవన్ కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న సాక్షిగా ప్రజా చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టారు. తమ కుటుంబ ఇలవేల్పు ఆంజనేయస్వామి దర్శనం కోసం ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి బయలుదేరిన పవన్ కల్యాణ్... షెడ్యూల్ కన్నా గంటన్నర ముందుగానే మధ్యాహ్నం 1.25 గంటలకు అంజన్న క్షేత్రానికి చేరుకొని దైవ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ. 11 లక్షల విరాళం ప్రకటించారు. పూజలు, సన్మానాలతో 33 నిమిషాలపాటు ఆలయంలో గడిపిన పవన్... మీడియాతో ఏమీ మాట్లాడకుండానే కరీంనగర్ బయలుదేరారు. ఆలయ ప్రాంగణంలో తన వాహనంపైకి ఎక్కి అభిమానులకు అభివాదం చేసి మళ్లీ కారులో కూర్చున్నారు.

సాక్షి ఫ్యామిలీ

హైదరాబాద్
మంగళవారం, 23-1-2018



గోల్డెన్ హార్ట్
- సినిమా పేజీలో

బ్యూటీ టిప్స్

- జుత్తు తెల్లబడుతుంటే... కొబ్బరినూనెలో వెల్లుల్లిపాయలు వేసి ఉడికించాలి. ఆపైన వడకట్టి, నూనెను సీసాలో నిల్వ చేసుకుని రోజూ రాసుకుంటూ ఉంటే... వెంట్రుకలు క్రమంగా నల్లబడిపోతాయి.
- జుత్తు ఎక్కువగా రాలిపోతుంటే... ఉల్లిపాయను మెత్తని పేస్ట్‌లా చేసి, దానిలో కాసింత తేనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టించి, ఓ గంట తర్వాత తలస్నానం చేయాలి. కొన్నాళ్లపాటు వారానికోసారి ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- దుమ్ము, ధూళి పేరుకుపోయి ఒక్కోసారి జుత్తు డల్‌గా అయిపోతూ ఉంటుంది. అలాంటప్పుడు... గోరింటాకును రుబ్బి, అందులో బీట్‌రూట్ రసాన్ని కలిపి తలకు పట్టించి, ఆరిన తర్వాత కుంకుడుకాయ రసంతో తలంటుకోవాలి. వారానికోసారి ఇలా చేస్తే చాలు... వెంట్రుకలు మెరుపులీనుతాయి.



చెట్టు నీడ

కోతికి కజిన్లు

తెలివైన శత్రువుకంటే తెలివితక్కువ స్నేహితుడే ఎక్కువ ప్రమాదకారి. ప్రతి ఒక్క ఫిలాసఫర్ ఎక్కడో ఒక చోట ఈ మాట చెప్పే ఉంటాడు. ఎవరూ చెప్పకపోయినా, ప్రతి ఒక్కరికీ జీవితంలో ఇలాంటి అనుభవం ఒకటి ఎదురయ్యే ఉంటుంది.

సత్యపాల్ సింగ్ సెంట్రల్ మినిస్టర్. ఉన్నత విద్యాశాఖకు ఈమధ్యే సెప్టెంబర్‌లో మంత్రిగా వచ్చారు. శనివారం ఔరంగాబాద్‌లో అఖిలభారతీయ వైదిక సమ్మేళంలో ప్రసంగిస్తూ, డార్విన్ సిద్ధాంతం తప్పు అన్నారు. స్కూళ్లలోంచి, కాలేజీల్లోంచి పాఠ్యపుస్తకాల్లో డార్విన్ పరిణామక్రమ సిద్ధాంతాన్ని తీసెయ్యాలి అన్నారు. ''కోతి నుంచి మనిషి పుట్టాడని డార్విన్ చెప్పాడు. అదే నిజమైతే కోతి నుంచి మనిషి పుట్టడాన్ని మన పూర్వీకులు ఎవరైనా చూసి ఉండాలి కదా! చూసినట్లు ఏ వేదంలోనూ లేదు. మనుషులు రావడం రావడమే భూమ్మీదకు మనుషులుగా వచ్చారు'' అన్నది సత్యపాల్ పాయింట్ ఆఫ్ వ్యూ.

మర్నాడు, ఆదివారం పుణెలోని సీనియర్ సైంటిస్టులు కొందరు కలిసి కూర్చొని సత్యపాల్ వ్యాఖ్యలపై వివరణ కోరుతూ, పన్నెండొందల సంతకాలతో మంత్రిగారి శాఖకు ఒక లేఖ రాశారు! 'చెప్పండి, డార్విన్ సిద్ధాంతాన్ని పిల్లల పుస్తకాల్లోంచి మీరెలా తీస్తారు?' అని. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయంటే ఎలా? వందేళ్లుగా డార్విన్ సిద్ధాంతంపై మా సైంటిస్టులు అధ్యయనాలు చేస్తున్నారు. ఆ ఫలితాలన్నీ కూడా డార్విన్‌ని సమర్థించే విధంగానే ఉన్నాయి. మినిస్టర్ గారికి ఈ మాత్రం జీకే కూడా లేకపోవడం మాకు షాకింగ్‌గా ఉంది' అని రేడియో ఆస్ట్రోనామర్ గోవింద్ స్వరూప్,



అంతా ఒకటేనా?!

హోమీబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ రీడర్ అనికేత్ సూళే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు!

నిజానికి వీళ్లేం దిగ్భ్రాంతికి లోనుకానవసరం లేదు. మంత్రిగారి మాటలకు దిగాలు పడనవసరమూ లేదు. సత్యపాల్ తనకు తోచింది అన్నారు తప్ప, తోచినంత పనీ చేయిస్తాడని, ఒకవేళ మోదీని ఒప్పించి చేయించినా డార్విన్ సిద్ధాంతం మరుగున పడిపోతుందని ఎవరూ ఆందోళన చెందనవసరం లేదు. ముఖ్యంగా సైంటిస్టులు.

మంత్రిగారు అన్నట్లు లేదా మనమంతా నమ్ముతున్నట్లు .. మనిషి కోతి నుంచి వచ్చాడని డార్విన్ ఎక్కడా చెప్పలేదు. అసలు 'మనిషి ఫ్రమ్ కోతి' అనే మాటే డార్విన్ రాసిన సిద్ధాంత గ్రంథం 'ది డిస్సెంట్ ఆఫ్ మ్యాన్'లోని ఏ పేజీలోనూ లేదు! 'కోతి, మనిషి ఒకే చెట్టు కొమ్మలు' అని డార్విన్ అన్నాడు తప్ప, కోతి ఆ కొమ్మపై నుంచి ఈ కొమ్మకు ఎగిరీ ఎగిరీ చివరికి మనిషైపోయింది అనేమీ సూత్రీకరించలేదు. కోతి, మనిషి కజిన్స్. కజిన్ నుంచి మనిషి రాడు కదా!

ఇంత చిన్న విషయం మంత్రిగారి మాటలకు 'షాక్ తిన్న' సైంటిస్టులకు తెలియకుండా ఉంటుందా?! మంత్రిగారి వల్ల సైన్స్‌కి వచ్చే నష్టంగానీ, ఆయన మాటలపై సైంటిస్టులు స్పందించకుండా ఉంటే డార్విన్ సిద్ధాంతానికి జరిగే హానిగానీ ఏమీ ఉండదు. సైంటిస్టులు కూల్‌గా ఉంటే పోయేది. తెలివైన శత్రువుకంటే తెలివితక్కువ స్నేహితుడే డార్విన్‌కి ఎక్కువ ప్రమాదకారి.

– మాధవ్ శింగరాజు

గుడ్‌ఫుడ్



మునగ

మునగకాడల గురించి మనకు బాగానే తెలుసు. అయితే మునగ ఆకులు, చెట్టు బెరడు, వేర్లు కూడా ఆరోగ్యానికి ఎంత ఉపయోగపడతాయో తెలుసా?

- లేత మునగ చిగుళ్లను రుబ్బి రసం తీసి, రోజూ పరగడుపున చిన్న గ్లాసుడు తాగితే బరువు తగ్గుతారు.
- మునగ చెట్టు బెరడు నుంచి తీసిన జిగురును ఆవుపాలతో కలిపి నుదుటి మీద పట్టీలా వేస్తే తలనొప్పి మాయమవుతుంది. మునగచెట్టు వేరును దంచి, రసం తీసి, తేనెలో కలిపి తాగితే వాతపు నొప్పులు తగ్గుతాయి.
- లేత మునగాకును తరచుగా తింటే ఒంటికి పట్టిన నీరు తీసేస్తుంది. మునగాకును వేయించి తినిపిస్తే, పిల్లలు పక్క తడపడం మానేస్తారు. మునగాకును, కాడలను మెండుగా తీసుకుంటే బాలింతలకు పాలు బాగా పడతాయి. ఆకును ఎండబెట్టి, పొడి చేసి పరగడుపునే ఓ చెంచాడు తింటే.. కడుపులో ఉన్న అల్సర్లు మానిపోతాయి.

నిమ్మ



- నిమ్మ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిలో ఉండే ఖనిజ లవణాలు శరీరంలోని మలినాలను పారద్రోలతాయి.
- ఉదయాన్నే పరగడుపున నిమ్మరసం తాగితే, అజీర్తి సమస్య తొలగిపోతుంది.
- ఎక్కిళ్లు ఆగకుండా వస్తుంటే... రెండు చెంచాల నిమ్మరసంలో, రెండు చెంచాల తేనె కలుపుకుని తాగితే వెంటనే ఆగిపోతాయి.
- నిమ్మరసానికి కాసింత తేనె, వాము పొడి, సున్నపుతేట కలిపిన నీటిని మూడు పూటలా తాగితే... కడుపులోని నులి పురుగులు చచ్చిపోతాయి. లవంగాల పొడిలో నిమ్మరసం కలిపి పేస్టులా చేసి పూస్తే చిగుళ్ల నొప్పి మాయమవుతుంది. పంటి నొప్పికి కూడా ఇది మంచి మందు.



స్విట్జర్లాండ్‌లోని జూరిచ్‌లో కచేరి చేస్తున్న అఫ్గానిస్తాన్ 'ఆల్ విమెన్ ఆర్కెస్ట్రా'.. జొహ్రా. ఈ బృందంలోని ముప్పై మంది బంగారు తల్లులూ... ఉగ్రవాదంలో గాయపడిన దేశాలకు తమ సంగీతంతో సాంత్వన కలిగిస్తున్నారు. (మధ్యలో) అహ్మద్ నాసర్ సార్‌మస్త్.

గాయం కడిగిన స్వరాలు

జొహ్రా... అంటే పర్షియన్ సాహిత్యంలో సంగీత దేవత! ముప్పైమందీ అమ్మాయిలే ఉన్న ఆ ఆర్కెస్ట్రా పేరు కూడా జొహ్రానే! దాన్ని స్థాపించిన కళాకారుడు అహ్మద్ నాసర్ సార్‌మస్త్. ఇందులో ఆశ్చర్యం, అద్భుతం ఏముంది? అనిపిస్తోందేమో! స్త్రీలకు చదువుకునే హక్కు, కనీసం పట్టపగలు మిట్టమధ్యాహ్నం బయటకు వెళ్లే స్వేచ్ఛ కూడా లేని అఫ్గానిస్తాన్ లాంటి దేశంలో ముప్పైమంది అమ్మాయిలతో ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేయడం ఆశ్చర్యం, అద్భుతం మాత్రమే కాదు గొప్ప సాహసం కూడా!

దొంగచాటుగా ఆర్కెస్ట్రాకు!

నాసర్ సార్‌మస్త్‌కు 54 ఏళ్లు. కాబూల్ నివాసి. అఫ్గానిస్తాన్ సంప్రదాయ సంగీత కళాకారుడు. ఆ దేశ సంప్రదాయ సంగీతమంటే ప్రాణం పెడ్తాడు. అఫ్గానిస్తాన్‌లో మారిన రాజకీయ, సాంఘిక పరిస్థితులు చాలా కళలకు మనుగడ లేకుండా చేస్తున్నాయి. అలాంటి వాటిలో ఆ దేశ సంప్రదాయ సంగీతం కూడా ఒకటి. దాన్ని పరిరక్షించాలని తాపత్రయపడ్తున్నాడు నాసర్. ఆయన జీవితంలో చాలా చేదు అనుభవాలను ఎదుర్కొని కూడా ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు. 2014లో కాబూల్‌లో జరిగిన మానవబాంబు దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు నాసర్. ఆ ప్రమాదం నుంచి కోలుకుంటున్నప్పుడే అనుకున్నాడట తన దేశ సంప్రదాయ స్వరాన్ని ఆగిపోకుండా చూడాలని. అప్పటికే అమ్మాయిలకు సంగీతం నేర్పిస్తూ ఉన్నాడు. అయితే అందులో చాలామంది అమ్మాయిలు రహస్యంగా ఎవరికంటా పడకుండా వచ్చేవాళ్లు. అయినప్పటికీ వాళ్ల సంఖ్య పెరుగుతూ ఉండడంతో, అప్పుడనిపించింది నాసర్‌కు.. మొత్తం అమ్మాయిలతో ఒక ఆర్కెస్ట్రా స్టార్ట్ చేస్తే ఎలా ఉంటుందీ అని. బహుశా నలుగురైదుగురు కంటే ఎక్కువ చేరకపోవచ్చు అని సందేహపడ్డాడు వెంటనే. అయినా సరే ఆలోచనను పంచుకుంటే తప్పేంటి అని తన స్టూడెంట్స్ ముందుంచాడు. తన దగ్గరకొస్తున్న పదిమంది అమ్మాయిలంతా సరే అంటూ ఉత్సాహం చూపించారు. ఆ ఉత్సాహమే నాసర్ త్వరగా కోలుకునేలా చేసింది. ఆరోగ్యం కుదుట పడ్డాక కాబూల్‌లోని అఫ్గానిస్తాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ (ఏఎన్ఐఎమ్)స్టూడెంట్స్‌నూ అడిగాడు. అందులోని అమ్మాయిలంతా వాళ్ల కుటుంబాల్లోనే కాదు వాళ్ల ప్రాంతంలోనే సంగీతం నేర్చుకుంటున్న తొలితరం అమ్మాయిలు. ఇళ్లల్లో, అక్కడి సమాజంలో ఉన్న నియమ నిబంధనలకు ఏమాత్రం విరుద్ధంగా నడుచుకున్నా పాటే కాదు.. ప్రాణమూ ఆగిపోతుంది. అయినా ఆ రిస్క్‌ను లెక్కచేయకుండా నాసర్ అభ్యర్థనను మన్నించారు. అతను పెట్టిన 'జొహ్రా'ఆర్కెస్ట్రాలో చేరారు. అలా 30 మందితో ఆర్కెస్ట్రా గ్రూప్ తయారైంది.



నాసర్ స్కూల్‌లో సంగీతం నేర్చుకుంటున్న అనాథాశ్రమంలోని బాలికలు

గడపే దాటనివారు యూరప్‌కి!

2016లో యూరప్‌లో ఐఎస్ఐఎస్ దాడులు చేసింది. అందులో బెర్లిన్ ఒకటి. తన ఆర్కెస్ట్రాతో శాంతి యాత్ర చేయాలనుకున్నాడు నాసర్. ముప్పై మంది అమ్మాయిలతోనా? పైగా అంతా పధ్నాలుగు నుంచి 20 ఏళ్లలోపు పిల్లలే. సొంత దేశం 'దేశం దాటడానికి వీల్లేదు' అంది. ముందు తన గ్రూప్‌లోని పిల్లల తల్లిదండ్రులను ఒప్పించాడు. అనుమతిస్తున్నట్టు వాళ్ల చేత సంతకాలు తీసుకున్నాడు. తర్వాత ప్రభుత్వానికి అర్జీ పెట్టాడు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పర్మిషన్ తెచ్చుకున్నాడు. 2017 జనవరిలో యూరప్ ప్రయాణమయ్యాడు టీమ్‌తో.

యూరప్‌లోని రెండో ప్రపంచయుద్ధంలో దాడిలో దెబ్బతిన్న ప్రాంతాల్లో, తీవ్రవాదం పంజా విసిరిన ప్రాంతాల్లో తన ఆర్కెస్ట్రాతో ప్రదర్శనలిచ్చాడు నాసర్. అందులో బెర్లిన్‌లోని కైసర్ విల్‌హెల్మ్ మెమోరియల్ చర్చి ఒకటి. అది రెండో ప్రపంచయుద్ధ బాంబును ఎదుర్కొంది. ఆ సమీప ప్రాంతంలోనే 2016లో ఐఎస్ఐఎస్ టెర్రర్ ఎటాక్ జరిగింది. ఆ రక్తపు మరకలను జొహ్రా తన సంగీతంతో తుడిచేసింది. ఆ కచేరీని ఆ దాడిలో చనిపోయిన పన్నెండుమందికి అంకితం చేసింది. దాదాపు రెండు వారాలపాటు సాగిన ఈ మ్యూజిక్ టూర్ స్విట్జర్లాండ్‌లో మొదలై తూర్పు జర్మనీలో ముగిసింది.

'ఉగ్ర' గాయాలకు లేపనం

టూర్ తర్వాత నాసర్ మ్యూజిక్ స్కూల్‌కి డిమాండ్ పెరిగింది. పైగా తన మ్యూజిక్ స్కూల్లో ఉగ్రవాద దాడుల్లో ఇళ్లు కోల్పోయిన పిల్లలకు, అనాథలకూ ఉచితంగా సంగీతం నేర్పిస్తున్నాడు నాసర్. అలాగే చదువుకోవడానికి స్కూళ్లు లేని, చదువుకునే వీలులేని ఊళ్ల నుంచి వచ్చిన అమ్మాయిలకూ ఉచితంగానే సంగీత శిక్షణ ఇస్తున్నాడు. వాళ్లలో పందొమ్మిదేళ్ల నెగిన్ ఒకరు. ఈ అమ్మాయి జొహ్రాలో కూడా ఉంది. యూరప్ పర్యటనలోనూ పాల్గొంది. సనాతన సంప్రదాయాలను కాచివడబోస్తున్న పష్తున్ అనే తెగకు చెందిన పిల్ల. కునర్ ప్రావిన్స్ ఆమె స్వస్థలం. ఆ ఊళ్లో స్కూళ్లు లేవు. చదువుకోసం పక్కనున్న ఊరికి పంపే స్థోమత, ధైర్యం లేదు ఆమె తండ్రికి. దాంతో నెగిన్‌ను తీసుకెళ్లి కాబూల్‌లోని అనాథాశ్రమంలో పెట్టాడు. అలాగైనా కూతురుకు చదువు అందుతుంది అన్న ఆశతో. అందులో చదువుకుంటున్నప్పుడే నెగిన్ నాసర్ మ్యూజిక్ స్కూల్ గురించి తెలిసింది. సంగీతం అంటే చెవి కోసుకునే నెగిన్ అందులో చేరింది. ప్రదర్శనలో పాల్గొంది.

జొహ్రాలో ఇంకా ఇలాంటి నేపథ్యం ఉన్న అమ్మాయిలు ఎందరో. సంగీతంతో వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని కల్గిస్తున్నాడు నాసర్. ఆ సంగీత సాధనంతోనే తమ హక్కుల పట్లా అమ్మాయిలనూ చైతన్యం చేస్తున్నాడు. ఆ చైతన్యంలో ఆ అమ్మాయిలు వాళ్ల కుటుంబాల్లో మార్పు తెస్తున్నారు. సలామ్ నాసర్. సలామ్ జొహ్రా!

- శరాది



నెగిన్

కాళ్లు చేతులు కట్టేసి గదిలో పడేశారు!



అబీదా

అబీదాది ఇంకో కథ. తాలిబన్ చెరలో ఉన్న ఘజ్నీ ఆమె సొంతూరు. అక్కడ బాల్యవివాహాలే ఉంటాయి. పెళ్లయ్యాక భర్త, మామ ఒప్పుకుంటేనే స్కూల్‌కి వెళ్లాలి అమ్మాయి. ఆ సంప్రదాయం అబీదా వాళ్లింట్లోనూ ఉంది. అయితే అబీదా లక్ష్యం వేరు. అది వింటే ఇంట్లోవాళ్లు ఆమె చేతులు, కాళ్లు కట్టేసి గదిలో వేసి తాళం పెట్టారు. అయినా బాల్యవివాహాన్ని ధిక్కరించింది. తన మనసులో మాట తల్లికి చెప్పింది సంగీతం నేర్చుకోవాలనుందని. తన కూతురు జీవితమన్నా బాగుపడాలని రహస్యంగా బిడ్డను బయటకు పంపించింది తల్లి. అబీదా కాబూల్ ఏఎన్ఐఎమ్‌లో (అఫ్గానిస్తాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్) చేరింది. సంగీతం నేర్చుకుంటూ నాసర్ జొహ్రాలో సభ్యురాలైంది. ''పాప్ సింగర్ కావాలని నా ధ్యేయం. ముందు మా సంప్రదాయ సంగీతంలో సరిగమలు పలికించి తర్వాత నాకు ఇష్టమైనట్లు కెరీర్‌ను మలుచుకుంటా'' అంటుంది అబీదా. యూరప్ పర్యటన తర్వాత అబీదా ఇంట్లోనూ చాలా మార్పులు వచ్చాయట. ఫోన్‌లో వాళ్లమ్మ చెప్పిందిట. ''నా కోసం మా అమ్మ చాలా కష్టాలు పడింది. నిందలు మోసింది. ఇప్పుడు మా ఇంట్లో పరిస్థితి మారింది. అది నావల్లే అని అంటుంది అమ్మ. కాని మా అమ్మకే ఆ క్రెడిట్. ఆరోజు నా కోరికను మా అమ్మ అర్థం చేసుకోకపోతే.. ఈ రోజు నేను ఇలా ఉండేదాన్ని కాను''అని చెప్తుంది అబీదా కళ్లనిండా నీళ్లతో.

కన్యత్వ పరీక్ష

వద్దని గ్రూప్‌కి ఎక్కినందుకు పెద్దలకు కోపం వచ్చింది!

ఆచారాలు ఉండాల్సిందే. కానీ అవి 'అత్యాచారాలు' కాకూడదు! కొన్ని ఆచారాలైతే అసలే ఉండకూడదు. కానీ ఉన్నాయి. ఇంకా ఉంటూనే ఉన్నాయి. 'ఇంకా' అంటే.. మనం నాగరికులం, నవనాగరికులం అనుకుంటున్నాం కదా! మహారాష్ట్రలో ఏం జరిగిందో చూడండి. పుణెకి దగ్గరల్లోని పింప్రీ అనే ప్రాంతంలో కంజర్‌భట్ అనే కమ్యూనిటీ ఉంది. వాళ్లకో ఆచారం ఉంది. వధువు కన్యా? కాదా? అని తెలుసుకునే ఆచారం! అయితే పెళ్లికి ముందు తెలుసుకోరు. పెళ్లయ్యాక మొదటి రాత్రి తెలుసుకుంటారు. ఎలా తెలుసుకుంటారు? తెలుసుకుని ఏం చేస్తారు అనేది తర్వాత చూద్దాం.

ఇప్పుడైతే మొన్న ఆదివారం ఏం జరిగిందో చూద్దాం. కమ్యూనిటిలో ఒక అమ్మాయికి పెళ్లయింది. మిగిలిన తంతు ఇక ఆమె కన్యత్వ పరీక్ష. తొలిరాత్రికి ముందు రోజు కమ్యూనిటీలోని కుర్రాళ్లు ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఒక వాట్సాప్ గ్రూపు ప్రారంభించారు. 'స్టాప్ ది వి రిచువల్' (కన్యత్వ దురాచారాన్ని ఆపండి) అని ఆ గ్రూపుకు పేరు పెట్టుకున్నారు. ఒకే విధంగా ఆలోచించే వాళ్లంతా ఆ గ్రూపులో చేరారు. కన్యత్వ పరీక్షకు వ్యతిరేకంగా మిగతావాళ్లకు చైతన్యం కలిగించడం మొదలుపెట్టారు. ఆ విషయం కమ్యూనిటీలోని పెద్దవాళ్లకు తెలిసింది.




గ్రూపులోని ఒక్కో ఫోన్ నెంబర్ని పట్టుకుని, ఒక్కొక్కర్నీ కొట్టిపడేశారు. ఒక గుంపుగా వచ్చి కొట్టారు. దాడి చేసినవాళ్లలో నలభై మందిపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు అయింది. వాళ్లలో ఇద్దర్ని అరెస్ట్ చేశారు. మిగతావాళ్లు పింప్రీ వదిలి పారిపోయారు. పారిపోవలసింది కొట్టినవాళ్లు, కొట్టించుకున్నవాళ్లు కాదు. దురాచారం పారిపోవాలి. దాన్ని తరిమి తరిమి కొట్టాలి.

పింప్రీలోని కంజర్‌భట్ కమ్యూనిటీలో ఈ దురాచారం ఎంత ఘోరంగా ఉంటుందంటే.. ఫస్ట్‌నైట్ వధూవరులకు ఏర్పాటు చేసిన పట్టెమంచంపై తెల్లటి దుప్పటిని పరుస్తారు. తెల్లారగానే వచ్చి ఆ దుప్పటిని చూస్తారు. దానిపై మరకలు ఉన్నాయా.. అమ్మాయి కన్య అయినట్లు! లేవా.. ఆమె బతుకు బట్టబయలు అయినట్లు! అమ్మాయిని అబ్బాయి వదిలేస్తాడు! లేదా.. ఎవరితో కలిసి ఆమె 'తప్పు చేసిందో' అతని పేరు కనుక్కుని అతని చేత, ఆమె చేత ఫైన్ కట్టించి అప్పుడు అమ్మాయిని వరుడు దగ్గరికి కాపురానికి పంపిస్తారు పెద్దలు.

సైన్స్ ఎంత డెవలప్ అయినా, కామన్‌సెన్స్ డెవలప్ కాకపోతే ఇలాంటి దురాచారాలే జీవితాలను శాసిస్తుంటాయి. అసలు స్త్రీకొక న్యాయం, పురుషుడికొక న్యాయం ఉండడంలోనే మన ఆచారాల్లోని డొల్లతనమంతా ఉంది. ఆచారం అన్నది మానవ జీవితం మెరుగవ్వడానికి తోడ్పడాలి తప్ప, ఎవరి జీవితానికీ ప్రతిబంధకం కాకూడదు. ●

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
మంగళవారం
23-1-2018

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ రామ్‌గారు. నా వయసు 26. నాకు ఒక అమ్మాయి ప్రపోజ్ చేసింది. నేను నో చెప్పాను. తను ఆత్మహత్యాయత్నం చేసింది. ఏంటీ పిచ్చిపని అంటే.. ''నువ్వు నా జీవితం. నువ్వు లేకుండా నేను లేను'' అంది. నేను నో చెప్పడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. మా అమ్మ అంటే నాకు ప్రాణం. అమ్మకి ఇంటర్ కాస్ట్ మ్యారేజ్‌లు ఇష్టం లేదు. రెండు.. నాకు తెలిసిన అబ్బాయి కూడా తనని లవ్ చేస్తున్నాడు. నేను తనని పెళ్లి చేసుకుంటే మిత్రద్రోహం అవుతుందని ఆలోచిస్తున్నా. కానీ ఆ అబ్బాయి మీద తనకి మంచి అభిప్రాయం లేదు. ఎస్ అని చెప్పాలని ఉంది. ఎందుకంటే నేను అందంగా ఉండను. అయినా నా మనసు చూసి ప్రేమించింది. అందుకే తనంటే ఇష్టం. నిజానికి అమ్మా, అమ్మాయి నాకు రెండు కళ్లు. ఇప్పుడు నేనేం చెయ్యాలి సలహా ఇవ్వండి ప్లీజ్.

– శేఖర్

బాగుండడం.. బాగోకపోవడం..
మన చేతుల్లో ఉండదు కదా శేఖరు..?
అది దేవుడి సృష్టి.
దేవుడికి నువ్వు చాలా అందమైన బిడ్డవు.
అమ్మకు నువ్వు అందాల కన్నవు.
నువ్వు అందంగా లేవని...
ఇంకో అమ్మాయి దొరకదని...
అనవసరమైన ఆలోచనలు పెట్టుకుని...
లవ్‌లోకి దూకద్దు..! కాళ్లు విరుగుతాయి...!!
'వెటకారం చెయ్యకండి సార్.. ఆల్రెడీ ఫీల్ అవుతున్నాడు శేఖర్...!'
కాదు నీలాంబరీ, మనకిష్టం ఉన్న వాళ్లని ప్రేమించడంలో ఒక అర్థం ఉంది..
మనకు మనము నచ్చడం లేదని ప్రేమలో పడ్డం.. నాట్ రైట్!
'మరేమి చెయ్యాలి సార్ శేఖర్..????'
నచ్చినమ్మాయిని అమ్మకు చూపించి...
అమ్మకు నచ్చేలా నచ్చజెప్పి...
హ్యాపీగా ఉండమను నీలూ...!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

7				1	9	2	3	6
				4			9	
2			5			1		
		8	4	9				
4	9	2	6		8	5	7	1
				2	1	4		
		7			4			3
	2			6				
3	5	6	2	8				4

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	8	1	3	6	7	9	5	4
5	3	6	9	4	8	7	2	1
9	7	4	2	5	1	3	6	8
6	9	7	1	8	5	2	4	3
1	4	5	7	2	3	6	8	9
3	2	8	4	9	6	5	1	7
7	6	9	5	1	4	8	3	2
4	5	3	8	7	2	1	9	6
8	1	2	6	3	9	4	7	5

అందరం భగవంతుడి సేవ చేద్దాం

- మోహన్‌బాబు



● టీయస్సార్, స్వరూపానంద సరస్వతి, మోహన్‌బాబు

''నేను ఎప్పుడూ గుడి చైర్మన్ అవ్వాలనుకోలేదు. మా సంస్థలు, చిత్రాలతో బిజీగా ఉన్న నాకు ఈ అదనపు బాధ్యత ఎందుకనుకున్నా. పైగా నిజాన్ని నిర్భయంగా చెప్పడం నాకు అలవాటు. కానీ, ఆ మహాశివుడు టి.సుబ్బరామిరెడ్డి గారి స్వరూపంలో బాధ్యతలు స్వీకరించమన్నాడు'' అని నటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. హైదరాబాద్ ఫిలింనగర్ దైవ సన్నిధానం చైర్మన్‌గా మోహన్‌బాబు సోమవారం ప్రమాణ స్వీకారం చేసారు. విశాఖ శ్రీ శారదా పీఠం అధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానంద సరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో 12 మంది పాలక మండలి కొత్త సభ్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కమ్మ, కాపు, రెడ్డి కులాల వలే బ్రాహ్మణులలో కూడా శాఖలుంటాయి. అందరూ కలిసి ఆ భగవంతుడి సేవ చేద్దాం. నా అల్లుడు కూడా బ్రాహ్మణుడే. దేవుడి డబ్బు పైసా ముట్టుకోకుండా అవసరమైతే నా సొంత డబ్బులు ఖర్చు పెట్టి సన్నిధానంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సంకల్పిస్తున్నా. సన్నిధానంలోని దేవుళ్ల ఆశీస్సులతో మంచి కార్యక్రమాలు చేపడతామని ఆశిస్తున్నా'' అన్నారు.

ఆలయ కమిటీ సభ్యులు వీరే..

నటుడు గిరిబాబు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి సురేఖ, చాముండేశ్వరీ నాథ్, వి. రామ్ ప్రసాద్ ఉన్నారు. కార్యదర్శిగా ఖాజా సూర్య నారాయణ కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎం.పి, 'కళాబంధు' టీయస్సార్, రాజమండ్రి ఎం.పి. మురళీమోహన్, హీరోలు విష్ణు, మనోజ్, నటి–నిర్మాత లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జస్ట్ ఇంకో నెల... అంతే!



● నాగార్జున
● నాని

జోరు అందుకుంది. అవును.. ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ నిర్మించనున్న చిత్రం పనులు జోరుగా సాగుతున్నాయి. నాగార్జున–నాని కాంబినేషన్‌లో సంస్థ అధినేత సి. అశ్వనీదత్ ఒక సినిమా ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. 'భలే మంచి రోజు', 'శమంతకమణి' వంటి రెండు విజయాలను అందించిన శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఆరేడు నెలలుగా ఈ ప్రాజెక్ట్ గురించి వార్తలు వస్తున్నాయి కానీ ఎప్పుడు మొదలవుతుందనే క్లారిటీ లేదు. ఈ సినిమా మొదలు కావడానికి జస్ట్ ఇంకో నెల... అంతే. వచ్చే నెల 24న షూటింగ్ మొదలుపెట్టాలనుకుంటున్నామని యూనిట్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. అప్పటికల్లా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో నాగ్ చేస్తున్న సినిమా షూటింగ్ కంప్లీట్ అయిపోతుందట. అలాగే, నాని చేస్తోన్న 'కృష్ణార్జున యుద్ధం' కూడా పూర్తయిపోతుంది. ఆ తర్వాత ఈ హీరోలిద్దరూ వైజయంతి మూవీస్ నిర్మించే సినిమాతో బిజీ అవుతారు.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఊహించని మలుపులతో ఈ సినిమా ఆసక్తికరంగా సాగుతుందట. మంచి కామెడీతో, ట్విస్టులతో సిన్మా థ్రిల్‌కి గురి చేసే విధంగా ఉంటుందట. అంటే... ఎన్ అండ్ ఎన్... అదేనండీ నాగార్జున అండ్ నాని ఫుల్ ఫన్ ఇస్తారన్నమాట.



● రవీందర్, ప్రమోద్, విక్కీ, అశోక్, అనుష్క, మనోజ్, అల్లు అరవింద్, నాని...

అరుంధతిలా భాగమతి హిట్ కావాలి

– అల్లు అరవింద్

''భాగమతి' ట్రైలర్‌ను బిగ్ స్క్రీన్‌పై చూస్తే కాస్త భయమేసింది. ఏడాదికిపైగా ఈ సినిమా తీస్తున్నారు. అనుష్కకి ఉన్న ఏకైక లక్షణం.. ఓపిక చాలా ఎక్కువ. ఇండస్ట్రీలో అది ఎవరికీ లేదు. ఆ విషయాన్ని 'అరుంధతి' చిత్రంతో నిరూపించుకున్నారు. ఆ సినిమాలా 'భాగమతి' పెద్ద హిట్ కావాలి'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. అనుష్క టైటిల్ రోల్‌లో అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన చిత్రం 'భాగమతి' ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ–రిలీజ్ వేడుక నిర్వహించారు. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ– ''గెలవాలనుకున్నప్పుడు కష్టం మొదలవుతుంది. ఎలాగైనా గెలవాలనుకున్నప్పుడు మోసం మొదలవుతుంది. ఈ రెండూ సమాంతరంగా నడుస్తుంటాయి. తను గెలుస్తూ.. తన చుట్టూ ఉన్నవారిని గెలిపిద్దాం అని ఎవరైనా ఆలోచిస్తే.. అతనిలో దైవత్వం మొదలైనట్లు. అలాంటి దేవుడైన ప్రభాస్ ముందు ఈ కథ విని, ఇక్కడిదాకా నడిపించారు. వంశీ, ప్రమోద్, విక్కీగారు త్రిమూర్తులు. వీరితో ఐదేళ్లుగా ప్రయాణం చేస్తున్నా. సినిమాను బిడ్డలా చూసుకున్నారు. 'భాగమతి' కోసం అనుష్క విపరీతమైన డస్ట్‌లో 45 రోజులు పని చేశారు'' అన్నారు. ''2012లో 'భాగమతి' కథ వినగానే నచ్చిందన్నా. కానీ, డేట్స్ లేకపోవడంతో చేయలేనని చెప్పా. ఈ సినిమా నేను కాకుండా వేరే ఎవరైనా చేసి ఉంటే బాధపడేదాన్ని. ఎందుకంటే నా హృదయానికి బాగా దగ్గరైన కథ ఇది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు అనుష్క. ''నాతో 'పిల్లజమీందార్' చేసిన తర్వాత అందరూ అశోక్‌ను 'పిల్లజమీందార్ అశోక్' అని పిలుస్తున్నారు. జనవరి 26 తర్వాత అందరూ 'భాగమతి అశోక్' అని పిలుస్తారు. ఈ ఏడాది టాలీవుడ్‌కి సరైన హిట్ పడలేదు. 'భాగమతి'తో ఆ హిట్ వస్తుంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరో నాని. ''సాధారణంగా నటీనటులు, దర్శకులకు అభిమానులుంటారు. కానీ, నిర్మాతలకు ఉండరు. అయితే యూవీ క్రియేషన్స్ నిర్మాతలకు అభిమానులుంటారు'' అన్నారు దర్శకుడు మారుతి. దర్శకులు మేర్లపాక గాంధీ, రాధాకృష్ణ, నటులు ప్రభాస్ శ్రీను, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



● కీర్తీ సురేశ్

గోల్డెన్ హార్ట్

బంగారం ధర సామాన్యులు కొనలేనంతగా పెరిగిపోయింది. ఇలాంటి టైమ్‌లో ఎవరైనా గోల్డ్ గిఫ్ట్‌గా ఇస్తే పట్టరానంత ఆనందం కలుగుతుంది. కచ్చితంగా గిఫ్ట్ ఇచ్చిన వ్యక్తిది 'గోల్డెన్ హార్ట్' అనకుండా ఉండలేం. 'మహానటి' టీమ్ కీర్తీ సురేశ్‌ని అలానే అంటున్నారు. అందాల అభినేత్రి సావిత్రి జీవితం ఆధారంగా రూపొందుతోన్న 'మహానటి'లో కీర్తీ టైటిల్ రోల్ చేస్తున్న విషయం తెలిసిందే. నాగ అశ్విన్ దర్శకత్వంలో ప్రియాంకా దత్ నిర్మిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. సావిత్రి పాత్ర చేసే అవకాశం కెరీర్ ఆరంభించిన తక్కువ సమయంలో రావడం, ఈ సినిమా కోసం చేసిన ప్రయాణం మంచి అనుభూతిని మిగల్చడంతో యూనిట్ సభ్యులకు బహుమతులు ఇవ్వాలనుకున్నారు కీర్తీ. దాదాపు 100 మందికి గోల్డ్ కాయిన్ బహుమతిగా ఇచ్చారని సమాచారం. 5 గ్రాముల నుంచి 10 గ్రాముల వరకూ ఆ కాయిన్ ఉంటుందట. 100 కాయిన్స్ అంటే 25 లక్షల వరకూ ఖర్చు పెట్టి ఉంటారు కీర్తీ. ఈ సినిమాకి కీర్తీ మనసులో ఎంత స్పెషల్ ప్లేస్ ఉందో దీన్నిబట్టి ఊహించుకోవచ్చు. అయినా బహుమతులు ఇవ్వాలని రూలేం లేదు. అయితే తన ఆనందాన్ని పంచుకోవడం కోసమే ఆమె ఇలా చేశారు. మేడమ్ మనసు బంగారం కదూ.


కిక్ ఇచ్చే లుక్‌లో



● సూర్య

'గ్యాంగ్' సినిమా సక్సెస్‌ను పూర్తిగా ఎంజాయ్ చేయకముందే తదుపరి చిత్రాన్ని పట్టాలు ఎక్కించేశారు సూర్య. '7/జి బృందావన కాలనీ, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' ఫేమ్ సెల్వ రాఘవన్ దర్శకత్వంలో సూర్య ఓ సినిమా ఒప్పుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ నిన్న మొదలైంది. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో సూర్య నటించడం ఇదే తొలిసారి. ఈ సినిమాలో సాయి పల్లవి, రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సూర్య క్యారెక్టరైజేషన్, లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని చిత్రబృందం పేర్కొన్నారు. ఫ్యాన్స్‌కైతే ఆయన లుక్ కిక్ ఇచ్చే విధంగా ఉంటుందట. ఎస్ ఆర్ ప్రభు, ఎస్.ఆర్. ప్రకాష్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాను దీపావళికి విడుదల చేయాలనుకుంటున్నారు.

శతమానం భవతి



కోరుకున్నవాణ్ణి పెళ్లి చేసుకోవటమే కదా ఏ ఆడపిల్లైనా ఆశపడేది. అది సాధారణ అమ్మాయి అయినా సరే హీరోయిన్ అయినా సరే. ఇప్పుడు భావన ఆ ఆనందంలోనే ఉన్నారు. 'ఒంటరి, మహాత్మ' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ మలయాళ కుట్టి తన ప్రేమికుడు నవీన్‌తో ఏడడుగులు వేశారు. నిన్న ఉదయం కేరళ త్రిస్సూర్‌లో 'నవీన్'ను కేరళ స్టైల్‌లో పెళ్లి చేసుకున్నారు భావన. నవీన్ కన్నడ ఇండస్ట్రీకి చెందిన సినీ నిర్మాత. వధూవరుల కుటుంబ సభ్యులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్, చాలా కొద్దిమంది ఇండస్ట్రీ ఫ్రెండ్స్ మధ్య ఈ పెళ్లి వేడుక జరిగింది. భావన ఫ్రెండ్స్, కథానాయికలు రమ్య నంబీసన్, నవ్య నాయర్, భామ ఈ పెళ్లిలో సందడి చేశారు. ఈ కొత్త జంటకు ఇండస్ట్రీకు చెందిన పలువురు సెలబ్రిటీలు 'శతమానం భవతి' అని శుభాకాంక్షలు తెలిపారు. త్రిస్సూర్‌లోని లూలూ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండస్ట్రీ మరియు ఫ్యాన్స్ కోసం ప్రత్యేకంగా వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారట.



● నవీన్, భావన




● తమన్నా

లెట్స్ డూ ట్యాంగో

కత్తి యుద్ధం నేర్చుకోవాలా? గుర్రపు స్వారీ నేర్చుకోవాలా? బస్తీ మే సవాల్.. నేర్చేసుకుంటా అంటూ 'బాహుబలి' సినిమా కోసం తమన్నా ఆ రెంటిలో శిక్షణ తీసుకున్నారు. ఇప్పుడు మరో చాలెంజ్‌కి రెడీ అయ్యారు. అయితే ఈసారి ఫైట్ కోసం కాదండి. సాంగ్ కోసం. తమన్నా ఓ కొత్త డాన్స్ కోసం ప్రాక్టీస్ చేస్తూ తెగ శ్రమిస్తున్నారట. చిన్న చిన్న గాయాలు కూడా చేసుకున్నారట. తమన్నాను ఇంతలా ఇబ్బంది పెడుతున్న డాన్స్ పేరేంటంటే 'ట్యాంగో'. ఈ ట్యాంగో డాన్స్ ఏంటా అనుకుంటున్నారా? పార్టనర్స్‌తో కలిసి చేసే డ్యాన్స్‌ను ట్యాంగో డాన్స్ అంటారు. కొంచెం జిమ్నాస్టిక్స్ టచ్ డ్యాన్స్‌లో కనిపిస్తుంది. అమెరికన్, యూరోపియన్ కంట్రీస్‌లో ఈ డాన్స్ బాగా ఫేమస్. ఏ సినిమా కోసం తమ్మూ నేర్చుకుంటున్నారంటే.. కల్యాణ్ రామ్ హీరోగా '180' ఫేమ్ జయేంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నా నువ్వే'. ఈ సినిమా కోసమే ట్యాంగో డాన్స్ నేర్చుకుంటున్నారు తమన్నా. సినిమాలో వచ్చే ఓ ప్రత్యేకమైన సాంగ్ కోసం నృత్య దర్శకురాలు బృంద ఆధ్వర్యంలో తమన్నా ప్రాక్టీస్ చేస్తున్నారట. ''ట్యాంగో డాన్స్‌ను తొలిసారి ప్రయత్నిస్తున్నాను. అనుకున్నంత సులువుగా ఏం లేదు. ప్రాక్టీస్‌లో చిన్న చిన్న గాయాలు కూడా చేసుకున్నాను. కానీ బృందా మాస్టర్ హెల్ప్ వల్ల ఈ డ్యాన్స్ స్టైల్‌ను నేర్చుకోగలిగాను'' అని తమన్నా పేర్కొన్నారు.

కామెడీతో నాకు కెమిస్ట్రీ కుదురుతుంది



● నాగేశ్వర రెడ్డి

''కొన్నేళ్ల క్రితం దర్శకులు దాసరి నారాయణరావుగారు ఆయన ఊళ్లోని ఓ ఆచారిని రిఫరెన్స్‌గా తీసుకుని ఒక పాత్ర రాసుకున్నారు. మల్లాదిగారు ఆ క్యారెక్టర్ చుట్టూ అందమైన స్టోరీ రాసుకున్నారు. చౌదరిగారు ఆ కథ విని బావుందని నాకు చెప్పడం, నాకూ నచ్చడంతో సినిమా సెట్స్‌పైకి వెళ్లింది'' అని దర్శకుడు జి. నాగేశ్వర రెడ్డి అన్నారు. మంచు విష్ణు, ప్రగ్యా జైస్వాల్ జంటగా ఎమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పణలో కీర్తీచౌదరి, కిట్టు నిర్మించిన 'ఆచారి అమెరికా యాత్ర' త్వరలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు నాగేశ్వర రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

- తాత సెంటిమెంట్‌తో తెరకెక్కిన చిత్రమిది. ఓ తాత–మనవరాలికి పొంచి ఉన్న ప్రమాదాన్ని ఒక బ్రాహ్మణ బృందం ఎలా కాపాడింది? అన్నదే కథ. కథ అనుకున్నప్పుడే విష్ణు, బ్రహ్మానందం అని ఫిక్సయ్యాం. నిర్మాతల ఆలోచనల్లో కూడా వారే.
- నాకు, విష్ణుకి మంచి కెమిస్ట్రీ కుదురుతుంది అంటారు. కానీ నిజానికి నాకు, కామెడీకి మంచి కెమిస్ట్రీ కుదురుతుంది. కామెడీ పండించగల ఏ హీరోతో అయినా నేను కంఫర్టబుల్‌గా ఉంటాను. ఓ సినిమాలో అందరూ ఉండి బ్రహ్మానందంగారు లేకపోతే లోటు కనిపిస్తుంది. ఈ సినిమాలో ఆయన ఫుల్ లెంగ్త్ కామెడీతో అలరిస్తారు.
- సినిమా పుట్టినప్పటి నుంచి కామెడీ ఉంది. రాజేంద్ర ప్రసాద్ గారు వచ్చిన తర్వాత ఫుల్ లెంగ్త్ కామెడీ సినిమాలొచ్చాయి. ఆయన తర్వాత 'అల్లరి' నరేశ్ ఆ పరంపర కొనసాగిస్తున్నాడు. ఇండస్ట్రీలో లవర్‌బాయ్స్ ఎక్కువగా ఉండటంతో ఆ స్టోరీస్ ఎక్కువగా ప్రిఫర్ చేస్తున్నారు. పైగా.. కామెడీ ఎంటర్టైనర్‌కి తక్కువ పే చేస్తారు. అందుకే ఎక్కువగా ఎవరూ ప్రిఫర్ చేయరు.
- టాలీవుడ్‌లో చిరంజీవిగారి కన్నా పెద్ద స్టార్ లేరు. అలాంటిది ఆయనే కామెడీ చేశారు. స్టార్ హీరోతో సినిమా చేయాలంటే టైమ్ కలిసి రావాలి. నా తర్వాతి సినిమా కూడా విష్ణుతోనే. వెంటనే ప్రారంభిస్తున్నాం.

హైదరాబాద్
మంగళవారం
23-1-2018
సాక్షి ఫ్యామిలీ

పరి పరిశోధన

అంతరిక్ష వ్యర్థాలకు లేజర్ల పరిష్కారం!


భూమి చుట్టూ అంతరిక్షంలో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ చెత్తను నాశనం చేసేందుకు చైనా ఓ వినూత్న పద్ధతికి పదును పెడుతోంది. వివిధ దేశాలు ప్రయోగించిన ఉపగ్రహాలు, రాకెట్ల భాగాలు కొన్ని అక్కడ తిరుగుతూ చికాకు పెడుతున్న విషయం తెలిసిందే. ఈ చెత్తను శుభ్రం చేసేందుకు శాస్త్రవేత్తలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారుగానీ.. చైనా మాత్రం నేరుగా



వాటిని శక్తిమంతమైన లేజర్ కిరణాలతో కాల్చేస్తే పోలా? అంటోంది. చిత్రమైన విషయం ఏమిటంటే.. ఈ పద్ధతిని ఉపయోగించాలంటే ఓ ఉపగ్రహంపై లేజర్ కిరణాలను ఉత్పత్తి చేసే యంత్రాన్ని ఏర్పాటు చేయాలి. ఈ ఉపగ్రమం అంతరిక్షంలోకి చేరిన తరువాత తొలగించాలనుకున్న చెత్తపై ఉపగ్రహాన్ని ఫోకస్ చేస్తారు. కొన్ని నిమిషాలపాటు పరారుణ కాంతి కిరణాలను ఇరవైసార్లు ప్రయోగిస్తారు. దీంతో ఆ చెత్త కాస్తా ప్రమాదం లేని చిన్న చిన్న భాగాలుగా విడిపోతుంది. అయితే ఇలా లేజర్ యంత్రాలను అంతరిక్షంలోకి చేరిస్తే భవిష్యత్తులో వీటిని ఆయా దేశాలు భూమ్మీద ఉండే తమ శత్రు దేశాలపైకి ప్రయోగించే అవకాశాలు ఉంటాయని, కాబట్టి కొంచెం జాగ్రత్త వహించాల్సి ఉంటుందని కొందరు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉపగ్రహ వ్యర్థాల పైకి లేజర్లను ప్రయోగించడం చాలా కాలంగా ఉన్న ఆలోచనే అయినప్పటికీ ఇటీవలి కాలంలో దీనికి ప్రాధాన్యం పెరుగుతోంది.

కరెంటు బ్యాటరీ కాదు... వేడి కోసం బ్యాటరీ!

బ్యాటరీల్లో కరెంటు నిల్వ ఉంటుందని అవసరమైనప్పుడు అవసరమైనంత మేరకు ఈ కరెంటును వాడుకోవచ్చునని మనకు తెలుసు. చేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్ మొదలుకొని బోలెడన్ని ఉదాహరణలు ఉన్నాయి దీనికి. ఇప్పుడిదంతా ఎందుకు అంటే యూనివర్శిటీ ఆఫ్ మాసాచూసెట్స్ శాస్త్రవేత్తలు ఇంకో వినూత్నమైన బ్యాటరీని సిద్ధం చేశారు కాబట్టి! ఇది కరెంటుకు



బదులుగా ఉష్ణాన్ని నిల్వ చేసుకుంటుంది. అయితే ఏంటి దీంతో ప్రయోజనమని ఆశ్చర్యపోతున్నారా? బోలెడున్నాయి. సూర్యుడి నుంచి వెలువడే వేడిని ఈ బ్యాటరీలో బంధించి రాత్రిళ్లు వంటకు వాడుకోవచ్చు. లేదంటే కార్ల నుంచి వచ్చే వేడిని విద్యుత్తుగానూ మార్చుకొవచ్చు. అజోబెంజీన్ ఆధారిత పాలీ మెథాక్రలైట్ అనే కొత్త పదార్థంతో ఈ బ్యాటరీ తయారవుతుంది. వేడి సోకితే చాలు ఇందులోని అణువులు తమ స్థితిని మార్చేసుకుని శక్తిని మొత్తం తమలోనే దాచుకుంటాయి. చల్లబరిస్తే వేడి మొత్తం బయటకు వస్తుంది. ఈ కొత్త బ్యాటరీలను భారత్ లాంటి దేశాల్లో పొగరాని పొయ్యిల మాదిరిగా కూడా వాడుకోవచ్చునని తద్వారా ఎందరో మహిళల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని అంటున్నారు ఈ పదార్థాన్ని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించిన భారతీయ సంతతి శాస్త్రవేత్త వెంకట్రామన్ దండపాణి.

ఫేక్ వార్తలకు ర్యాంకులిచ్చేయవచ్చు...

ఫేస్‌బుక్‌లో తప్పుడు వార్తలు ఎక్కువయ్యాయని ఇబ్బంది పడుతున్నారా? వాస్తవమేమిటో... అబద్ధమేమిటో తెలియని స్థితిలో పడిపోయారా? ఈ



చిక్కు సమస్యకు చెక్ పెట్టేందుకు ఫేస్‌బుక్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. మీకు నమ్మకమైన వార్తలు ఎవరు అందిస్తారో మీరే చెప్పాలంటూ ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్ వినియోగదారులనే కోరనుంది. ఫేస్‌బుక్‌లో ఉన్న దాదాపు 200 కోట్ల మంది గుర్తించడం మొదలుపెడితే తప్పుడు వార్తలు, సమాచారాన్ని గుర్తించడం చాలా తేలిక అవుతుందని.. తద్వారా అలాంటి సమాచారాన్ని తీసేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఫేస్‌బుక్ అంటోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు మొదలుకొని అనేక ఇతర అంశాల విషయంలో ఫేస్‌బుక్ తప్పుడు వార్తల వ్యాప్తికి ఉపయోగపడిందన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బెర్గ్.. ఈ అవ్యవహారాలకు చెక్ పెట్టడం ఈ కొత్త సంవత్సరంలో తాను తీసుకున్న నిర్ణయమని ఆయన ఈమధ్యే ప్రకటించారు కూడా. అన్నీ సవ్యంగా సాగితే ఈ వారంలోనే 'విశ్వసనీయ వర్గాలు' అన్న ఆప్షన్ ఫేస్‌బుక్‌లో కనిపించడం మొదలు కావచ్చు. చూద్దాం ఏమవుతుందో!

సంప్రదాయం - సైన్స్

ఆరోగ్యానికి హారతి కర్పూరం

కర్పూరం అనేది మనకి తెలిసినంతవరకు దేవునికి హారతి ఇవ్వడానికి ఉపయోగిస్తారనీ, లడ్డూల వంటి తీపి పదార్థాలకు కాసింత పచ్చకర్పూరాన్ని జత చేస్తే అద్భుతమైన రుచి వస్తుందనీ... అదేవిధంగా వేంకటేశ్వర స్వామి నామాన్ని తీర్చిదిద్దడానికి వాడతారనీనూ. అయితే, కర్పూరం రసాయనాలతో కృత్రిమంగా తయారయిందనుకుంటారు చాలామంది. కానీ, కాంఫర్ లారెల్ అనే చెట్టు ఆకులు, కొమ్మలనుండి కర్పూరాన్ని తయారు చేస్తారు. అలాగే కొన్నిరకాలైన తులసి (కర్పూర తులసి) జాతులనుండి కూడా తయారు చేస్తారు.



- కర్పూరంలో హారతి కర్పూరం, ముద్ద కర్పూరం, పచ్చకర్పూరం, రసకర్పూరం, భీమసేని కర్పూరం, సితాభ్ర కర్పూరం, హిమకర్పూరం తదితర రకాలున్నాయి.
- దీని వలన అసంఖ్యాకమైన ఆరోగ్య ఉపయోగాలు ఉన్నాయి. అసలు కర్పూరం వాసన పీలిస్తే చాలు శారీరక రుగ్మతలన్నీ పోయినట్లు, సేద తీరినట్లు ఉంటుంది. మానసిక ప్రశాంతత చేకూరుతుంది.
- స్వల్ప గుండె సమస్యలు, అలసట వంటి వాటికి కొద్ది మొత్తం కర్పూరం వాడితే ఫలితముంటుంది.
- అన్ని రకాల ఆర్థరైటిస్, రుమాటిక్ నొప్పుల నివారిణిగా, నరాల సమస్యలు, వీపునొప్పికి బాగా పనిచేస్తుంది. పుండ్లు మానడానికి, పిల్లలకు గజ్జి, బొబ్బలు తగ్గడానికి, బ్రాంకయిటిస్, పలు రకాల ఇన్ఫెక్షన్లకు ఉపయోగిస్తారు. ● శ్వాస సంబంధ సమస్యల నివారణకు వాడే మందుల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తారు. ● కాలుష్యాన్ని పోగొట్టి, వాతావరణాన్ని స్వచ్ఛంగా మారుస్తుంది. అంటువ్యాధులు ప్రబలకుండా చేస్తుంది. ● కళ్ళకు మేలు చేస్తుంది కనుకనే కాటుకలో కర్పూరాన్ని వాడతారు. ● జలుబును, కఫాన్ని తగ్గిస్తుంది. మానసిక జబ్బులను సైతం పోగొడుతుంది.



ఉదయ్‌సిన్హ్ రమణ్‌లాల్ జాదవ్





అమితాబ్‌తో ఉదయ్‌సిన్హ్ రమణ్‌లాల్ జాదవ్

విశిష్ట వ్యక్తి

దిల్‌వాలా

ఆటో చూడు ఆటో చూడు.... మనసున్న మనిషిని చూడు... నిస్వార్థ సేవను చూడు... మానవత్వపు మార్గం చూడు.... మంచిని పెంచే పనిని చూడు... జాదవ్ భాయ్ ఘనతను చూడు... ఆ ఆటో గొప్పను చూడు.... అతడిలా మంచిని పెంచరా... అతని మార్గం అందరికీ మేలురా...

'నీ గాంధీగిరితో ఇంట్లోవాళ్లను చంపేస్తావా? చూడు ఏమైందో? స్కూల్ ఫీజు కట్టలేదని వాడి ఫైనల్ రిజల్ట్స్ ఏంటో చెప్పలేదు టీచర్లు' అరుస్తోంది భార్య.

'ఒరేయ్.. రెక్కాడితే కాని డొక్కాడని మనకెందుకురా ఈ ఉచితసేవా కార్యక్రమాలు? నీ సంపాదన మీదే మేమంత ఆధారపడ్డాం.. కాస్త చూసుకో.. బాధ్యతగా నడుచుకో' సలహా లాంటి హెచ్చరిక నాన్న నుంచి.

అసహనంతో ఇంట్లోంచి బయటపడ్డాడు. ఊరంతా ఆటో తిప్పుతున్నాడు. ఆలోచనల్లో పడ్డాడు.

'నేనేమైనా తప్పు చేస్తున్నానా? నా అలవాటుతో ఇంట్లోవాళ్లను బాధ పెడ్తున్నానా? ఇంటిని నడిపే బాధ్యత తన మీద ఉన్నప్పుడు ఇంట్లో వాళ్లను కష్టపెట్టకూడదు కదా. నా తత్వానికి నా కొడుకు ఎందుకు బలి కావాలి? తప్పు నాదేనా? ఎవరికి వాళ్లు ఇలా బంధాలు, బాధ్యతలు అనుకుంటూ వాటికి బందీ అయితే మంచి ఎలా బతుకుతుంది? ఎవరో ఒకరు కష్టపడితేనే కదా.. పది మంది బాగుపడేది. లేదు... నేనే తప్పు చేయట్లేదు. ఇంకో కష్టం చేసైనా సరే పిల్లాడి ఫీజు కడ్తాను. అంతే కాని నా దారి మార్చుకునేది లేదు' అంతర్మథనంలోంచి గట్టి నిర్ణయమే తీసుకున్నాడు.

ఇంతకీ ఆయన ఎవరు?

ఓ సాదాసీదా ఆటోవాలా! పేరు ఉదయ్‌సిన్హ్ రమణ్‌లాల్ జాదవ్. ఊరు గుజరాత్‌లోని అహ్మదాబాద్. మరి ఇంట్లో వాళ్లు అభ్యంతర పెట్టేంత పని ఈయన ఏం చేస్తున్నాడు? ఏంలేదు.. మీటర్ వేయకుండా బేరం చేయకుండా ఆటో నడుపుతుంటాడు. గమ్యం చేర్చాక 'మీకు తోచినంత ఇవ్వండి' అంటాడు చిరునవ్వుతో! అదీ కూడా తర్వాత ఎక్కే ప్యాసెంజర్స్ కోసమే అని విన్నవిస్తాడు. అంటే వీళ్ల ప్రయాణం ఉచితంగానే సాగినట్టన్నమాట. దయగల మహాత్ములు వచ్చిన దూరం కంటే ఎక్కువే డబ్బులు ఇవ్వచ్చు. కొంతమంది బొటాబొటి కట్టొచ్చు. ఇంకొంత మంది తక్కువే ఇవ్వచ్చు. చాలా మంది అసలు ఇవ్వకపోనూ వచ్చు. అయినా సరే అతడిది అదే ధోరణి. అదీగాక ఈ ఆటోవాలా పేదవాళ్లకు, వికలాంగులకు ఫ్రీ సర్వీస్ ఇస్తుంటాడు. అలా ఆయన అనుసరిస్తున్న గాంధీమార్గం వల్ల ఇంటి ఖర్చులకు సరిపడా కాసులు రావడం లేదు. భారం అంతా ఇంటిని చక్కదిద్దుతున్న ఉదయ్‌సిన్హ్ భార్య మీద పడుతుంటుంది. కాని మంచి పనికి మొదట కష్టం ఎదురు కావచ్చు. తర్వాత విజయమే వరిస్తుంది.

ఎక్కడి నుంచి స్ఫూర్తి పొందాడు?

అహ్మదాబాద్‌లో పేదవాళ్ల కోసం 'మానవ్ సాధ్‌నా' అనే ఓ ఎన్‌జీవో పని చేస్తుంటుంది. కుల, మతభావాలకు అతీతంగా పేదవాళ్లకు అన్నం పెడ్తుంటుంది. బయట ఎంత కొట్టుకుంటున్నా ఆకలయ్యే సరికి జనం ఈ మానవ్ సాధ్‌నా అనే ఒకే చూరుకిందకు రావడం అన్ని మరిచి పోయి కడుపు నింపుకోవడం చూసి ఆశ్చర్యపోయేవాడు ఉదయ్ సిన్హ్. వీళ్లందరినీ ఇలా ఒక్కటి చేస్తున్న మానవ్ సాధ్‌నా వలంటీర్ల ప్రయత్నానికి ముగ్ధుడయ్యి తనూ వారితో కలిశాడు. చేరాడు. రెండేళ్లు పనిచేశాడు. ఆ తత్వాన్ని ఒంటబట్టించుకున్నాడు. బయటకు వచ్చాక అక్కడ నేర్చుకున్న సంస్కారాన్ని కార్యరూపంలో పెట్టాలనుకుని 'అహ్మదాబాద్ నొ ఆటోరిక్షావాలో' (పే ఇట్.. ఫార్వర్డ్) పేరుతో ఆటో స్టార్ట్ చేశాడు. అదే తోచినంత ఇచ్చే కాన్సెప్ట్ ఆటో. ఎక్కిన ప్యాసెంజర్ తర్వాత ఎక్కబోయే ప్యాసెంజర్ డబ్బులు కట్టాలన్నమాట. గమ్యం చేరాక ప్రయాణికులు దిగగానే హార్ట్‌షేప్‌లో ఉన్న మెనూకార్డ్ లాంటి కార్డ్ ఇస్తాడు. 'ఆదరంగా ఇవ్వండి' అని చెప్తాడు. అతని ఆటో వెనక పెద్ద పెద్ద అక్షరాలతో 'పే ఫ్రమ్ యువర్ హార్ట్' అని రాసి ఉంటుంది. ఏమీ ఇవ్వలేని వాళ్లు మనసారా నవ్వితే చాలని ఆరాటపడ్తాడు ఉదయ్. అయితే అతను ఈ సర్వీస్ మొదలుపెట్టినప్పుడు ఎవరూ అంతగా పట్టించుకోలేదు. కాని రాను రానూ ఈ కాన్సెప్ట్ అందరిలోకి వెళ్లి ఉదయ్‌సిన్హ్‌కి డిమాండ్ పెరిగే సరికి తోటి ఆటోవాలాలు అతని మీద పెద్ద పోరాటానికే దిగారు. నవ్వు చెడిందే కాక మా గిరాకీ చెడగొడ్తున్నావ్ అంటూ. అయినా ఉదయ్ తన ఆటోకి బ్రేక్ వేయలేదు. చివరకు తోటి ఆటోవాలాలే నెమ్మదిగా తగ్గి అడ్డుఅదుపు లేకుండా తిరుగుతున్న మీటర్‌ను క్రమపద్ధతికి మార్చారు. 'ఉదయ్ భాయ్‌లా పెద్ద మనసు మాకు లేదులే కాని నిజాయితీగా పని చేయాలని మాత్రం అనుకున్నాం' అని చెప్తారు ఆ ఆటోవాలాలు.

ఉదయ్ సిన్హ్ నిజంగానే గ్రేట్.

అమితాబ్ ఎక్కిన ఆటో

ఉదయ్‌సిన్హ్ సర్వీస్ ఊసు ఆ మీడియా ఈ మీడియా ద్వారా దేశమంతా ప్రచారమైంది. ముంబైలో ఉన్న అమితాబ్‌కి, చేతన్‌భగత్‌కీ తెలిసింది. అతనిని కలుసుకోవడం కోసం ఈ ఇద్దరూ అహ్మదాబాద్ వచ్చి అతని ఆటో ఎక్కి ఊరంతా తిరిగారు. అతని కుటుంబాన్ని కలుసుకున్నారు. తోచినంత డబ్బిచ్చారు. అతని గాంధీగిరిని చూసి కళ్లెర్ర చేసిన ఆయన భార్య ఇప్పుడేం చేస్తుందో తెలుసా? 'మావారు చేస్తున్న పని చాలా ఆలస్యంగా అర్థమైంది. ఆయన్ని చూసి నాకూ ఏదో ఒకటి చేయాలనిపించింది. అందుకే మా ఆయన ఆటోలో ఎక్కే పేద ప్రయాణికుల కోసం ఢోక్లా, లస్సీ తయారు చేసి ఆటోలో పెడ్తాను' అంటుంది. ఉదయ్ వాళ్ల నాన్న ఆకలిగొన్న పశువులకు దాణా వేస్తుంటాడు. ఇలా తన కుటుంబాన్ని, చుట్టుపక్కల వాళ్లకూ స్ఫూర్తి పంచుతున్న ఉదయ్‌సిన్హ్ రమణ్‌లాల్‌ను రెడ్ ఎఫ్.ఎమ్ 'బడే దిల్‌వాలే' పురస్కారాన్ని, రోటరీ క్లబ్ కూడా సేవా అవార్డ్‌ను ఇచ్చి సత్కరించింది. తన సేవకు బరోడా మేనేజ్‌మెంట్ అవార్డ్‌నూ అందుకున్నాడు ఉదయ్‌సిన్హ్.

'ఎవరికి వాళ్లు నేనేమై పోవాలి అనుకుంటే ఏదీ ముందుకు కదలదు. ఎదుటి వ్యక్తికి సహాయపడ్డమనేది చెప్తే వచ్చేది కాదు.. అది మనలో సహజసిద్ధంగా ఉండాలి' అంటాడు మనసున్న ఆటోవాలా ఉదయ్‌సిన్హ్ రమణ్‌లాల్ జాదవ్.



ఫ్యామిలీ డాక్టర్

యూరినరీ ఇన్ఫెక్షన్‌తో మాటిమాటికీ జ్వరం... నయమయ్యేదెలా?



మా బాబుకు తొమ్మిది నెలలు. వాడికి ఈమధ్య మాటిమాటికీ జ్వరం వస్తోంది. డాక్టర్‌కు చూపిస్తే యూరినరీ ఇన్ఫెక్షన్ కారణంగా ఇలా తరచూ జ్వరం వస్తోందంటున్నారు. మాకు తగిన పరిష్కారం చెప్పండి.

– మాధవి, కందుకూరు

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ బాబుకు 'యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్'గా చెప్పవచ్చు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ నెలల పిల్లల్లోనూ చాలా సాధారణంగా కనిపిస్తుంటాయి. ఏడాది లోపు వయసుండే చిన్నపిల్లల్లో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు మగపిల్లల్లోనే ఎక్కువ. అయితే పిల్లల్లో వయసు పెరిగే కొద్దీ ఈ పరిస్థితి తారుమారై... మగపిల్లల కంటే ఆడపిల్లల్లోనే ఇవి ఎక్కువగా కనిపిస్తుంటాయి. చిన్న పిల్లల్లో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లకు అనేక కారణాలుంటాయి. వయసు, జెండర్, వ్యాధి నిరోధక శక్తి, మూత్ర కోశ అంతర్గత అవయవ నిర్మాణంలో ఏవైనా తేడాలు, విసర్జన తర్వాత ఎంతో కొంత మూత్రం లోపలే మిగిలిపోవడం (వాయిడింగ్ డిస్‌ఫంక్షన్), మలబద్దకం, వ్యక్తిగత పరిశుభ్రత సరిగా పాటించకపోవడం వంటివి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చేందుకు కొన్ని కారణాలుగా చెప్పవచ్చు.

లక్షణాల ఆధారంగా కొన్నిసార్లు యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లను నిర్ధారణ చేయడం కాస్త కష్టమే. ఎందుకంటే ఈ లక్షణాలు నిర్దిష్టంగా ఉండవు. రకరకాలుగా కనిపిస్తూ ఉంటాయి. అంటే... కొన్ని లక్షణాలు సెప్సిస్, గ్యాస్ట్రోఎంటిరైటిస్‌లా కూడా ఉంటాయి.

యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ ఉన్న పిల్లల్లో జ్వరం, త్వరగా చిరాకు పడటం, ఆహారం సరిగా తీసుకోకపోవడం, వాంతులు, నీళ్లవిరేచనాలు, మూత్రవిసర్జనను నియంత్రించుకోలేకపోవడం, మూత్రవిసర్జన సమయంలో నొప్పి, పొత్తికడుపులో నొప్పి, చుక్కలు చుక్కలుగా మూత్రం పడటం వంటి లక్షణాల ఉంటాయి. వాటి సహాయంతో దీన్ని గుర్తించవచ్చు.

పిల్లల్లో... మరీ ముఖ్యంగా నెలల పిల్లల్లో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌ను డయాగ్నోజ్ చేసినప్పుడు వారిలో మూత్ర కోశ వ్యవస్థ (జెనిటోయూరినరీ సిస్టమ్)కు సంబంధించి ఏదైనా లోపాలు (అబ్‌నార్మాలిటీస్) ఉన్నాయేమో పరీక్షించడం తప్పనిసరిగా అవసరం. ఉదాహరణకు ఇలాంటి పిల్లల్లో ఫైమోసిస్, విసైకో యూరేటరీ రిఫ్లక్స్ (వీయూఆర్), కిడ్నీ అబ్‌నార్మాలిటీస్ వంటి సమస్యలు ఉన్నప్పుడు వాళ్లకు యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ. కాబట్టి పిల్లల్లో పదేపదే యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ కనిపిస్తే తప్పనిసరిగా కంప్లీట్ యూరినరీ ఎగ్జామినేషన్ విత్ కల్చర్ పరీక్ష, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎమ్‌సీయూజీ, మూత్రపిండాల పనితీరు తెలుసుకోడానికి న్యూక్లియర్ స్కాన్ వంటి పరీక్షలతో పాటు రీనల్ ఫంక్షన్ పరీక్షలు తప్పక చేయించాలి. పిల్లలకు ఏవైనా అవయవ నిర్మాణపరమైన లోపాలు (అనటామికల్ అబ్‌నార్మాలిటీస్) ఉన్నట్లు బయటపడితే... వాటికి అవసరమైన సమయంలో సరైన శస్త్రచికిత్స చేయించాల్సి ఉంటుంది. ఇక ఇన్ఫెక్షన్‌ను తగ్గించడానికి తప్పనిసరిగా యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయడం చాలా ముఖ్యం. అలాగే చిన్నపిల్లలకు యూరినరీ ఇన్ఫెక్షన్స్ పదే పదే వస్తున్నప్పుడు... కిడ్నీకి ఇన్ఫెక్షన్ (పైలో నెఫ్రైటిస్) సోకకుండా నివారించడానికి మూడు నుంచి ఆరు నెలల పాటు తప్పనిసరిగా ప్రొఫిలాక్టిక్ యూరినరీ యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. కొద్దిగా పెద్ద పిల్లల విషయానికి వస్తే వారిలో మలబద్ధకం లేకుండా చూడటం, తరచూ మూత్రవిసర్జన చేసేలా చూడటంతో పాటు మంచి నీళ్లు, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగేలా వారికి అలవాటు చేయడం అవసరం. మీరు పైన పేర్కొన్న విషయాలపై అవగాహన పెంచుకొని, మీ పిల్లల వైద్య నిపుణుడి ఆధ్వర్యంలో తగిన చికిత్స తీసుకోండి.

పీడియాట్రిక్ కౌన్సెలింగ్

బాబు నోట్లో పొక్కులు... ఎందుకిలా?


మా బాబు వయస్సు తొమ్మిదేళ్లు. పెద్దల్లో కనిపించినట్టే వాడి నోట్లోనూ పొక్కులు వస్తున్నాయి. దీనికి కారణం ఏమిటి? దయచేసి మాకు తగిన సలహా ఇవ్వండి.


– లక్ష్మీప్రసన్న, ఖమ్మం

మీ బాబుకు ఉన్న కండిషన్‌ను యాఫ్తస్ అల్సర్స్ లేదా యాఫ్తస్ స్టొమటైటిస్ అని అంటారు. ఈ పొక్కులు ముఖ్యంగా నోట్లో, పెదవులు, గొంతుపై భాగం (అప్పర్ థ్రోట్)లో ఎక్కువగా వస్తుంటాయి. వీటికి ఫలానా అంశమే కారణమంటూ నిర్దిష్టంగా చెప్పలేం. అయితే నిమ్మజాతి (సిట్రస్) ఫ్రూట్స్, పులుపు పదార్థాలు ఎక్కువగా తిన్నప్పుడు, బాగా కారంగా ఎక్కువ మసాలాలతో ఉండే ఆహారం తీసుకున్నప్పుడు ఇవి రావచ్చు. కొందరిలో ఇవి విటమిన్ బి12, ఐరన్, ఫోలిక్ యాసిడ్, జింక్ లోపాలతోనూ రావచ్చు. ఎక్కువ సాంద్రత ఉన్న టూత్‌పేస్టులు వాడేవారిలో, బాగా మానసిక ఒత్తిడికి గురయ్యే వారిలో ఇవి కనిపిస్తాయి. కొందరిలో ఇవి తీవ్రంగా అలసిపోయిన (ఫెటిగ్) సందర్భాల్లో చూస్తూ ఉంటాం. మరికొందరిలో జబ్బుపడ్డప్పుడు కనిపిస్తాయి. కొన్ని హార్మోన్ల అసమతౌల్యత వల్ల, జీర్ణకోశవ్యాధులు ఉన్న సందర్భాల్లోనూ కనిపించవచ్చు. ఇవి రాకుండా నివారణ చర్యలివే...

● నోటికి బాధ కలిగించే పదార్థాలు తీసుకోకపోవడం ● బాగా పుల్లగా ఉండే పదార్థాలు అవాయిడ్ చేయడం ● నోరు ఒరుసుకుపోయేందుకు దోహదపడే ఆహారపదార్థాలు (అబ్రేసివ్ ఫుడ్స్) తీసకోకపోవడం. ● నోటి పరిశుభ్రత (ఓరల్ హైజీన్) పాటించడం వంటివి చేయాలి.

ఈ సమస్య మరీ ఎక్కువగా ఉన్నప్పుడు లోకల్ అనస్థిటిక్ జెల్స్‌తో పాటు కార్టికోస్టెరాయిడ్స్, సిల్వర్ నైట్రేట్ వాడటంతో పాటు కొన్ని సందర్భాల్లో ఓరల్ యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. సమస్య మాటిమాటికీ వస్తున్నట్లయితే నాన్ ఆల్కహాలిక్ మౌత్‌వాష్, తక్కువ లో కాన్సంట్రేటెడ్ మౌత్ వాష్ వంటివి ఉపయోగిస్తే కొంతవరకు ఉపయోగం ఉంటుంది. ఇక మీ బాబు విషయానికి వస్తే నోటి పరిశుభ్రత (గుడ్ ఓరల్ హైజీన్) పాటించడంతో పాటు అతడికి విటమిన్ బి12, జింక్ సప్లిమెంట్స్ ఇవ్వండి. లోకల్ అనస్థిటిక్ జెల్స్ కూడా వాడవచ్చు. సమస్య మరీ తీవ్రంగా ఉంటే మీ పిల్లల వైద్య నిపుణుడిని కలిసి చికిత్స తీసుకోండి. ఆందోళన పడాల్సిన అవసరం లేదు.





డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్,
రోహన్ హాస్పిటల్స్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్

రంగరంగుల ఆహారాలు తీసుకోవచ్చా?

మా బాబు స్వీట్లు, ఆహారపదార్థాలు ఎక్కువగా తీసుకుంటుంటాడు. అందులోనూ అవి బాగా ఆకర్షణీయమైన రంగులతో ఉంటే వాటిని ఇప్పించమని అడుగుతుంటాడు. అవి తినడం మంచిదేనా?

– శ్రీవాణి, బెంగళూరు

ఆహారపదార్థాల్లో కృత్రిమ రంగులు, నిల్వ ఉంచేందుకు వాడే ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారం వారి ఆరోగ్యానికి, వికాసానికి, ఎదుగుదలకు కీడు చేస్తుంది. కొన్ని కృత్రిమ రంగులు అసలు తీసుకోవడమే మంచిది కాదు. ఎందుకంటే వాటిని బయటకు పంపేందుకు మూత్రపిండాలు చాలా ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుంది. దాంతో వాటి దుష్ప్రభావం మూత్రపిండాలపై పడుతుంది. ఆహారం ఆకర్షణీయంగా ఉండటంతో పాటు అది చాలాకాలం నిల్వ ఉండటానికి ఉపయోగపడే ప్రిజర్వేటివ్స్‌లో సన్‌సెట్ ఎల్లో, ట్యాట్రజైన్, కార్మోయిసైన్, పాన్‌క్యూ 4ఆర్, సోడియం బెంజోయేట్ వంటి ప్రిజర్వేటివ్స్, క్వినోలిన్ ఎల్లో, అల్యూరా రెడ్ వంటి రసాయనాలతో పిల్లల్లో అతి ధోరణలు (హైపర్‌యాక్టివిటీ) పెరుగుతాయని పరిశోధనల్లో తేలింది. సోడియం బెంజోయేట్ వంటి రసాయనాలు విటమిన్ 'సి'తో కలిసినప్పుడు అది క్యాన్సర్ కారకం (కార్సినోజెన్)గా మారుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ రసాయనం లివర్ సిర్రోసిస్‌కు, పార్కిన్‌సన్ డిసీజ్‌లాంటి వాటికి దారితీస్తుందని కూడా వెల్లడయ్యింది. అందుకే అతిగా రంగులు ఉండే ఆహారం తీసుకునే విషయంలో పిల్లలను ప్రోత్సహించకూడదు. దీనికి బదులు స్వాభావిక ఆహారాలు, పానీయాలు తీసుకునేలా వారిని ప్రోత్సహించాలి.

సాక్షి ఫ్యామిలీ | సినిమా | హైదరాబాద్ మంగళవారం 23-1-2018



స్క్రీన్ టెస్ట్




18 బాలీవుడ్ భామ కంగనా రనౌత్‌ను తెలుగు తెరకు పరిచయం చేసిన దర్శకుడెవరు?
ఎ) రాజమౌళి బి) వినాయక్ సి) రామ్‌గోపాల్ వర్మ డి) పూరి జగన్నాథ్



5 రజనీకాంత్‌కు సూపర్‌స్టార్ అనే బిరుదు ఉందని అందరికీ తెలిసిన విషయమే. ఏ సినిమా నుండి స్క్రీన్‌పై ఈ టైటిల్ పడుతుందో తెలుసా?
ఎ) అన్నామలై
బి) భాషా
సి) వీర
డి) బాబా

10 'మొగుడు పెళ్లాం ఓ దొంగోడు' చిత్రం మొత్తం దాదాపు మూడు పాత్రల చుట్టూ తిరుగుతుంది. ఆ మూడు పాత్రలలో మొగుడు పాత్రను హీరో రాజా, దొంగోడు పాత్రను బ్రహ్మానందం చేశారు. పెళ్లాం పాత్రను పోషించిన ప్రముఖ హీరోయిన్ ఎవరు?
ఎ) త్రిష బి) స్నేహ సి) నయనతార డి) శ్రియ





15 మహేశ్‌బాబు నటిస్తున్న 'భరత్ అనే నేను' చిత్రానికి సంగీత దర్శకుడెవరో కనుక్కోండి?
ఎ) దేవిశ్రీ ప్రసాద్
బి) హారిస్ జయరాజ్
సి) అనిరుధ్
డి) యస్.యస్. తమన్

నిర్వహణ: **శివ మల్లాల**

11 యన్టీఆర్-కృష్ణ కాంబినేషన్‌లో చాలా సినిమాలు విడుదలయ్యాయి. కానీ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన మొదటి సినిమా పేరేంటి?
ఎ) దేవుడు చేసిన మనుషులు బి) వయ్యారి భామలు వగలమారి భర్తలు సి) స్త్రీజన్మ డి) కృష్ణార్జునులు

13 అక్కినేని కుటుంబం అందరూ కలిసి నటించిన 'మనం' చిత్రానికి కెమెరా మేన్ ఎవరో కనుక్కోండి?
ఎ) పీసీ శ్రీరాం బి) చోటా కె. నాయుడు సి) సి. రామ్‌ప్రసాద్ డి) పీయస్ వినోద్



7 నాని కెరీర్‌లో తొలిసారిగా ద్విపాత్రాభినయం చేసిన సినిమా ఏది?
ఎ) మజ్ను బి) పైసా
సి) జెండాపై కపిరాజు
డి) నిన్ను కోరి

17 'ప్రేమ అనేది ఎవడికి వాడికి సెపరేట్ క్వశ్చన్ పేపర్, నీ ఆన్సర్ నాకు పనికి రాదు, నా ఆన్సర్ నీకు పనికి రాదు' అనే డైలాగ్‌ను చెప్పిన హీరో ఎవరు? (చిన్న క్లూ: ఈ చిత్రానికి దర్శకుడు దశరథ్)
ఎ) నితిన్ బి) నాగార్జున సి) మంచు మనోజ్ డి) ప్రభాస్

19 కృష్ణంరాజు, వాణిశ్రీ కలిసి నటించిన ఈ స్టిల్ ఏ సినిమాలోనిది?
ఎ) జీవనతీరాలు
బి) వినాయక విజయం
సి) మనుషుల్లో దేవుడు
డి) భక్త కన్నప్ప



16 'ఏండి ఓ పాట పాడండే' అంటూ హీరో ప్రభాస్ ఏ హీరోయిన్‌ని టీజ్ చేస్తాడు?
ఎ) సంజన బి) త్రిష
సి) అనుష్క
డి) రిచా గంగోపాధ్యాయ

9 'ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపూ సొలుపేమున్నది...' పాట 'తోడికోడళ్లు' సినిమాలోనిది. ఆ పాట చేసిన ప్రముఖ రచయిత?
ఎ) కొసరాజు బి) కృష్ణశాస్త్రి సి) దాశరథి డి) ఆత్రేయ



1 'సాగరసంగమం' చిత్రానికి మొదట అనుకున్న హీరోయిన్ 'జయప్రద' కాదు. మరి ముందు అనుకున్న కథానాయిక ఎవరో తెలుసా?
ఎ) రాధిక బి) జయసుధ సి) సుహాసిని డి) సుమలత

8 మహేశ్‌బాబు హీరోగా నటించిన 'అతడు' సినిమాలో తాతగా నటించారు నాజర్. ఆ క్యారెక్టర్‌కు మొదట అనుకొన్నది ఒకప్పటి తెలుగు టాప్ హీరోని. ఈ హీరో ఎవరై ఉంటారు?
ఎ) అక్కినేని బి) కృష్ణంరాజు
సి) కృష్ణ డి) శోభన్‌బాబు



2 నటి రకుల్‌ప్రీత్ సింగ్‌ను తెలుగు తెరకు పరిచయం చేసిన దర్శకుడెవరు?
ఎ) బోయపాటి శ్రీను
బి) గౌతమ్ పట్నాయక్
సి) మేర్లపాక గాంధీ
డి) సురేందర్ రెడ్డి

4 ఈ నాయికల్లో ఏ హీరోయిన్ రెండుసార్లు హీరో గోపీచంద్ సరసన నటించారు?
ఎ) రకుల్‌ప్రీత్ సింగ్
బి) తాప్సీ సి) ప్రియమణి
డి) దీక్షాసేథ్

6 చిరంజీవి నటించిన ఏ సినిమాలో బన్నీ (అల్లు అర్జున్) మెరుపులాంటి స్టెప్పులతో అలరించాడో తెలుసా?
ఎ) మాస్టర్ బి) డాడి
సి) మృగరాజు
డి) బిగ్ బాస్



14 2017లో 'రాజా ది గ్రేట్' చిత్రం ద్వారా బాల నటుడిగా పరిచయం అయ్యారు సన్నాఫ్ హీరో రవితేజ. అతని పేరేంటో తెలుసా?
ఎ) ఉదయ్ బి) పృథ్వీ
సి) మహాధన్ డి) మిఖైల్ గాంధీ



3 సన్నీ లియోన్ నటించిన మొదటి తెలుగు సినిమా హీరో ఎవరో కనుక్కోండి?
ఎ) మంచు మనోజ్ బి) మంచు విష్ణు
సి) రాజశేఖర్ డి) రాజ్‌తరుణ్

20 పై ఫొటోలో ముద్దుగా బొద్దుగా ఉన్న ఒకప్పటి స్టార్ హీరోయిన్?
ఎ) మీనా బి) రాశి
సి) రాధిక 4) నిరోషా

12 యన్టీఆర్ నటించిన 'బృందావనం' చిత్రంలో ఇద్దరు నాయికలు ఉన్నారు. ఒకరు నటి సమంత... మరొకరెవరు?
ఎ) కాజల్ అగర్వాల్ బి) హన్సిక సి) కార్తీక డి) శ్రుతీహాసన్

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

సమాధానాలు
1) బి 2) బి 3) ఎ 4) బి
5) ఎ 6) బి 7) సి 8) డి
9) ఎ 10) డి 11) సి
12) ఎ 13) డి 14) సి
15) ఎ 16) బి 17) సి
18) డి 19) డి
20) ఎ

బ్రేక్‌కి బ్రేక్


వెంకటేష్

'కమిషనర్ కూతుళ్లకు పెళ్లిళ్లు అవ్వవా'... 'శివమణి.. నాకొంచెం మెంటల్', 'ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో'... ఇలా పూరి జగన్నాథ్ రాసే డైలాగ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుస్తాయి. ఇలాంటి మాసీ డైలాగ్స్ వెంకటేశ్ చెబితే సమ్‌థింగ్ డిఫరెంట్‌గా ఉంటుంది. కొత్త వెంకీ కనిపిస్తారు. పూరి జగన్నాథ్ ఎలానూ తన హీరోలను కొత్తగా చూపిస్తారు కదా. ఆయన డైరెక్షన్‌లో ఓ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంకీ కొత్త మేకోవర్‌లో కనిపిస్తారట. ప్రస్తుతం తనయుడు ఆకాశ్ పూరీతో పూరి 'మెహబూబా' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తి కాగానే వెంకీతో చేయబోయే సినిమా స్టార్ట్ చేస్తారట. యాక్చువల్లీ తేజ సినిమా వెంకీ చేయాల్సింది. కానీ ఎన్టీఆర్ బయోపిక్‌ను తేజ మొదలుపెట్టాలనుకుంటున్నారట. వెంకటేశ్ ఆ గ్యాప్‌ను పూరీ సినిమాతో పూరిస్తారని ఫిల్మ్‌నగర్ సమాచారం. వచ్చే నెలలో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుందని టాక్. సో.. ఇన్నాళ్ల బ్రేక్‌కి వెంకీ బ్రేక్ వేసేస్తారన్న మాట.

ఐష్ ఫస్ట్ లేడీ


ఐశ్వర్యారాయ్

మాజీ ప్రపంచ సుందరి, కథానాయిక ఐశ్వర్యారాయ్ 'ఫస్ట్ లేడీ' పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో విజయం సాధించిన మహిళలకు ఏటా ఈ అవార్డులు ఇస్తుంటారు. ఇందులో భాగంగా ఇరవై ఏళ్లుగా ఐశ్వర్యారాయ్ సినీరంగానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రకటించారు. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 'ఫస్ట్ లేడీ' అవార్డును ఐశ్వర్యకి అందజేశారు. 2002 నుంచి ప్రతి ఏటా కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో పాల్గొంటున్న ఐశ్వర్య ఇటీవల జ్యూరీ సభ్యురాలిగా ఎంపికయ్యారు. 'కేన్స్' అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో జ్యూరీ సభ్యురాలిగా ఎంపికైన తొలి భారతీయ నటి ఐష్ కావడంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ ఆమెను ఘనంగా సత్కరించారు. కాగా, చిన్న వయసులోనే పైలెట్ అయిన ఆయేషా అజీజ్, కశ్మీర్‌కి చెందిన తొలి మహిళా ఐపీఎస్ అధికారిణి రువేదా సలామ్‌లతో పాటు మరో 113 మందికి 'ఫస్ట్ లేడీ' పురస్కారాలు అందించారు.

అంతరిక్షంలో టిక్ టిక్


'జయం' రవి

'జయం' రవి, నివేదా పేతురాజ్ జంటగా శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వంలో అంతరిక్ష (స్పేస్) నేపథ్యంలో తెరకెక్కిన తొలి చిత్రం 'టిక్ టిక్ టిక్'. చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ బ్యానర్‌పై పద్మావతి చదలవాడ ఈ చిత్రాన్ని తెలుగులో త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''జనవరి 1న నేను ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్‌పై కూర్చున్నప్పుడు ఓ ఫారిన్ కపుల్ వచ్చి, 'మీది ఇండియానా?' అనడిగారు. అవునని చెప్పా. 'బాహుబలి' పది సార్లు చూశామన్నారు. మన ఇండియన్ సినిమాకి అంత గుర్తింపు వచ్చింది. ఇప్పటికీ మనవాళ్లు అమెరికన్ సినిమాలు చూస్తారు. అటువంటి స్థాయిలో తీసిన సినిమా 'టిక్ టిక్ టిక్'' అన్నారు. ''మన దేశంలో వచ్చిన ఫస్ట్ స్పేస్ ఫిల్మ్ ఇది. ఇటువంటి సినిమాలను ఈజీగా చేయలేం. ఒక్కొక్క షాట్ వెనుక చాలా కష్టం ఉంటుంది. టీజర్, ట్రైలర్లలో ప్రేక్షకులు చూసినదాని కంటే సినిమాలో పది రెట్లు ఎక్కువ ఉంటుంది'' అన్నారు 'జయం' రవి. ''స్టార్ వార్స్' టైమ్ నుంచి స్పేస్ నేపథ్యంలో ఇండియాలో ఎవరు సినిమా చేస్తారా? అనుకునేవాణ్ణి. తమిళంలో 'టిక్ టిక్ టిక్' చేస్తున్నారని తెలిసి పోటీ ఎక్కువగా ఉన్నా తెలుగు హక్కులు తీసుకున్నాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు చదలవాడ లక్ష్మణ్. దర్శకులు అజయ్, అల్లాణి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డి.ఇమ్మాన్, కెమెరా: వెంకటేశ్.

వైవిధ్యంగా...

విజయ్‌భాస్కర్‌రెడ్డి హీరోగా, ప్రియాంక శర్మ, సింధు హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'కార్తిక'. కొత్త పరశురామ్ దర్శకత్వంలో బేబి అవంతిక ఆర్ట్స్ పతాకంపై మచెందర్ నట్టల నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేసారు. కొత్త పరశురామ్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రమిది. సినిమా చాలా బాగా వచ్చింది. విజయ్ భాస్కర్‌రెడ్డికి ఇది ఫస్ట్ మూవీ అయినా పూర్తి న్యాయం చేసాడు'' అన్నారు. ''పరశురామ్ నాకు చెప్పిన కథను అలానే తెరపైకి తీసుకొచ్చారు. ఈ చిత్రం బాగా వచ్చింది. మా టీమ్‌కి మంచి పేరొస్తుంది. త్వరలో పాటలు రిలీజ్ చేసి ఆ తర్వాత సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత మచెందర్ నట్టల. అజయ్‌ఘోష్, రూలర్ రఘు, ప్రీతి, ప్రియ కోల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: హరీష్ గౌడ్, కెమెరా: వల్లి ఎస్‌కె, సంగీతం: సుభాష్ ఆనంద్.


ప్రియాంక శర్మ
విజయ్ భాస్కర్‌రెడ్డి

ఖిల్జీ టు గల్లీ బాయ్

కండలు కరిగాయి. హెయిర్ స్టైల్ కంప్లీట్‌గా మారింది. గడ్డం, మీసాలు ట్రిమ్ అయ్యాయి. ఫేస్‌లో కోపం పోయి అమాయకత్వం వచ్చింది. ఇక్కడున్న ఫొటోల్లో మధ్య తేడాలు చెప్పమంటే బహుశా.. ఇలాగే చెప్పుకుంటామేమో. కానీ పేరులో మాత్రం ఏ మార్పు లేదు. ఇతని పేరు రణ్‌వీర్ సింగ్. 'జిందగీ నా మిలేగీ దొబారా' జోయా అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్‌సింగ్ హీరోగా రూపొందుతున్న తాజా సినిమా 'గల్లీ బాయ్'. ఇందులో ఆలియా భట్ కథానాయిక. ఈ సినిమాలోని కంప్లీట్ లుక్‌ను 'పద్మావత్ టు గల్లీ బాయ్ ' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు రణ్‌వీర్. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన 'పద్మావత్' చిత్రంలోని ఖిల్జీ పాత్రకు భారీగా బరువు పెరిగిన రణ్‌వీర్ 'గల్లీబాయ్' కోసం బరువు తగ్గారు. అన్నట్లు... ఎన్నో వివాదాల నడుమ రూపొంది, ఎన్నో అడ్డంకుల మధ్య 'పద్మావత్' ఈ 25న విడుదల కానుంది. సుప్రీమ్ కోర్టు అన్ని రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయొచ్చని అనుమతి ఇచ్చినప్పటికీ ఇంకా కొన్ని చోట్ల విడుదల చేయకూడదనే వివాదం సాగుతోంది. కొన్ని థియేటర్ల ముందు ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరి.. విడుదల రోజున ఏం జరుగుతుందో చూడాలి.


రణ్‌వీర్ సింగ్

కౌన్ హై అర్జున్ రెడ్డి?


సందీప్ రెడ్డి

'అర్జున్ రెడ్డి' తెలుగులో విజయ్ దేవరకొండ. తమిళ రీమేక్ 'వర్మ' ధ్రువ్ విక్రమ్. మరి.. హిందీ రీమేక్ పేరేంటి? కౌన్ హై అర్జున్ రెడ్డి (అర్జున్ రెడ్డి ఎవరూ అంటే?) ప్రస్తుతం క్లారిటీ లేని టాపిక్. తొలుత రణ్‌వీర్ సింగ్ చేస్తాడు అన్నారు. ఆ తర్వాత అర్జున్ రెడ్డిగా షాహిద్ కపూర్ కనిపిస్తాడని అనుకున్నారు. కానీ ఈ లిస్ట్‌లోకి తాజాగా అర్జున్ కపూర్ పేరు వచ్చి చేరింది. అర్జున్ రెడ్డి పాత్రను అర్జున్ కపూర్ చేయబోతున్నారని బాలీవుడ్ సమాచారం. బాలీవుడ్ అర్జున్ రెడ్డిని కూడా సందీప్ రెడ్డి వంగానే దర్శకత్వం వహిస్తారట. ఈ రీమేక్‌ను సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ సంస్థ నిర్మించనుంది.


అర్జున్ కపూర్

Dwaraka



భారత్‌కు ‘ట్రయంఫ్’ రక్షణ!

- రష్యా నుంచి అత్యాధునిక క్షిపణుల కొనుగోలుకు తుది చర్చలు ప్రారంభం
- మొత్తం ఐదు క్షిపణులు.. రూ.39 వేల కోట్ల వ్యయం

న్యూఢిల్లీ: రష్యా నుంచి ఎస్–400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు సంబంధించిన తుది చర్చలను కేంద్రం తాజాగా ప్రారంభించింది. ఇప్పటికే భారత్‌కు ఆకాశ్, బరాక్–8 తదితర క్షిపణి వ్యవస్థలుండగా..ఎస్–400 ట్రయంఫ్ క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని భారత్ భావిస్తోంది. ఇందుకు కారణం ఇది అత్యంత శక్తిమంతమైన, అధునాతన క్షిపణి కావడమే. ఈ నేపథ్యంలో ఎస్–400 ట్రయంఫ్ క్షిపణుల గురించి క్లుప్తంగా..

రష్యా ఉత్పత్తి చేసే, ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే ఎస్–400 ట్రయంఫ్ శ్రేణిలోని ఐదు క్షిపణి వ్యవస్థలను 39 వేల కోట్ల రూపాయలు (5 బిలియన్ అమెరికన్ డాలర్లు) వెచ్చించి కొనుగోలు చేయాలని భారత్ 2015లోనే నిర్ణయించింది. ఆ ఏడాది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటనకు వెళ్లడానికి కొన్ని రోజుల ముందే ఎస్–400 ట్రయంఫ్ క్షిపణుల కొనుగోలు ప్రతిపాదనను రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఆమోదించింది. ప్రస్తుతం తుది చర్చలను ప్రారంభించిన భారత ప్రభుత్వం.. 2018–19 ఆర్థిక సంవత్సరం చివరిలోపు ఒప్పందాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఒప్పందం ఖరారైతే చైనా తర్వాత ఈ క్షిపణులను కొనుగోలు చేయనున్న రెండో దేశంగా భారత్ నిలవనుంది. చైనా 2014లోనే ఎస్–400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థల కొనుగోలు ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది.

ఎప్పటికి వస్తాయి?

మొత్తం ఐదు క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం చేసుకునేందుకు భారత్ ప్రయత్నిస్తుండగా, డీల్ కుదిరిన వెంటనే తొలి క్షిపణి వ్యవస్థ భారత్‌కు చేరనుంది. అయితే దీనికి అనుబంధంగా ఉండే కొన్ని యుద్ధ నిర్వహణ పరికరాలు రావడానికి మాత్రం రెండేళ్ల సమయం పడుతుంది. మొత్తం ఐదు క్షిపణులు భారత అమ్ములపొదిలో చేరడానికి నాలుగున్నరేళ్ల వ్యవధి అవసరమని రక్షణ శాఖకు చెందిన ఓ అధికారి చెప్పారు. అంతా అనుకున్నట్లు జరిగితే భారత్–రష్యాల మధ్య కుదిరిన భారీ ఆయుధ ఒప్పందాల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

ఇవీ ప్రత్యేకతలు..

శత్రు దేశాల క్షిపణులు, డ్రోన్లు, గూఢచర్య విమానాలు 600 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ ఉన్నా ఎస్–400 ట్రయంఫ్ వాటిని గుర్తించి నాశనం చేయగలదు. ఏకకాలంలో 36 లక్ష్యాలపై ఇది దాడులు చేయగలదు. ఎస్–300 క్షిపణుల కన్నా ఇది రెండున్నర రెట్లు ఎక్కువ వేగంతో దాడులు చేస్తుంది. అందుకే ఎస్–400 ట్రయంఫ్‌ను రష్యా వద్దనున్న అత్యంత శక్తిమంతమైన, అధునాతన క్షిపణి వ్యవస్థగా పేర్కొంటారు. భారత్‌కు ఈ క్షిపణులు అందుబాటులోకి వస్తే పాకిస్తాన్‌లోని అన్ని వైమానిక స్థావరాలు, టిబెట్‌లోని చైనా స్థావరాలపై కూడా దాడులు చేయొచ్చు. ఆయుధ సంపత్తి విషయంలో పాక్‌పై భారత్ పైచేయి సాధించడంతోపాటు, చైనాతో సరిసమానంగా నిలిచేందుకు ఎస్–400 ట్రయంఫ్ దోహదపడనుంది. పాకిస్తాన్ వద్దనున్న స్వల్ప శ్రేణి క్షిపణినాస్త్రను ఇది దీటుగా ఎదుర్కొంటుంది. వీటిని వాహనాలపై ఇతర ప్రాంతాలకు తరలించేందుకూ వీలుంది.

భారత్ వద్ద ఉన్న క్షిపణులు

స్పైడర్

ఇజ్రాయెల్ సాంకేతికతతో తయారైన దీని పరిధి 15 కిలోమీటర్లు. వాయుసేన 4 క్షిపణులను సమకూర్చుకుంటోంది. పరిధిని 30 కిలో మీటర్లకు పెంచేందుకు డీఆర్‌డీవో ప్రయత్నిస్తోంది.





ఆకాశ్

డీఆర్‌డీవో, బీడీఎల్, బీఈఎల్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన దీని పరిధి 25 కిలోమీటర్లు. వాయుసేన 15 ఆకాశ్ స్క్వాడ్రన్లు, ఆర్మీ నాలుగు ఆకాశ్ రెజిమెంట్లను సమకూర్చుకుంటోంది.

బరాక్–8

డీఆర్‌డీవో-ఇజ్రాయెల్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన దీని పరిధి 70 కిలోమీటర్లు. వాయుసేన 9 క్షిపణులను సమకూర్చుకుంటోంది. యుద్ధనౌకలకు ఈ క్షిపణి వ్యవస్థలను నౌకాదళం అమర్చుకుంటోంది.



అమెరికాలో షట్‌డౌన్‌కు ముగింపు!

వాషింగ్టన్: మూడ్రోజులపాటు అమెరికాను స్తంభింపజేసిన షట్‌డౌన్‌కు ముగింపు పలికే దిశగా అధికార రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమొక్రాట్ కాంగ్రెస్ సభ్యుల మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయి. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) జరిగిన ఈ చర్చల్లో డెమొక్రాట్ల ‘స్వాప్నికుల’ డిమాండ్‌పై చర్చకు సెనెట్ మెజారిటీ (రిపబ్లికన్) నేత మిచ్ మెక్‌కన్నెల్ అంగీకారం తెలిపారు. దీంతో ప్రభుత్వ నిర్వహణకు నిధులు ఇచ్చే బిల్లుపై చర్చించేందుకు మార్గం సుగమమైంది. బిల్లుకు అనుకూలంగా ఓటేస్తామని డెమొక్రాట్ల నేత చుక్ షుమర్ ప్రకటించారు. ‘షట్‌డౌన్ మరికొద్ది గంటల్లో ముగుస్తుంద’ని షుమర్ పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో పెద్దగా కనిపించని అమెరికా షట్‌డౌన్ ప్రభావం సోమవారం తీవ్ర ప్రభావాన్ని చూపింది. వేల మంది ప్రభుత్వోద్యోగులు వేతనాల్లేకుండా ఇళ్లలోనే ఉండటంతో కార్యాలయాలన్నీ బోసిపోయాయి. అత్యవసర సేవలు మినహా అమెరికా దాదాపుగా స్తంభించిపోయింది.

సంక్షోభంపై జస్టిస్ చలమేశ్వర్ ‘నో కామెంట్స్’!



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ప్రస్తుత సంక్షోభంపై వ్యాఖ్యానించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నిరాకరించారు. జనవరి 12న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై మీడియా ముందు ఆరోపణలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తుల్లో జస్టిస్ చలమేశ్వర్ ఒకరు. ఈ విషయం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. జస్టిస్ చలమేశ్వర్ సోమవారం ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైనప్పుడు సుప్రీంకోర్టు సంక్షోభంపై విలేకరులు ఆయనను ప్రశ్నించగా, ముకుళిత హస్తాలతో ‘నో కామెంట్స్’ అంటూ వెళ్లిపోయారు.

స్కూలు బ్యాగుల్లో బూతు పుస్తకాలు

లక్నో: బూతు పుస్తకాలు, గుట్కా ప్యాకెట్లు, సిగరెట్లు, లైటర్లు, బ్లేడ్, రేజర్, ట్రిమ్మర్, ఐపాడ్, మొబైల్ ఫోన్లు... ఇవన్నీ పిల్లల స్కూలు బ్యాగుల్లోని వస్తువులు. లక్నోలోని పలు ప్రైవేటు స్కూళ్లలో నిర్వహించిన తనిఖీల్లో ఈ వస్తువులు బయటపడడంతో టీచర్లు అవాక్కయ్యారు. నగరంలోని బ్రైట్‌ల్యాండ్ స్కూల్లో ఒకటో తరగతి విద్యార్థిపై సీనియర్ విద్యార్థిని కత్తితో దాడి చేసిన ఘటన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పలు స్కూళ్లలో తనిఖీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థుల బ్యాగుల్లో బూతు పుస్తకాలు ఉండడం చూసి షాకయ్యామని ఒక టీచర్ తెలిపారు. ఎవరికీ తెలియకుండా ఉండేందుకు బూతు పుస్తకాలకు సైన్సు అట్టలు వేసి తీసుకొస్తున్నారని ఆమె చెప్పారు. స్కూలు విద్యార్థుల నుంచి ఆ వస్తువుల్ని స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు నోటీసులు జారీ చేశామని స్కూలు యాజమాన్యం వెల్లడించింది.

మోదీని అనుకరించిన ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత ప్రధాని మోదీని భారతీయ యాసలో అనుకరించినట్లు వాషింగ్టన్ పోస్టు కథనం పేర్కొంది. అఫ్గానిస్తాన్ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ట్రంప్ ప్రభుత్వం మరింత మంది సైన్యాన్ని, నిధులను పంపేందుకు ముందుకు రావటంపై.. గతేడాది అమెరికా పర్యటన సందర్భంగా మోదీ ప్రశంసించారు. ‘తక్కువ లాభం పొందుతున్నప్పటికీ ప్రతిఫలంగా ఎక్కువ మొత్తాన్ని తిరిగిస్తున్నారు’ అంటూ కొనియాడారు. ప్రపంచమంతా అఫ్గాన్‌ను అమెరికా సొంత అవసరాలకు వాడుకుంటోందని విమర్శిస్తున్న నేపథ్యంలో మోదీ ప్రశంసలకు ట్రంప్ మురిసిపోయారు. వేరో సందర్భంలో మోదీ వ్యాఖ్యలను భారతీయ యాసలోనే అనుకరించినట్లు వాషింగ్టన్ పోస్టు కథనం వెల్లడించింది. కాగా, ట్రంప్ తీరును భారత–అమెరికన్ డెమొక్రాట్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి తీవ్రంగా ఖండించారు. ఈ కథనంపై శ్వేతసౌధం ఇంతవరకు స్పందించలేదు. వాషింగ్టన్ పోస్టుతోపాటు ఇతర అమెరికా వార్తాపత్రికల్లో వస్తున్న వార్తలు అసత్యమంటూ ట్రంప్ ఇటీవలే ‘ఫేక్‌న్యూస్’ అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే.

గాలి జనార్దన్ రెడ్డి పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: గనుల అక్రమ తవ్వకాల కేసుకు సంబంధించి కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. పలు కేసుల్లో తన బెయిలు మంజూరుకు విధించిన షరతులను సడలించాలని కోరుతూ సోమవారం ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. అనంతపురం, బళ్లారి ప్రాంతాలకు రాకూడదని, విదేశాలకు వెళ్లకూడదని ఆయనను ఆదేశిస్తూ గతంలో బెయిల్ సమయంలో కోర్టు షరతులు విధించడం తెలిసిందే. స్వస్థలం వెళ్లేందుకు అనువుగా బెయిల్ షరతులను సడలించాలని తాజా పిటిషన్‌లో జనార్దన్‌రెడ్డి కోరారు. జస్టిస్ సిక్రీ నేతృత్వంలోని బెంచ్ పిటిషన్‌ను విచారించి షరతుల సడలింపు కుదరదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టేసింది. ప్రధాన కేసులో చార్జిషీటు దాఖలైన తర్వాత బెయిల్ షరతుల అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొంది.

‘పద్మావత్’ని ఆపండి

సుప్రీంకోర్టులో రాజస్తాన్, మధ్యప్రదేశ్ పిటిషన్ 2 నేడు విచారణ



మధురలో ఆందోళన చేస్తున్న రాజ్‌పుత్ వర్గీయులు

న్యూఢిల్లీ/జైపూర్: సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన పద్మావత్ చిత్రం విడుదలపై రాజస్తాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు సోమవారం సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దేశవ్యాప్తంగా జనవరి 25న పద్మావత్ చిత్ర ప్రదర్శనకు అనుకూలంగా ఇంతకుముందు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశాయి. ఇరురాష్ట్రాల వాదనలు విన్న సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం, ఈ మధ్యంతర పిటిషన్లను మంగళవారం విచారించేందుకు అంగీకరించింది. పద్మావత్ చిత్ర ప్రదర్శనపై గుజరాత్, రాజస్తాన్ ప్రభుత్వాలు విధించిన నిషేధాన్ని ఈ నెల 18న కొట్టేసిన సుప్రీం.. దేశవ్యాప్తంగా ఈ చిత్రం విడుదలకు అనుమతిచ్చింది. ఈ సినిమా బృందంతో పాటు ప్రేక్షకులకు సైతం రక్షణ కల్పించాలనీ, చిత్ర ప్రదర్శనను అడ్డుకునే చర్యలు తీసుకోరాదని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.

పద్మావత్ చిత్రం విడుదలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ రాజస్తాన్‌లోని చిత్తోడ్‌గఢ్‌లో నిర్వహించిన ‘స్వాభిమాన్ ర్యాలీ’లో రాజ్‌పుత్ మహిళలు కత్తులు పట్టుకుని భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ చిత్రం విడుదలను నిషేధించకపోతే ఆత్మగౌరవంతో చనిపోవడానికి వీలుగా యాక్టివ్ యూథనేషియా (అనాయాస మరణం)కు అనుమతించాలని వీరు రాష్ట్రపతికి లేఖ రాయాలని నిర్ణయించారు. పద్మావత్ చిత్రం విడుదలను నిలిపివేయకుంటే రాణి పద్మిని తరహాలోనే తామంతా ఆత్మాహుతి చేసుకుంటామని జోహర్ క్షత్రాణీ మంచ్ కార్యదర్శి సంగీతా చౌహాన్ హెచ్చరించారు.

తీవ్రమైన అంశాలున్నాయి!

లోయా మృతిపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

- అన్ని డాక్యుమెంట్లను క్షుణ్నంగా పరిశీలిస్తాం
- లోయా కేసు విచారణ ప్రారంభించిన జస్టిస్ దీపక్ మిశ్రా ధర్మాసనం



న్యూఢిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతికి సంబంధించి పిటిషన్లలో లేవనెత్తిన అంశాలు చాలా తీవ్రమైనవని, అన్ని పత్రాల్ని చాలా క్షుణ్నంగా పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. లోయా మృతిపై సమగ్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ ప్రారంభించింది. ఈ కేసులో బాంబే హైకోర్టుకు చెందిన నాగ్‌పూర్, ముంబై ధర్మాసనాలు విచారిస్తోన్న మరో రెండు పిటిషన్లను సుప్రీంకోర్టుకు ధర్మాసనం బదిలీ చేసింది. లోయా మృతిపై ఇకపై ఎలాంటి పిటిషన్లు దాఖలైనా వాటిని విచారణకు స్వీకరించవద్దని అన్ని హైకోర్టుల్ని ఆదేశించింది. ఇంతవరకూ కోర్టుకు సమర్పించని పత్రాలను ఫిబ్రవరి 2లోగా తమ ముందుంచాలని కోర్టు ఆదేశించింది. అదే సమయంలో ఈ కేసులో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పేరును తెరపైకి తేవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే తీరును కోర్టు తప్పుపట్టింది.

షాపై ఆరోపణల పట్ల సాల్వే అభ్యంతరం

లోయా మృతిపై కాంగ్రెస్ నేత తెహసీన్ పూనావాల్లా, జర్నలిస్టు బీఎస్ లోనే దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. కిక్కిరిసిన కోర్టు గదిలో దాదాపు గంటపాటు న్యాయవాదుల మధ్య వాడీవేడిగా వాదనలు సాగాయి. బాంబే న్యాయవాదుల విభాగం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదిస్తూ.. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పేరును ప్రస్తావించారు. షాను రక్షించే క్రమంలోనే ఇదంతా జరిగిందని ఆరోపించారు. మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీం జోక్యం చేసుకుని.. ‘ఇప్పటివరకైతే ఇది సహజ మరణమే. ఇప్పుడు ఆ విధమైన ఆరోపణలు చేయొద్దు’ అని దవేకు సూచించింది. వెంటనే దవే లేచి.. ఈ కేసులో అమిత్ షా తరఫున గతంలో సాల్వే హాజరయ్యారని, ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన వాదించడం సరికాదని అన్నారు. ‘ఎవరి తరఫున ఎవరు హాజరవ్వాలనేది న్యాయవాదుల విచక్షణకే వదిలేస్తున్నాం. మేం బార్ కౌన్సిల్ కాదు. మిమ్మల్ని మేం ఆపలేము. కేసుకు సంబంధించిన అన్ని రికార్డుల్ని సంబంధిత పార్టీలు కోర్టుకు సమర్పించాలి’ అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో స్వతంత్ర విచారణ జరిపించాలని లోయా తండ్రి, సోదరిలు కోరారని దవే వెల్లడించారు. ఈ కేసులో తాను ఎలాంటి విచారణ కోరడం లేదని లోయా కుమారుడి ప్రకటనకు ముందు.. అప్పటి బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అతన్ని తన చాంబర్‌కు పిలిపించుకోవడాన్ని దవే ప్రశ్నించారు. మహారాష్ట్ర ప్రభుత్వ పత్రాల్ని పిటిషనర్ల న్యాయవాదులకు మాత్రమే అందుబాటులో ఉంచాలని సాల్వే కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

జైసింగ్ వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

ఈ కేసులో మీడియా కవరేజీని కోర్టు అడ్డుకోవచ్చేమోనని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ సందేహం వ్యక్తం చేయగా.. ఆ వ్యాఖ్యలపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి వ్యాఖ్యలు సరికాదని.. వెంటనే వాటిని వెనక్కి తీసుకుని, క్షమాపణలు చెప్పాలని సీజేఐ మిశ్రా ఆదేశించారు. దాంతో ఇందిరా జైసింగ్ తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెప్పారు. ‘ఇది చాలా అనుచితం. మీడియాను అడ్డుకునే విషయంపై కనీసం నేను ఒక్క మాటైనా మాట్లాడానా? మీడియా కవరేజీని నిరోధిస్తూ ఏదైనా ఆదేశాన్ని జారీ చేశానా?’ అని జస్టిస్ మిశ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసు చాలా తీవ్రమైందని, అందువల్ల విచారణ సమయంలో మీడియా నివేదికల ఆధారంగా కోర్టు వ్యవహరించదని బెంచ్ పేర్కొంది.

నిష్పాక్షిక దృష్టితో పరిశీలిస్తాం

వాదనలు ముగిశాక ధర్మాసనం స్పందిస్తూ.. లోయా మృతికి సంబంధించిన అన్ని పత్రాల్ని నిష్పాక్షిక దృష్టితో మరింత లోతుగా పరిశీలిస్తామని తెలిపింది. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. సున్నితమైన సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తోన్న లోయా.. డిసెంబర్ 1, 2014న స్నేహితుడి కుమార్తె పెళ్లి కోసం నాగ్‌పూర్ వెళ్లిన సమయంలో గుండెపోటుతో మరణించారు. సోహ్రాబుద్దీన్ కేసులో అమిత్‌షాతోపాటు రాజస్తాన్ హోం మంత్రి గులాబ్ చంద్ కటారియా, గుజరాత్ పోలీసు మాజీ చీఫ్ పీసీ పాండే తదితరులు కేసు ప్రారంభ దశలో నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే.

భారతీయ బిన్ లాడెన్ అరెస్టు

- 2008 గుజరాత్ పేలుళ్ల సూత్రధారి అబూ ఖురేషీ
- అరెస్టుకు ముందు తూర్పు ఢిల్లీలో కాల్పుల కలకలం



అబూ ఖురేషీని కోర్టుకు తీసుకెళ్తున్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: ఇండియన్ ముజాహిదీన్ సహ వ్యవస్థాపకుడు, ‘బిన్ లాడెన్ ఆఫ్ ఇండియా’ అనే పేరున్న అబూ సుభాన్ ఖురేషీ (39)ని సినీ ఫక్కీలో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 2008లో గుజరాత్‌లో వరుస పేలుళ్ల ఘటనకు ఖురేషీ ప్రధాన సూత్రధారి. తూర్పు ఢిల్లీలోని ఘాజీపూర్ ప్రాంతంలో పాత మిత్రులను కలిసేందుకు వస్తున్నాడన్న పక్కా సమాచారంతో స్పెషల్ సెల్, ఇంటెలిజెన్స్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించి అదుపులోకి తీసుకున్నారు. అయితే.. అరెస్టుకు ముందు ఖురేషీ తప్పించుకునేందుకు ప్రయత్నించటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ఈ అరెస్టు జరిగినా సోమవారం ఈ వివరాలను ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. గణతంత్ర దినోత్సవాలకు సిద్ధమవుతున్న వేళ ఈ అరెస్టు ఢిల్లీలో కలకలం రేపింది. ఖురేషీ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నేపాల్‌లో నివసిస్తున్నాడు. స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమీ) పత్రికకు ఎడిటర్‌గా కూడా పనిచేశాడు. ముంబై, బెంగళూరు వరుస పేలుళ్ల ఘటనల విచారణలోనూ ఖురేషీ పేరు బయటకొచ్చిందని ఢిల్లీ డిప్యూటీ పోలీసు కమిషనర్ ప్రమోద్‌సింగ్ కుశ్వాహ వెల్లడించారు. 2008, జూలై 26న అహ్మదాబాద్‌లో టిఫిన్ బాక్సుల్లో పెట్టిన బాంబులు నగరంలోని 21 చోట్ల విధ్వంసం సృష్టించడంతో 56 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పేలని 29 ఐఈడీ బాంబులను పోలీసులు నిర్వీర్యం చేయటంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలకు సంబంధించి ఖురేషీపై గతంలోనే రూ. 4 లక్షల రివార్డును ఎన్‌ఐఏ ప్రకటించింది. యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటకతోపాటు పలు రాష్ట్రాల్లో ఇండియన్ ముజాహిదీన్ కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించే పనిలో ఉండగానే పట్టుబడ్డాడని కుశ్వాహ తెలిపారు. మధ్యప్రదేశ్, కేరళ, గుజరాత్, కర్ణాటకల్లోని ఉగ్రవాద శిక్షణను ఖురేషీనే పర్యవేక్షించేవాడన్నారు. సిమీలో చేరకముందు ఖురేషీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.

మధ్యంతర ఏర్పాట్లు చేయండి

ట్రిబ్యునళ్లలో నియామకాలపై కేంద్రాన్ని కోరిన సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ ట్రిబ్యునళ్లకు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి మధ్యంతర ఏర్పాట్లు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు సోమవారం కేంద్రాన్ని కోరింది. ట్రిబ్యునళ్లలో జడ్జీల నియామకాలు, వారి పదవీకాలం తదితరాలకు సంబంధించిన ఆర్థిక చట్టం–2017 రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ వచ్చిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ అంశంలో విచారణ ఇంకా కొనసాగాల్సి ఉన్నందున ప్రస్తుతానికి ట్రిబ్యునళ్లలో న్యాయమూర్తుల నియామకాల కోసం తాత్కాలిక ఏర్పాట్లు చేయాలనీ, ఇందుకోసం సంబంధిత వర్గాలతో చర్చలు జరపాలని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ను ధర్మాసనం కోరింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదావేసింది.

పాక్ పోస్టులపై బీఎస్ఎఫ్ మోర్టార్ల వర్షం

- ఆర్మీ పోస్టులతోపాటు ఆయుధ డంప్‌లు ధ్వంసం
- వీడియోలు విడుదల చేసిన బీఎస్ఎఫ్



పాక్ కాల్పుల్లో మరణించిన పౌరుడు గోపాల్‌దాస్ కొడుకు రోదిస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సరిహద్దు(ఐబీ) వెంట భారత గ్రామాలు, పోస్టులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్న పాక్ బలగాలకు దీటుగా జవాబిస్తున్నట్లు సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) ఉన్నతాధికారి ఒకరు సోమవారం తెలిపారు. పాక్ ఆర్మీ పోస్టులే లక్ష్యంగా ఇప్పటివరకూ బీఎస్ఎఫ్ 9,000 రౌండ్ల మోర్టార్ షెల్స్‌ను ప్రయోగించిందని వెల్లడించారు. భారత బలగాలు చాలా కచ్చితత్వంతో చేసిన దాడిలో పాక్ ఆర్మీకి చెందిన పలు పోస్టులు, మోర్టార్ లాంచింగ్ ప్యాడ్లు, ఆయుధాలు, ఇంధన డంప్‌లు ధ్వంసం అయ్యాయని పేర్కొన్నారు. భారత బలగాల దాడిలో పాక్ రేంజర్ల ఇంధన డంప్ ధ్వంసమవుతున్న రెండు వీడియోల్ని విడుదల చేశారు. జమ్మూ వెంట ఉన్న 190 కి.మీల అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉందని తెలిపారు. జమ్మూలోని మక్వాల్–కనచక్ బోర్డర్ పోస్టుల మధ్య ఉన్న చికెన్‌నెక్ ప్రాంతంపై తొలిసారి పాక్ కాల్పులు జరిపిందని వెల్లడించారు. భారత బలగాల తీవ్ర ప్రతిస్పందనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాక్ రేంజర్లను ప్రోత్సహించేందుకు ఆ దేశ సీనియర్ ఆర్మీ కమాండర్లు సరిహద్దుకు చేరుకోవడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. భారత బలగాలతో చర్చలు జరిపేందుకు, ఫ్లాగ్ మీటింగ్‌లో పాల్గొనేందుకు పాక్ రేంజర్లు విముఖత చూపుతున్నారని చెప్పారు. కాల్పుల మాటున దేశంలోకి ఉగ్రవాదులు చొరబడే అవకాశం ఉండటంతో అంబుష్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు.

ఆగని పాక్ కాల్పులు

జమ్మూ, రాజౌరీ జిల్లాల్లోని మూడు సెక్టార్లపై పాకిస్తాన్ బలగాలు సోమవారం కూడా విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. ఆదివారం సాయంత్రం నుంచి మొదలైన ఈ కాల్పులు సోమవారం తెల్లవారుజాము 5.45 గంటల వరకూ కొనసాగాయని ఓ బీఎస్ఎఫ్ అధికారి తెలిపారు.

దావోస్‌లో ప్రధాని మోదీ

నేడు అంతర్జాతీయ సదస్సులో ప్రారంభోపన్యాసం

కంపెనీల సీఈవోలతో భేటీ 2 వివిధ దేశాధినేతలతో చర్చలు



జ్యూరిచ్‌లో మోదీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

దావోస్: ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు చేరుకున్నారు. అంతర్జాతీయ సమాజం ముందు భారత భవిష్యత్తును, వ్యాపార, పెట్టుబడి అవకాశాలను సదస్సు ప్రారంభోపన్యాసంలో మోదీ వివరించనున్నారు. ఐదు రోజులపాటు జరిగే దావోస్ సదస్సులో ప్రధాని ఒకరోజు మాత్రమే పాల్గొనను న్నారు. ఈ ఒకరోజు బిజీ షెడ్యూల్‌లోనే అంతర్జాతీయ కంపెనీల సీఈవోలతో సమావేశాలు, వివిధ దేశాధి నేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. జ్యూరిచ్ చేరుకున్న మోదీకి భారత దౌత్య కార్యాలయం అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయలుదేరిన మోదీ దావోస్ చేరుకున్నారు. దావోస్‌లోనూ మోదీకి ఘన స్వాగతం లభించింది. సోమవారం రాత్రి (స్థానిక కాలమానం ప్రకారం) దాదాపు 60 అంతర్జాతీయ ప్రముఖ కంపెనీల సీఈవోలతో విందు సమావేశంలో ప్రధాని పాల్గొంటారు. ఎయిర్‌బస్, హిటాచీ, ఐబీఎం, బీఏఈ సిస్టమ్స్, కార్గిల్ గ్రూప్ వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొననున్నారు. ఈ భేటీలో భారత్‌లో వ్యాపార అవకాశాలు, అనుకూల వాతావరణంపై వారికి వివరించనున్నారు.

21 ఏళ్ల తర్వాత తొలి ప్రధాని

మంగళవారం ఉదయం ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేయనున్నారు. అనంతరం ప్రపంచ వ్యాపార, పరిశ్రమ వర్గాలతో మోదీ ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఆ తర్వాత స్వీడన్ ప్రధాని స్టెఫాన్ లోఫ్‌వెన్‌తో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. 1997లో నాటి ప్రధాని దేవేగౌడ అనంతరం.. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటున్న తొలి భారత ప్రధానిగా ప్రధాని మోదీ నిలిచారు. ప్రపంచంలో కీలక ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్‌లో వివిధ వ్యాపారాలకున్న అవకాశాలను ఈ సదస్సులో మోదీ వివరించనున్నారు. ప్రధానితోపాటు కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు దావోస్ వెళ్లారు. ఆర్థిక సదస్సుకు బయలుదేరేముందు మోదీ మాట్లాడుతూ.. ‘ఇటీవలి కాలంలో ప్రపంచదేశాలతో భారత సంబంధాలు బహుముఖంగా, సమర్థవంతంగా ముందుకు సాగుతున్నాయి. ఆర్థిక, రాజకీయ, భద్రత అంశాలతోపాటు పలు ఇతర రంగాల్లోనూ బలమైన బంధాలను ఏర్పర్చుకుంటున్నాం. దావోస్‌లో అంతర్జాతీయ సమాజంతో భారత భవిష్యత్ కార్యాచరణను పంచుకుంటా’ అని మోదీ చెప్పారు.

దావోస్‌లో యోగా

సదస్సు కోసం దావోస్ చేరుకున్న వివిధ దేశాధినేతలు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై మేథోమథనంతోపాటు యోగాలో శిక్షణ పొందనున్నారు. ఈ శిక్షణ కోసం ఇద్దరు భారతీయ యోగా ఉపాధ్యాయులు మోదీ బృందంలో భాగంగా దావోస్ చేరుకున్నారు. పతంజలి యోగా టీచర్లు.. ఆచార్య భరద్వాజ్, ఆచార్య సుమిత్‌లు ఈ వేదికపై రోజూ యోగా క్లాసులు నిర్వహిస్తారు. భారత సంప్రదాయాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించేందుకు ఇదో అవకాశమని బాబా రాందేవ్ ట్విటర్లో పేర్కొన్నారు.



కొమురవెల్లిలో ఘనంగా పెద్దపట్నం

కొమురవెల్లి (సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పట్నంవారం సందర్భంగా సోమవారం ఘనంగా అగ్నిగుండాలు, పెద్దపట్నం నిర్వహించారు. శివసత్తులు బండారు (పసుపు) చల్లుకోవడంతో ప్రాంగణమంతా పసుపుమయమైంది. హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తుల ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి ఐదు క్వింటాళ్ల సమిధలతో అగ్నిగుండాలను తయారు చేశారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలను అగ్నిగుండాల వద్దకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్ర హాలతో అర్చకులు అగ్నిగుండాలు దాటగా.. తర్వాత శివసత్తులు దాటారు.



జోగుళాంబ దేవి నిజరూప దర్శనం

అలంపూర్/ అలంపూర్ రూరల్: రాష్ట్రంలో శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ అమ్మ వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం భక్తులకు జోగుళాంబ దేవి నిజరూప దర్శన భాగ్యం కలిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది కలశాలతో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకించారు. జోగుళాంబ సేవా సమితి ఆధ్వర్యాన 60 మంది కళాకారులతో గ్రామ దేవతా వేషధారణల మధ్య కలశాల ఊరేగింపు సాగింది. వేలాది మంది భక్త జనసం ద్రం నడుమ కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాధిక హాజరై అమ్మవారికి అభిషేక జలాలను అందజేశారు.



వేడుకగా వసంత పంచమి

భైంసా/బాసర: బాసరలోని సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠ ల్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గోదావరి నదికి వెళ్లే రోడ్డు నుంచి భక్తులు బారులుదీరారు. భారీగా అక్షరాభ్యాసాలు జరిగాయి. కడియం మనుమరాలు అనియాలక్ష్మి, ఎంపీ జితేందర్‌రెడ్డి మనవడు నిహాన్‌రెడ్డిలకు అక్ష ర శ్రీకార పూజలు చేయించారు. నిత్యహారతిలో వేదభారతి విద్యాపీఠం వ్యవస్థాపకుడు వేదవిద్యానంద భారతిస్వామిజీ పాల్గొన్నారు.

మరే పదవి ఆశించను!

- నేను ప్రజాసేవకుడిని.. వారి రుణం తీర్చుకుంటా: హరీశ్‌రావు
- ఏ జన్మ పుణ్యమో కేసీఆర్ నీళ్ల మంత్రి ఇచ్చిండు
- వానా కాలంలోగా కాళేశ్వరం పూర్తి చేస్తామని వెల్లడి



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

హుస్నాబాద్: 'ఏ జన్మపుణ్యమో కేసీఆర్ నాకు నీళ్ల మంత్రి ఇచ్చిండు. ప్రజల రుణం తీర్చుకుంటా.. మరే పదవులు ఆశించను''అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులకు సోమవారం మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. 'నాకు సేవ చేయాలని ఉంది. నేను ప్రజల సేవకుడిని, వారి రుణం తీర్చే భాగ్యం దక్కింది.. ప్రజలు సహకరిస్తే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తా'అని పేర్కొన్నారు. ఎవరు అవునన్నా.. కాదన్నా మరో 20 ఏళ్లు రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. వరద కాల్వ కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. తొమ్మిదేళ్ల క్రితం ఎస్సారెస్పీలో వరద వచ్చినప్పుడు, వానలు పడ్డప్పుడు మాత్రమే గౌరవెల్లి ప్రాజెక్టు నిండే అవకాశముండేదని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరు ద్వారా గౌరవెల్లి ప్రాజెక్టును నింపి రెండు పంటలకు నీళ్లు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు 70 శాతం పూర్తి చేయడంతో పాటు మిడ్‌మానేరు వద్ద 27 గేట్లు నిర్మించామన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేస్తామని హరీశ్ తెలిపారు. కాంగ్రెస్ హయాంలో చిన్న చిన్న ప్రాజెక్టులు మాత్రమే కట్టారని, తక్కువ ముంపుతో ఎక్కువ లాభం జరగాలన్నదే కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, సీఈ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు

జ్యూరిక్‌లో ఎన్నారైలతో మంత్రి కేటీఆర్ ముఖాముఖీ

రాష్ట్ర ప్రగతిని దశదిశలా చాటాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం సాధించిన అద్భుత ప్రగతిని దశదిశలా చాటేందుకు ఎన్నారైలు ముందుకు రావాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రవాస భారతీయులు రాష్ట్రానికి గుడ్ విల్ అంబాసిడర్‌గా, బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండాలని కోరారు. రాష్ట్రాన్ని ఇతర దేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పరిచయం చేసేందుకు, ఆసక్తిగల పారిశ్రామికవేత్తలను తెలంగాణ ప్రభుత్వంతో అనుసంధానం చేయడానికి ఎన్నారైలు కలసి రావాలన్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ నగరంలో సోమవారం తెలంగాణ ఎన్నారైలు ఏర్పాటు చేసిన ముఖాముఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు, వాటి అమలు తీరుతో పాటు రాష్ట్ర రాజకీయాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. రాష్ట్రం ఆవిర్భావం నాటి అయోమయ పరిస్థితి నుంచి ప్రభుత్వం అద్భుత ప్రగతి దిశగా రాష్ట్రాన్ని తీసుకుపోతోందని కేటీఆర్ అన్నారు. దశాబ్దంన్నర క్రితం ఏర్పాటైన రాష్ట్రాలు కూడా ఇంకా పూర్తిగా కుదురుకోని పరిస్థితుల్లో ఉంటే తెలంగాణ రాష్ట్రం మాత్రం మూడున్నర ఏళ్లలోనే అనేక రంగాల్లో దేశానికి ఆదర్శవంతమైన విధానాలతో ముందుకు పోతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బంగారు తెలంగాణను సాధిస్తామని ఉద్ఘాటించారు. రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకించిన వారే ప్రస్తుతం అభినందించే పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ వచ్చాక ప్రజలకి పవర్ కష్టాలు తొలగిపోతే కాంగ్రెస్ పార్టీకి మాత్రం పవర్ పోయిందన్నారు. కేవలం రాష్ట్రంలోనే కాదు దేశంలోనూ మొత్తం కాంగ్రెస్ పవర్ పోతోందని, అందుకే రైతాంగానికి ఇస్తున్న 24 గంటల కరెంట్ సరఫరాను సైతం రాజకీయం చేస్తోందని విమర్శించారు.

ఎన్నారైలు ఇక ధైర్యంగా భూములు కొనవచ్చు..

తెలంగాణ ప్రభుత్వం ప్రజల కనీస అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తాగునీరు, సాగునీరు సదుపాయం కల్పనలకే ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యధిక ప్రాదాన్యత ఇస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజల కనీస అవసరాలైన రోడ్లు, ఫుట్‌పాత్‌లు, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. చెరువుల ప్రక్షాళన, హైదరాబాద్‌లో మెరుగుపడిన శాంతి భద్రతలు, వాతావరణ కాలుష్యం, క్రీడల అభివృద్ధి తదితర అంశాలపై ఎన్నారైలు లేవనెత్తిన ప్రశ్నలకు కేటీఆర్ బదులిచ్చారు. ఎన్నారైలు తెలంగాణలో భూములు కొనా లంటే ఇక ధైర్యంగా కొనవచ్చని, భూ రికార్డుల ప్రక్షాళన చేసి అన్నీ ఆన్‌లైన్‌లోకి తెస్తున్నామన్నారు. ఈ సమావేశాన్ని జ్యూరిక్‌లో నివాసముంటున్న తెలంగాణ ఎన్నారైలు శ్రీధర్ గండె, అల్లు కృష్ణారెడ్డి, అనిల్ జాలా, కిశోర్ తాటికొండ ఏర్పాటు చేశారు. సమావేశానికి నగర మేయర్ బొంతు రామ్మోహన్ తో పాటు స్వీడన్, జర్మనీ, యూకే, స్విట్జర్లాండ్ దేశాల్లోని తెలుగువారు హాజరయ్యారు.



సోమవారం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ నగరంలో తెలంగాణ ఎన్నారైలు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

స్విట్జర్లాండ్‌లో టీఆర్ఎస్ శాఖ..


స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో పలువురు ఎన్నారైలు టీఆర్ఎస్‌లో చేరారు. జ్యూరిక్‌లో జరిగిన పార్టీ ఆవిర్భావ సమావేశంలో మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీఆర్ఎస్ ఇప్పటికే దేశ విదేశాల్లో పార్టీ శాఖలను కలిగి ఉందని, తాజాగా స్విట్జర్లాండ్ పార్టీ శాఖను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి, ప్రపంచం నలుమూలలా ఉన్న తెలంగాణ వారందరికీ చేరేందుకు దోహదం చేస్తుందని కేటీఆర్ అన్నారు. వివిధ దేశాల్లో టీఆర్ఎస్ పార్టీ శాఖల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిస్తున్న టీఆర్ఎస్ పార్టీ ఎన్నారై సమన్వయకర్త మహేశ్ బిగాల స్విట్జర్లాండ్ పార్టీ శాఖను ఏర్పాటు చేశారు. పది మందితో అడ హక్ కమిటీని ఏర్పాటు చేశారు. త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని మహేశ్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్

68వ రోజు

22-01-2018, సోమవారం

రెడ్డిగుంటబాడవ, చిత్తూరు జిల్లా



ఇంతకన్నా హాస్యాస్పదం, పచ్చి అబద్ధం ఏమైనా ఉంటుందా?

యాత్ర ప్రారంభించి నేటికి 68 రోజులైంది. ప్రతి రోజూ కరెంటు చార్జీలు, పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిపోతున్నాయని, ఇంటి పన్నులు షాక్ కొడుతున్నాయని, మద్యం ఏరులై పారుతోందని, లంచం లేనిదే మరుగుదొడ్లు కూడా ఇవ్వడంలేదని, రేషన్ షాపుల్లో బియ్యం తప్ప.. మరేవీ దొరకడం లేదని, పింఛన్లు రాలేదని, రైతులకు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ కాలేదని, ఇళ్లు ఇవ్వలేదని, ఉద్యోగం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదని, ఆరోగ్యశ్రీ వర్తించలేదని.. ఇలా చంద్రబాబుగారిచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరక, తాము మోసపోయామని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కానీ, నిన్న టీడీపీ వర్క్‌షాపులో ముఖ్యమంత్రిగారి మాటలు చూస్తే, నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు.. అన్నట్లుంది. ఎన్నికల హామీల్లో ఇక రెండే రెండు మిగిలి ఉన్నాయట. అన్న క్యాంటీన్‌లు, నిరుద్యోగ భృతి ఇస్తే.. ఇచ్చిన హామీలకు మించి వంద రెట్లు చేసినట్లట. ఇంతకన్నా హాస్యాస్పదం, పచ్చి అబద్ధం ఏమైనా ఉంటుందా? పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగడమంటే ఇదేనేమో! ప్రజలు గమనించడం లేదనుకుంటున్నారా? లేదా.. మీ మీడియా బలంతో ప్రజలను తప్పుదోవ పట్టించొచ్చని భావిస్తున్నారా? ముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? మీ మోసపూరిత మాటలు, అభూత కల్పనలు, ఉత్తర కుమార ప్రగల్భాలు చూసి.. గతంలో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర పర్యటనకు వచ్చిన స్విట్జర్లాండ్ ఆర్థిక మంత్రి పాస్కల్ వేదిక మీదనే, మీ సమక్షంలోనే 'మా దేశంలో ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడితే.. జైల్లో అయినా పెడతారు. లేదా మెంటల్ ఆస్పత్రికైనా పంపుతారు' అన్న మాటలు మర్చిపోయారా? మీరు మాట్లాడుతున్న మాటల్లో ఒక్క శాతం కూడా నిజం లేదని తెలిసీ మాట్లాడుతున్నారంటే.. మిమ్మల్ని ఏమనుకోవాలి? మీకు ప్రజలు ఎలా కనబడుతున్నారు?

సత్యవేడు నియోజకవర్గం అనగానే నాన్నగారి కలల ప్రాజెక్టు శ్రీసిటీ గుర్తుకొచ్చింది. ఈ ప్రాంత వెనకబాటుతనాన్ని పారదోలాలని, అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలను ఇక్కడికి తెచ్చి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే మహోన్నత ఆశయంతో దీనిని ప్రారంభించారు. కానీ నేడు ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో స్థానికులకు అన్యాయం జరుగుతోంది. వేకెన్సీలున్నప్పటికీ.. క్వాలిఫికేషన్స్ ఉన్న మన పిల్లలకు ఉద్యోగాలు రాని పరిస్థితి. మరి అలాంటప్పుడు పరిశ్రమలకు భూములు ఎందుకివ్వాలి? మన పిల్లలకు ఉద్యోగాలివ్వకుండా.. మంచి భవిష్యత్తు చూపకపోవడం ధర్మమేనా?

పల్లమాలలో దళితుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యమంత్రిగారూ.. ఎస్సీల సంక్షేమం పట్ల మీకేమైనా చిత్తశుద్ధి ఉందా? మీ పాలనలో దళితులపై జరుగుతున్న దాడులు, పరిహారం తక్కువ ఇచ్చి అత్తగారి సొత్తులా భూములను లాక్కుంటున్న పద్ధతిని, దళితులను ఉద్దేశించి మీరు, మీ మంత్రులు మాట్లాడిన మాటలు, వ్యవహరించిన తీరు చూస్తే తెలుస్తోంది.. వారి పట్ల మీ దృక్పథమేంటో.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ప్రజలకు హామీలిచ్చి, మేనిఫెస్టోలో పొందుపర్చి, మాట తప్పి మోసం చేయడమే కాకుండా, చేసేశానని నిస్సిగ్గుగా బొంకుతూ దబాయిస్తుంటే.. మీ లాంటి వ్యక్తిని ఏమనుకోవాలి? కొద్దిగానైనా అపరాధభావం అనిపించదా?

వై.యస్. జగన్.

ఎస్సీ, ఎస్టీల భూములకు చట్ట భద్రత

మనందరి ప్రభుత్వం రాగానే అసెంబ్లీ తొలి సమావేశాల్లో చట్టం.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

- ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచే తొలుత భూముల పంపిణీ
- ఆ తర్వాత బీసీ, మైనారిటీలకూ భూములిస్తాం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి



చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం పల్లమాలలో జరిగిన దళితులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూముల్ని ఎవరూ చౌకగా కాజేయడానికి వీలు లేకుండా సమగ్ర చట్టం తీసుకువస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుత చట్టంలోని అంశాల అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు ఉచిత విద్యుత్‌తో పాటు ఆ వర్గాలకు 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లులు రద్దు చేస్తామన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 68వ రోజు సోమవారం చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం పల్లమాలలో జరిగిన ఎస్సీల ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూముల్ని చంద్రబాబు తన అత్తగారి సొమ్ములాగా లాగేసుకుంటున్నాడని మండిపడ్డారు. మనందరి ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచే భూమి పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆ తర్వాత బీసీలు, మైనారిటీలకూ ఇస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమ్మేళనంలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

దళితుల బతుకులు మారాయా?

ఇవాళ దళితులు, పేదల పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆలోచించండి. చంద్రబాబు మంత్రివర్గంలో ఓ మంత్రి ఉన్నాడు. ఆయన పేరు ఆదినారాయణ రెడ్డి అంట. ఆ మంత్రి అంటాడు.. దళితులు స్నానం చేయరంట, చదువుకోరంట. ఇంకో మంత్రి అచ్చెన్నాయుడని ఉన్నాడు.. ఆర్ అండ్ బీలో పని చేసే ఓ ఎస్సీ మహిళా ఉద్యోగినిని అందరూ చూస్తుండగానే కాలుతో తన్నాడు. ఆమె నా దగ్గరకు వచ్చి.. అన్నా, ఒక ఎస్సీ అధికారినైన నన్ను కాలుతో తంతున్నా ఈ ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉందన్నా అంది. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే.. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని మాట్లాడారు. ముఖ్యమంత్రే ఇలా మాట్లాడితే.. ఇక ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆయన దగ్గర పనిచేస్తున్న అధికారులు ఎలా ఉంటారు? ఎక్కడైనా అసైన్డ్ భూములు కనిపిస్తే ఎవరైనా వాటిని పేదవాడికి ఇవ్వాలనుకుంటారు. ఆ ప్రియతమ నేత రాజశేఖర రెడ్డి పాలనను గుర్తు చేసుకోండి. ఆయన అధికారంలో ఉన్న 5 సంవత్సరాల 3 నెలల కాలంలో అక్షరాల 32 లక్షల ఎకరాలు పేదలకు పంచారు. 22 లక్షల మందికి పట్టాలు అందజేశారు. ఈవేళ చంద్రబాబు పాలనలో ఏం జరుగుతోంది? ఎక్కడైనా అసైన్డ్ భూములు కనిపిస్తే చాలు వాళ్ల అత్తగారి సొత్తన్నట్టు లాక్కుంటున్నారు. చివరకు చంద్రబాబు కార్యకర్తలు మేయడానికి ఉపాధి హామీ నిధులనూ వదల్లేదు. నీరు– చెట్టు కార్యక్రమం అంటాడు. దానికి ఉపాధి హామీ నిధులంటాడు. సిమెంట్ రోడ్ల కోసం ఉపాధి హామీ నిధులు తీసుకోవడం ఎంత వరకు ధర్మం?

మనందరి ప్రభుత్వం వస్తే..

మనందరి ప్రభుత్వం వస్తే.. ఎస్సీ, ఎస్టీ కాలనీలు కరెంట్ బిల్లులు కట్టాల్సిన పనే లేదు. నాలుగు బల్బులు, రెండు ఫ్యాన్లు, ఒక టీవీ, సెల్‌ఫోన్ ఛార్జర్లు... ఇంతకన్నా ఎక్కువ ఉండవని నమ్ముతున్నా. ఇవన్నీ లెక్కేసినా నెలకు 150 యూనిట్లు కావు. అందుకే 200 యూనిట్లు కాల్చినా ఏ కరెంటోళ్లు మీ దగ్గరకు రారని చెబుతున్నా. మన ప్రభుత్వంలో పేదవాడికి భూపంపిణీ కార్యక్రమం ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచే మొదలు పెడతాం. ఆ తర్వాత బీసీలు, మైనార్టీల దాకా తీసుకెళ్తాం. ఐదేళ్ల కాలంలో లక్షల ఎకరాలు ఇచ్చేలా చూస్తాం.


- అటవీ హక్కుల భూములను తీసేస్తే నాన్నగారి హయాంలో దాదాపుగా 12 లక్షల ఎకరాలు పేదవాడికి భూ పంపిణీ జరిగింది. మన ప్రభుత్వంలో అంత కంటే లక్ష ఎకరాలైనా ఎక్కువ పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తా. ఉచితంగా బోర్లు కూడా వేయిస్తాం'' అని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి: జగన్

పరిశ్రమలకు మనం భూమిలివ్వాలి. కరెంటు తక్కువ రేటుకు ఇవ్వాలి. నీళ్లు ఇవ్వాలి. అన్నీ మనమిచ్చిన తర్వాత.. ఉద్యోగాలివ్వాల్సి వచ్చే సరికి గుజరాతో, పంజాబో, రాజస్థాన్ వాళ్లకు ఇస్తామంటే ఎవరు ఒప్పుకుంటారు? అందుకే మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పరిస్థితిని మారుస్తాం. ఎవరైనా రాష్ట్రంలో పరిశ్రమ పెట్టేందుకు ముందుకొస్తే వాటికే కాదు, ఇప్పుడున్న పరిశ్రమలకు ఉన్న నిబంధనలు మారుస్తాం. ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలని అసెంబ్లీలో చట్టం తెస్తాం. ఈ మేరకు పరిశ్రమలన్నింటికీ నోటీసులు పంపుతాం. శ్రీసిటీలో ఉద్యోగాలు రాకుండా ఇబ్బంది పడుతున్న వారికి ఉద్యోగాలు వచ్చేట్టు చేస్తానని హామీ ఇస్తున్నా. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో ఎస్సీ కమిటీని ఏర్పాటు చేయబోతున్నాం. ఆ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పర్యటిస్తుంది. వారికి ఇంకా ఏరకంగా ఎక్కువ మేలు చేయగలుగుతామనే కోణంలో అధ్యయనం చేస్తుంది. ఆ కమిటీకి సలహాలు, సూచనలు ఇవ్వండి. పాదయాత్ర తర్వాత ఎస్సీ, ఎస్టీ గర్జన ఏర్పాటు చేసి, వారికి ఏం చేయబోతున్నా మనేది గర్వంగా ప్రకటించుకుందాం.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

జ్యూరిక్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం



సాక్షి, అమరావతి: వివిధ రంగాల్లో పరస్పర సహకారం అందించుకునేలా స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ రాష్ట్రంతో రాష్ట్ర ప్రభుత్వం సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో జ్యూరిక్, ఏపీ అధికారులు ఈమేరకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు బృందం సోమవారం ముందుగా జ్యూరిక్ చేరుకుని ఈ ఒప్పందం చేసుకుంది. దీనివల్ల పర్యావరణ సాంకేతికత, జీవశాస్త్రాలు, పట్టణ, ప్రాంతీయాభివృద్ధి రంగాల్లో పరస్పరం సహకరించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. సిస్టర్ స్టేట్ ఒప్పందానికి ముందు సీఎం చంద్రబాబుతో జ్యూరిక్ ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల మంత్రి కార్మెన్ వాకెర్‌స్పా, ఉప మంత్రి బ్యూన్ సాటర్, జ్యూరిక్ ప్రభుత్వ ప్రాజెక్టు మేనేజర్ కొరిన్ వ్యేర్ భేటీ అయ్యారు. కాగా స్విట్జర్లాండ్‌కు చెందిన పయోనీరింగ్ వెంచర్స్ సంస్థ ప్రతినిధులు సోమవారం దావోస్‌లో సీఎంతో భేటీ అయ్యారు. వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో అవకాశాలను పరిశీలించి, కార్యాచరణను ప్రకటిస్తామని ఆ సంస్థ చైర్మన్ రోన్‌పాల్ తెలిపారు.

కమీషన్ల కోసమే భోగాపురం టెండరు రద్దు

ధ్వజమెత్తిన అంబటి రాంబాబు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) చేజిక్కించుకున్న భోగాపురం విమానాశ్రయం టెండరును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కమీషన్ల కోసమే రద్దు చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పీఏసీ (రాజకీయ వ్యవహారాల మండలి) సభ్యుడు అంబటి రాంబాబు మండిపడ్డారు. ఎన్నికలు మరో ఏడాదిలో జరగనున్న తరుణంలో ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్రానికి ముప్పు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విజయనగరంలో ఏర్పాటు చేయబోయే భోగాపురం ఎయిర్‌పోర్టు టెండరును 30.2 శాతం ఇస్తామన్న ఏఏఐకే ఇవ్వాల్సి ఉండగా... భూసేకరణ పూర్తి కాలేదనే నెపంతో దాన్ని రద్దు చేశారని విమర్శించారు. అదానీ పోర్ట్సు, ఎస్ఈజెడ్ సంస్థపై ఈడీ కేసులున్నాయని రక్షణ శాఖ కూడా ఈ విషయాన్ని హెచ్చరించినా కేవలం కమీషన్ల కోసమే భావనపాడు పోర్టును అప్పగించారన్నారు.



పద్మావతి అమ్మవారికి నాగపడగ

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్ చేపట్టిన ప్రజాసంకల్పపాదయాత్ర చిత్తూరు జిల్లాలో జయప్రదంగా పూర్తయినందున ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి తిరుచానూరు పద్మావతి అమ్మవారికి రూ.7లక్షల విలువైన బంగారు నాగపడగను, పట్టువస్త్రాలను సమర్పించారు. సోమవారం అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఆలయాధికారులకు వాటిని అందజేశారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి భవిత

13

మంగళవారం 23-1-2018

స్పర్ధయా వర్ధతే విద్య



మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఎంబీఏ ఔత్సాహికులకు సుపరిచితమైన పరీక్ష... కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్). ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లతోపాటు వివిధ ఉన్నత బీస్కూళ్లలో ప్రవేశానికి క్యాట్ స్కోరు ప్రామాణికం. ఏడాదికోసారి నిర్వహించే క్యాట్‌లో ప్రతికూల ఫలితం వస్తే .. ప్రత్యామ్నాయమేంటి? దీనికి సమాధానం.. మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్). ఏటా నాలుగుసార్లు నిర్వహించే ఈ పరీక్ష స్కోరు ద్వారా పేరున్న బీస్కూళ్లలో చేరేందుకు అవకాశముందంటున్నారు నిపుణులు! 2018, ఫిబ్రవరిలో జరిగే మ్యాట్‌కు నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో అర్హతలు, పరీక్ష విధానం, విజయానికి నిపుణుల సూచనలు తదితరాలపై ఫోకస్..

మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్)ను 1988 నుంచి నిర్వహిస్తున్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ 2003 నుంచి మ్యాట్‌ను జాతీయ స్థాయి పరీక్షగా గుర్తించింది. దీన్ని **All India Management Association (AIMA)** నిర్వహిస్తోంది. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన వారు మ్యాట్‌కు హాజరుకావచ్చు. ఫైనలియర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పరీక్ష ఫీజు రూ.1500. క్రెడిట్ కార్డు/ డెబిట్ కార్డు/నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం

మ్యాట్ పరీక్షను పేపర్ బేస్డ్/కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ ఆసక్తి మేరకు అనువైన విధానంలో పరీక్ష రాయొచ్చు. పేపర్ బేస్డ్ పరీక్ష (పీబీటీ)ని 2018, ఫిబ్రవరి 4న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు నిర్వహిస్తారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షను 2018, ఫిబ్రవరి 17న నిర్వహిస్తారు. పరీక్షలో 150 నిమిషాల్లో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.

సన్నద్ధత

లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్

స్కోరింగ్‌కు ఎక్కువగా అవకాశం ఉండే విభాగమిది. రీడింగ్ కాంప్రెహెన్షన్ నుంచి సగం ప్రశ్నలు; గ్రామర్, వొకాబ్యులరీల నుంచి సగం ప్రశ్నలు వస్తున్నాయి. 2017, డిసెంబర్‌లో నిర్వహించిన మ్యాట్ పరీక్షలో రీడింగ్ కాంప్రెహెన్షన్ (ఆర్సీ) నుంచి మార్కెటింగ్, నీటి స్వచ్ఛత ప్రాముఖ్యత, ఎర్రర్స్ ఇన్ మైండ్, క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి ప్యాసేజీలు వచ్చాయి. గ్రామర్, వొకాబ్యులరీలతో పోల్చితే ఆర్సీలోనే ఎక్కువ స్కోరు చేయడానికి ఆస్కారం ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో రీడింగ్ కాంప్రెహెన్షన్‌పై దృష్టిసారించాలి. ఇందుకోసం నిర్దిష్టంగా ఒక అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదవడం, ఆ వ్యాసం/విశ్లేషణ సారాంశాన్ని సొంతంగా రాయగలిగే నైపుణ్యం సాధించాలి. ఇంగ్లిష్ దినపత్రికల్లోని వ్యాసాలు, ఎడిటోరియల్స్ చదవడం వల్ల ఈ నైపుణ్యం లభిస్తుంది. బేసిక్ గ్రామర్, వొకాబ్యులరీని మెరుగుపరచుకోవడం ద్వారా కాంప్రెహెన్షన్‌పై పట్టు సాధించొచ్చు. వొకాబ్యులరీ కోసం రోజూ కొన్ని కొత్త పదాలను నేర్చుకోవడం, వాటిని వాక్యాల్లో ఉపయోగించే విధానాన్ని ప్రాక్టీస్ చేయడం ముఖ్యం.

మ్యాథమెటికల్ స్కిల్స్

దీన్ని అర్థమెటిక్, హయ్యర్ మ్యాథ్స్ విభాగాలుగా పేర్కొనవచ్చు. అర్థమెటిక్ విభాగం నుంచి అత్యధికంగా 30కి పైగా ప్రశ్నలు వస్తాయి. హయ్యర్ మ్యాథ్స్‌లో భాగంగా ట్రిగనోమెట్రీ; హైట్స్ అండ్ డిస్టెన్సెస్; పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్; ప్రాబబిలిటీ సెక్షన్ల నుంచి 6 నుంచి 8 ప్రశ్నల వరకు వచ్చేందుకు అవకాశముంది. అర్థమెటిక్‌లో టైం అండ్ వర్క్, పైప్స్ అండ్ సిస్టెర్న్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, బోట్స్ అండ్ స్ట్రీమ్స్, సింపుల్ ఈక్వేషన్స్, రేషియో, పర్సంటేజెస్, సింపుల్ ఇంట్రెస్ట్, కాంపౌండ్ ఇంట్రెస్ట్, వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్‌లపై దృష్టిసారించాలి.

డేటా అనాలసిస్ అండ్ సఫీషియెన్సీ

విశ్లేషణ నైపుణ్యం, కంప్యుటేషన్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో పట్టు సాధించాలంటే సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణ ఎంతో అవసరం. ప్రత్యేకంగా ఏదైనా ఒక సందర్భానికి అనుగుణంగా పేర్కొన్న అంశాలు లేదా సమాచారాన్ని క్రోడీకరించి విశ్లేషించే నైపుణ్యం ముఖ్యం. ఫ్లోచార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత సమస్యలను ప్రాక్టీస్ చేయడం వల్ల మంచి మార్కులు సాధించొచ్చు. సఫీషియెన్సీకి సంబంధించి డేటా కంపేరిజన్, రెండు స్టేట్‌మెంట్ల ఆధారంగా సమాధానాలు గుర్తించడం ప్రధానం.

ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్

ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలు పూర్తిగా విద్యార్థుల తార్కిక విశ్లేషణను పరీక్షించేలా ఉంటాయి. నిర్దిష్టంగా ఒక డేటాపై అవగాహన పెంపొందించుకొని, దాన్ని విశ్లేషించగల నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందులో అనలిటికల్ రీజనింగ్, క్రిటికల్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, డెసిషన్ మేకింగ్, పజిల్స్; నంబర్, లెటర్ సిరీస్; అసెర్షన్ అండ్ రీజన్స్; స్టేట్‌మెంట్ అండ్ కన్‌క్లూజన్; స్ట్రాంగ్ అండ్ వీక్ ఆర్గ్యుమెంట్స్ విభాగాలు కీలకమైనవి.

ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్

ఈ విభాగం నుంచి 40 ప్రశ్నలు వస్తాయి. పూర్తిగా సమకాలీన అంశాల నుంచే ప్రశ్నలు అడుగుతారు. బిజినెస్, వార్తల్లో వ్యక్తులు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ సంఘటనలను అభ్యర్థులు తెలుసుకోవాలి. దినపత్రికలను చూస్తే ముఖ్యాంశాలను నోట్స్‌లో రాసుకొని, చదవడం వల్ల మంచి మార్కులు సాధించొచ్చు.

- మ్యాట్‌ను ఏటా నాలుగుసార్లు (సాధారణంగా ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్‌లో) నిర్వహిస్తారు.
- పరీక్షలో 200 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. 150 నిమిషాల సమయం అందుబాటులో ఉంటుంది.
- లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్, మ్యాథమెటికల్ స్కిల్స్; డేటా అనాలిసిస్ అండ్ సఫీషియెన్సీ; ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్; ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	సమయం (నిమిషాల్లో)
లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్	40	30
మ్యాథమెటికల్ స్కిల్స్	40	40
డేటా అనాలిసిస్ అండ్ సఫీషియెన్సీ	40	35
ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్	40	30
ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్	40	15
మొత్తం	200	150

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2018, జనవరి 26.
- **పేపర్ ఆధారిత పరీక్ష (పీబీటీ) తేదీ:** 2018, ఫిబ్రవరి 4.
- **ఆన్‌లైన్ ఆధారిత పరీక్ష (సీబీటీ):** 2018, ఫిబ్రవరి 17.
- **పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నంలో పేపర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. హైదరాబాద్ లో పేపర్, కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటాయి.
- **వెబ్‌సైట్:** www.aima.in

బులెటిన్ బోర్డ్

సీఈసీఆర్ఐలో 20 ఖాళీలు

తమిళనాడులోని కరైకుడిలో ఉన్న సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈసీఆర్ఐ).. 20 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందింది.

- **పోస్టు-ఖాళీలు:** సైంటిస్ట్-11; సీనియర్ సైంటిస్ట్-2; సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్-1; టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)-5; ఫిమేల్ మెడికల్ ఆఫీసర్ (ఎఫ్ఎంవో)-1.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి పీహెచ్‌డీ/ఎంఈ/ఎంటెక్/బీఈ/బీటెక్/ఎంఎస్సీ+ఎంబీఏ/ఇంజనీరింగ్ డిప్లొమా/ఎంబీబీఎస్/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** 2018, ఫిబ్రవరి 12 నాటికి సైంటిస్ట్‌కు 32 ఏళ్లు; సీనియర్ సైంటిస్ట్-37 ఏళ్లు; సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్-50 ఏళ్లు; టీఏ-28 ఏళ్లు; ఎఫ్ఎంవోకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఎగ్జామినేషన్/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** 'సైంటిస్ట్' పోస్టులకు రూ.500; టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళలు/సీఎస్ఐఆర్ ఉద్యోగులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 12, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018.
- **వెబ్‌సైట్:** www.cecri.res.in

సీఎస్ఐఆర్-సీఐఎంఎఫ్ఆర్‌లో 18 ఖాళీలు

జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ (సీఐఎంఎఫ్ఆర్).. 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందింది.

- **పోస్టు:** టెక్నీషియన్.
- **విభాగాల వారీ ఖాళీలు:** కార్పెంటర్-2, సర్వేయింగ్-3, ప్లంబర్-2, ఐటీ-3, ఎలక్ట్రీషియన్-4, మెషినిస్ట్-2, హౌస్‌కీపింగ్-2.
- **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో పదోతరగతి/తత్సమాన విద్యతోపాటు కార్పెంటర్/సర్వేయర్/పంప్ ఆపరేటర్/ప్లంబర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)/ఎలక్ట్రికల్/మెషినిస్ట్/టర్నర్/హౌస్ కీపింగ్‌లో ట్రేడ్ సర్టిఫికెట్ (ఐటీఐ/ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ), కనీసం రెండేళ్ల ఉద్యోగానుభవం.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ట్రేడ్ టెస్ట్/స్కిల్ టెస్ట్.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.cimfr.nic.in

నిమ్‌హాన్స్‌లో 24 లోయర్ డివిజన్ క్లర్కులు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్: నిమ్‌హాన్స్).. 24 ఎల్‌డీసీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** ఎల్‌డీసీ (లోయర్ డివిజన్ క్లర్క్).
- **వేతనం:** రూ.21,000.
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీతోపాటు టైపింగ్ (నిమిషానికి 35 ఇంగ్లిష్/30 హిందీ పదాలు కంప్యూటర్లో టైప్ చేయగలగాలి).
- **వయసు:** 27 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ-రూ.250.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** జనవరి 31, 2018.
- **వెబ్‌సైట్:** www.nimhans.ac.in

హెచ్‌ఎంటీ మెషీన్ టూల్స్ లిమిటెడ్‌లో 18 ఖాళీలు

బెంగళూరులోని హెచ్ఎంటీ మెషీన్ టూల్స్ లిమిటెడ్.. 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** ప్రాజెక్ట్ అసోసియేట్ (పీఏ).
- **విభాగాల వారీ ఖాళీలు:** ఇంజనీరింగ్-9 (మెకానికల్-8+ఎలక్ట్రికల్-1), ఐటీఐ-5 (మెషినిస్ట్-1+ఫిట్టర్-1+ఎలక్ట్రీషియన్-1+డ్రాట్స్‌మ్యాన్ (మెకానికల్)-2), డిప్లొమా (మెకానికల్)-2, ఎంబీఏ (హెచ్ఆర్/ఆపరేషన్స్)-1, ఫైర్ అండ్ సేఫ్టీ (ఐటీఐ/డిప్లొమా/బీటెక్)-1.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్/డిప్లొమా/ఐటీఐ/ఎన్ఏసీ/ఎంబీఏ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** జనవరి 27, 2018.
- **వెబ్‌సైట్:** www.hmtmachinetools.com

బీఆర్‌బీఎన్ఎంపీఎల్‌లో 7 ఖాళీలు

బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేటు లిమిటెడ్ (బీఆర్‌బీఎన్ఎంపీఎల్).. 7 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం).
- **వేతనం:** రూ.58,905.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఇంక్ మ్యానుఫ్యాక్చరింగ్-4, రాజభాష-3.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి బ్యాచిలర్ ఇంజనీరింగ్ డిగ్రీ (కెమికల్ ఇంజనీరింగ్/పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ)/బ్యాచిలర్ డిగ్రీ (కెమిస్ట్రీ)/ఇంజనీరింగ్ డిప్లొమా (కెమికల్)/మాస్టర్స్ డిగ్రీ (హిందీ/హిందీ ట్రాన్స్‌లేషన్/ఇంగ్లిష్/సంస్కృతం). అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** 31 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/మాజీ సైనికోద్యోగ/ఇంటర్నల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. **చివరి తేదీ:** ఫిబ్రవరి 19, 2018.
- **వెబ్‌సైట్:** www.brbnmpl.co.in

India and Israel ink nine pacts



International

India attends SCO military cooperation meet

India for the first time participated in the military cooperation meeting of the Shanghai Cooperation Organisation (SCO), which it joined last year. An Indian delegation led by Major General Ajay Seth participated in the meeting in Beijing, which discussed issues of practical cooperation amongst the SCO member countries. The two-day meet, which concluded on 16th January, was held in Beijing and Sanya. India and Pakistan were admitted to the China-led bloc last year. After their admission, the number of member countries of the grouping has reached eight.

National

India registers significant decline in under-five child mortality rate

India has registered significant decline in under five child mortality rate. The rate of decline has doubled over the last year. As per the Sample Registration System data, under-five child mortality of the country has shown that the mortality has come down to 39 per thousand in 2016 from 43 in 2015. Most of the states have shown good progress in reduction of under-five child mortality from the previous year, except Chattisgarh, Delhi and Uttarakhand, which have shown a slight increase over the previous year. However, Telangana has shown no change in 2016.

iCreate centre inaugurated

Indian Prime Minister Narendra Modi and his Israeli counterpart Benjamin Netanyahu on 17th January attended the inauguration of the iCreate centre in Ahmedabad.
iCreate, or the International Centre for Entrepreneurship and Technology is an autonomous institution located in Dev Dholera village, about 50 km from Ahmedabad. Approved under the Narendra Modi's ambitious Start-up scheme, iCreate has ties with leading Israeli institutes and firms. The centre identifies, nurtures, and mentors aspiring individuals and teams (with or without ideas) to pursue their entrepreneurial dreams.

Bilateral

India, Britain sign agreements on illegal Indian migrants

India and Britain have signed agreements on illegal Indian migrants' return and sharing criminal records and intelligence. The development comes close on heels of India seeking Britain's help in early extradition of liquor tycoon Vijay Mallya from Britain to face the law at home in connection with cases of fraud and money laundering amounting to around 9,000 crore rupees. The Memorandums of Understanding (MOUs) were signed by Britain's Minister of Immigration Caroline Nokes and Union Minister of State for Home Affairs Kiren Rijiju.

India and Israel ink nine pacts

India and Israel on 15th January inked nine pacts across diverse sectors, from increasing cooperation in the oil and natural gas sector to film co-production, marking 25 years of diplomatic relations between the two countries. Agreements also include in agriculture, science and technology, and security. India and Israel also signed agreements for cooperation in cybersecurity, space, science and technology, air transport and agreed to have early conclusion of a bilateral investment treaty. A commerce ministry delegation is to visit Israel next month. Apart from nine pacts, Nasscom and startup accelerator MassChallenge Israel committed scholarship support of $5,000 each for up to 10 Indian startups.

Economy

India launches agri options trading in NCDEX

The National Commodity and Derivatives Exchange Ltd (NCDEX) on 14th January unveiled India's first agri-commodity options in guar seed designed as a hedge for farmers to safeguard against price risks. The agri-options trading has been launched by Finance Minister Arun Jaitley. Options are trading derivatives which give the buyer a right, but not the obligation, to buy or sell a security or other financial asset at a specific price on or before a certain date. There are already 59 Farmer Producer Organisations (FPOs) trading on the NCDEX.

WEF Ranks India 30th on Global Manufacturing Index

The World Economic Forum (WEF) has ranked India at 30th position on a global manufacturing index-below China's 5th place but above other BRICS peers, Brazil, Russia and South Africa. Japan has been found to have the best structure of production in the Geneva-based WEF's first 'readiness for the future of production report' and is followed by South Korea, Germany, Switzerland, China, Czech Republic, the US, Sweden, Austria and Ireland in the top 10. In the India context the report said, the country's manufacturing sector has grown by over 7 per cent per year on average in the past three decades and accounts for 16-20 per cent of India's GDP. It said, India has room for improvement across the drivers of production, except for demand environment where it ranks in the top 5.

Science and Technology

ISRO Launches Its 100th Satellite

The Indian Space Research Organisation (ISRO) on 12th January launched its 100th satellite along with 30 others in a single mission. The satellites were launched from the first launch pad of the Satish Dhawan Space Centre at Sriharikota. The Cartosat 2 Series satellite, the seventh in the series, a nano satellite and 28 commercial payloads were successfully injected into the orbit one by one by the PSLV C-40.

Agni missile test fired successfully

India successfully test-fired indigenously developed long-range surface-to-surface ballistic missile, Agni-5, off the Odisha coast on 18th January. The three-stage solid propellant Agni-5 missile has a strike range of over 5,000 kilometres and can carry a nuclear warhead of more than one ton. The missile covered 4,900 kilometres in 20 minutes in launch. The missile can hit most northern parts of China and other parts of Asia, Europe and Africa.

Sports

Sarjubala, Sonia, Sarita Win gold, RSPB Claim Team Title

In the National Women's Boxing Championship held at Rohtak, in Haryana..

- Sarjubala Devi (48kg), representing Manipur, claimed the gold as well as the best boxer trophy.
- The Railways Sports Promotion Board emerged overall champions.
- Sarjubala edged past Haryana's Ritu 3-2 to clinch Manipur's lone gold medal and her second successive national title.
- Former World and Asian champion L Sarita Devi (60kg), representing the All India Police (AIP), also picked up a gold medal after beating RSPB's Pavitra in her summit clash.

Rajendra Sharma
Current Affairs Faculty, Hyderabad



సాక్షి బిజినెస్
మంగళవారం 23-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
286 ▲	71 ▲
35,798	10,966

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,382	▲	46
డోజోన్స్	26,105	▲	33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,715	▽	15
డాక్స్	13,464	▲	29
షాంఘై	3,501	▲	13
నిక్కాయ్	23,816	▲	8

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.65	64.78
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.03	90.21
€	యూరో	ఎస్‌బీఐ	79.36	79.52
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.59	58.70
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.88	51.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.07	49.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.46	18.33
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.83	18.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.05	11.46

ఆర్థిక అసమానతలు పైపైకి

1% సంపన్నుల దగ్గరే 73 శాతం సంపద

- 2017లో కుబేరుల సంపద రూ.20.9 లక్షల కోట్లు అప్
- సగం జనాభా సంపద వృద్ధి ఒక్క శాతమే
- భారత్‌పై ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక



దావోస్: ఆర్థిక వృద్ధి గణాంకాలు ఎలా ఉన్నప్పటికీ దేశీయంగా ఆర్థిక అసమానతలు మాత్రం అంతకంతకూ పెరిగిపోతున్నాయి. గతేడాది జరిగిన మొత్తం సంపద సృష్టిలో 73 శాతం సొమ్మంతా ఒక్క శాతం సంపన్నుల దగ్గరే పోగుపడింది. అదే సమయంలో దేశ జనాభాలో దాదాపు సగభాగమైన 67 కోట్ల మంది పైగా పేదల సంపద కేవలం ఒకే ఒక్క శాతం పెరిగింది. అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే తరుణంలో ఈ నివేదిక విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆర్థిక అసమానతలను రూపుమాపడంపై దృష్టి పెడుతున్న ప్రపంచ దేశాల నేతలు ఆక్స్‌ఫామ్ నివేదికపై కూలంకషంగా చర్చించనున్నారు. ఓవైపు తిండికి కూడా గతిలేక కోట్ల మంది ప్రజలు పేదరికంలో మగ్గిపోతుంటే.. సంపన్నులు మరింత సంపద పోగు చేసుకునేలా ప్రపంచ ఎకానమీ తీరుతెన్నులు మారుతున్నాయని ఆక్స్‌ఫామ్ అధ్యయనంలో పేర్కొంది.

కేంద్ర బడ్జెట్‌కి సమాన సంపద ..

ఆక్స్‌ఫామ్ 2017కి సంబంధించి నిర్వహించిన సర్వేలో భారత్‌లో కుబేరుల సంపద రూ. 20.9 లక్షల కోట్లకు పైగా పెరిగినట్లు వెల్లడైంది. ఇది 2017–18 కేంద్ర ప్రభుత్వ మొత్తం బడ్జెట్‌కి దాదాపు సరిసమానం. ఆక్స్‌ఫామ్ గతేడాది నిర్వహించిన సర్వేలో 2016లో దేశీయంగా మొత్తం సంపదలో 58 శాతం వాటా ఒక్క శాతం సంపన్నుల వద్దే ఉన్నట్లు వెల్లడైంది. అంతర్జాతీయంగా నమోదైన సగటు 50 శాతం కన్నా ఇది అధికం కావడం గమనార్హం. ప్రభుత్వ విధానాలను బడా కంపెనీలు ప్రభావితం చేస్తుండటం, ఉద్యోగులు అణిచివేతకు గురవుతుండటం, వాటాదారులకు మరిన్ని లాభాలు పంచే యావతో.. కార్పొరేట్ కంపెనీలు వ్యయాలను భారీగా తగ్గించుకుంటూ ఉండటం తదితర అంశాలు.. కార్పొరేట్ బాసులు, వాటాదారుల లాభాల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఈ సర్వేలో మొత్తం పది దేశాలకు చెందిన 70,000 మంది ప్రజలు పాల్గొన్నారు.

17 మంది కొత్త బిలియనీర్లు..

గతేడాది భారత్‌లో కొత్తగా 17 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. దీంతో వీరి సంఖ్య 101కి చేరింది. భారతీయ బిలియనీర్ల సంపద పరిమాణం గతేడాదితో పోలిస్తే రూ. 4.89 లక్షల కోట్లు పెరిగి రూ. 20.7 లక్షల కోట్లకు చేరింది. ఇది అన్ని రాష్ట్రాలు కలిపి.. విద్య, ఆరోగ్యానికి కేటాయించిన బడ్జెట్‌లో దాదాపు 85 శాతానికి సమానం. 37 శాతం దేశీ బిలియనీర్లకు కుటుంబం నుంచి వారసత్వంగా సంపద వచ్చింది. దేశీయంగా మొత్తం బిలియనీర్ల సంపదలో వీరి సంపద వాటా 51 శాతం మేర ఉంది. బిలియనీర్ల సంఖ్య పెరగడమనేది ఎదుగుతున్న ఎకానమీకి సంకేతం కాదని, విఫలమవుతున్న ఆర్థిక వ్యవస్థకు నిదర్శనమని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ వ్యాఖ్యానించారు. సంపన్నులు, పేద వర్గాల మధ్య వ్యత్యాసం పెరిగిపోతుండటం మరింత అవినీతికి దారితీస్తుందని తెలిపారు. '2017లో బిలియనీర్ల సంఖ్య గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. ప్రతి రెండు రోజులకు ఒక బిలియనీర్ పుట్టుకొచ్చారు. ఇక 2010 నుంచి బిలియనీర్ల సంపద సగటున ఏడాదికి 13 శాతం మేర పెరిగింది. ఇది సామాన్య ఉద్యోగుల జీతభత్యాల పెరుగుదల కన్నా ఆరు రెట్లు ఎక్కువ. సాధారణంగా వారి జీతభత్యాలు ఏడాదికి సగటున కేవలం 2% మాత్రమే పెరిగాయి' అని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. దేశీయంగా గ్రామీణ ప్రాంతాల్లో కనీస వేతనం అందుకునే ఒక సామాన్యుడు.. ఒక దిగ్గజ దుస్తుల తయారీ సంస్థ సీఈవో వార్షిక వేతన స్థాయిని అందుకోవడానికి ఏకంగా 941 సంవత్సరాలు పడుతుందని అధ్యయనం అంచనా వేసింది. ఇక అమెరికాలో నైతే.. సీఈఓ సుమారు ఒక రోజులో ఆర్జించే వేతనం.. ఒక సామాన్య ఉద్యోగి ఏడాది సంపాదనకు సమానంగా ఉంటోంది.

ఈ చర్యలు అవసరం..

కేవలం కొద్ది మంది సంపన్నులకు మాత్రమే కాకుండా ప్రజలందరికీ ప్రయోజనాలు చేకూరేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దేలా భారత ప్రభుత్వం దృష్టి సారించాలని ఆక్స్‌ఫామ్ తెలిపింది. ఉద్యోగావకాశాలు ఊతమిస్తూ కార్మిక శక్తి ప్రాధాన్యం ఎక్కువగా ఉండే రంగాలను ప్రోత్సహించడం, వ్యవసాయంలో పెట్టుబడులు పెంచడం, ప్రస్తుత సామాజిక సంక్షేమ పథకాలను మరింత సమర్ధంగా అమలు చేయడం వంటి చర్యలతో సమ్మిళిత వృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సూచించింది.

రాజనీతిజ్ఞత చూపాలి

- భారత్‌లో అవకాశాలను బాగా వివరించాలి
- స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థగా ఫోకస్ అవ్వాలి
- డబ్ల్యూఈఎఫ్‌లో భారత్ వ్యూహంపై సీఈవోలు



దావోస్: ప్రపంచ దేశాలు రక్షణాత్మక ధోరణులకు మళ్లుతున్న నేపథ్యంలో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో భారత్ రాజనీతిజ్ఞత కనపర్చాలని, ఇక్కడి అవకాశాలను సమర్ధంగా తెలియజేయగలగాలని దేశీ వ్యాపార దిగ్గజాలు అభిప్రాయపడ్డారు. భారత్‌లో వ్యాపారావకాశాల గురించి చాటి చెప్పడంలో సేల్స్‌మ్యాన్‌గా కాకుండా స్టేట్స్‌మ్యాన్‌గా (రాజనీతిజ్ఞుడు) వ్యవహరించాలని పేర్కొన్నారు. వృద్ధి సత్తాను ప్రపంచానికి తెలియజేసే విషయంలో.. సేల్స్‌కి, మార్కెటింగ్‌కి మధ్య ఉండే చిన్న వ్యత్యాసాన్ని భారత్ గుర్తెరగాలని, రాజనీతిజ్ఞత ప్రదర్శించాలని ప్రముఖ బ్యాంకరు ఉదయ్ కొటక్ అభిప్రాయపడ్డారు. మిగతా దేశాలు రక్షణాత్మక ధోరణులు ప్రదర్శిస్తున్న తరుణంలో.. స్వేచ్ఛా ఆర్థిక వ్యవస్థగా భారత్ ఇటు దేశవిదేశ ఇన్వెస్టర్లకూ ప్రయోజనాలు కల్పించేలా ఏ విధమైన చర్యలు తీసుకుంటోందో సమర్ధంగా తెలియజేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, భారత్‌లో అవకాశాల గురించి సమర్ధంగా వివరించడంలో ప్రధాని నరేంద్ర మోదీని మించినవారు మరొకరు ఉండబోరని స్పైస్‌జెట్ సీఈవో అజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. గతేడాది చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ డబ్ల్యూఈఎఫ్‌లో పాల్గొన్నప్పుడు.. ఆ దేశంపై అందరి దృష్టి నిల్చిందని, ఈసారి కచ్చితంగా భారత్‌పైనే ఫోకస్ ఉండబోతోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే తనతో పాటు చాలా మంది భారతీయ సీఈవోలతో సమావేశాలకు పలువురు ఆసక్తి కనపర్చినట్లు సింగ్ వివరించారు. వివిధ రంగాల్లో పురోగమిస్తున్న భారత్.. భారీ వృద్ధి బాటలో నిలకడగా సాగుతోందని ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో చందా కొచర్ తెలిపారు. ఈ అవకాశాలను అందరూ అందిపుచ్చుకోవడంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తదితర దిగ్గజాలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. అమెరికాలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ట్రంప్ ప్రయత్నించనున్న నేపథ్యంలో మోదీ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నట్లు పలువురు భారతీయ సీఈవోలు తెలిపారు. ఈ నెల 23 నుంచి 26 దాకా జరిగే డబ్ల్యూఈఎఫ్ సదస్సులో భారత్ నుంచి 130 మంది సీఈవోలతో పాటు 2,000 మంది పైగా వ్యాపార దిగ్గజాలు, వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది దాకా ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటున్నారు.

సమ్మిళిత వృద్ధిలో అట్టడుగున భారత్!

- వర్ధమాన దేశాలలో 62వ స్థానం
- చైనా, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్ కన్నా దిగువన



దావోస్: సమ్మిళిత వృద్ధిలో పొరుగుదేశాలైన చైనా, పాకిస్తాన్‌ల కన్నా కూడా భారత్ అట్టడుగు స్థాయిలో ఉంది. వర్ధమాన దేశాలకు సంబంధించిన సమ్మిళిత వృద్ధి సూచీలో 62వ స్థానంలో నిల్చింది. చైనా 26, పాకిస్తాన్ 47వ స్థానాల్లో ఉండటం గమనార్హం. వర్ధమాన దేశాల జాబితాలో లిథువేనియా అగ్రస్థానంలో నిల్చింది. సంపన్న దేశాల జాబితాలో అత్యంత సమ్మిళిత ఆర్థిక వ్యవస్థగా నార్వే అగ్ర స్థానాన్ని నిలబెట్టుకుంది. వార్షిక సదస్సు నేపథ్యంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ఈ సూచీ విశేషాలు విడుదల చేసింది. జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ, రుణ భారాల నుంచి భవిష్యత్ తరాలను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకింగ్స్‌ని ఇచ్చినట్లు డబ్ల్యూఈఎఫ్ పేర్కొంది. ఆర్థిక అభివృద్ధికి జీడీపీ గణాంకాలే కొలమానంగా తీసుకోవడం స్వల్పకాలిక ధోరణులనే చూపుతోందని, అసమానతలకు ఆజ్యం పోస్తోందని తెలియజేసింది. ఈ నేపథ్యంలో సమ్మిళిత వృద్ధి సాధన కోసం ప్రపంచ దేశాల నేతలు మరో కొత్త విధానాన్ని తక్షణం కనుగొనాల్సిన అవసరం ఉందని సూచించింది.

గతేడాది 79 దేశాల వర్ధమాన దేశాల జాబితాలో భారత్ 60వ స్థానంలో నిల్చింది. చైనా 15, పాకిస్తాన్ 52వ స్థానాల్లో నిలిచాయి. తాజాగా 2018 సూచీలో భారత్ 60వ స్థానం నుంచి 62 స్థానానికి పడిపోగా.. పాకిస్తాన్ మాత్రం 47వ స్థానానికి ఎగబాకింది. సమ్మిళిత వృద్ధి సూచీలో మొత్తం 130 దేశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో 29 సంపన్న దేశాలు, మిగతా 74 వర్ధమాన దేశాలు ఉన్నాయి. భారత్ ఓవరాల్ స్కోరు తక్కువగానే ఉన్నప్పటికీ.. పురోగమిస్తున్న టాప్ టెన్ వర్ధమాన దేశాల్లో ఒకటిగా చోటు దక్కించుకుంది.

ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం వల్లే..

సంపదపరంగానూ, ఆదాయాలపరంగానూ అసమానతలు పెరిగిపోవడానికి కారణం.. దశాబ్దాలుగా సామాజిక సమగ్రాభివృద్ధి కన్నా ఆర్థికాభివృద్ధికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటమేనని డబ్ల్యూఈఎఫ్ పేర్కొంది. దీంతో వృద్ధి ఫలాలు అందరికి అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా పర్యావరణాన్ని దెబ్బతియ్యకుండా, భవిష్యత్ తరాలపై రుణ భారాన్ని మోపకుండా చూడగలిగే అవకాశాన్ని ప్రభుత్వాలు కోల్పోయాయని తెలిపింది. దేశ ఆర్థిక పనితీరును లెక్కగట్టేందుకు ఆర్థిక వేత్తలు, విధానకర్తలు ఎక్కువగా స్థూల దేశీయోత్పత్తి గణాంకాలపైనే ఆధారపడుతుండటం కూడా ప్రధాన సమస్యల్లో ఒకటని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది. జీడీపీ కేవలం వస్తు, సేవల ఉత్పత్తి లెక్కింపునకు మాత్రమే పరిమితవుతుందే తప్ప.. అవి ఉద్యోగావకాశాలు, ఆర్థిక భద్రత, జీవన ప్రమాణాలు మెరుగుదలను ప్రతిఫలించదని వివరించింది.

మరిన్ని విశేషాలు..

- సంపన్న దేశాల సమ్మిళిత వృద్ధి సూచీలో నార్వే టాప్‌లో ఉండగా, ఐర్లాండ్, లగ్జెంబర్గ్, స్విట్జర్లాండ్, డెన్మార్క్ టాప్ 5లో ఉన్నాయి.
- వర్ధమాన దేశాల్లో లిథువేనియా అగ్రస్థానంలో, హంగరీ, అజర్‌బైజాన్, లాత్వియా, పోలాండ్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- పొరుగు రాష్ట్రాలైన శ్రీలంక (40), బంగ్లాదేశ్ (34), నేపాల్ (22 వ ర్యాంకు) భారత్ కన్నా మెరుగైన స్థానాల్లో ఉన్నాయి.

టాలెంట్ ర్యాంకింగ్ మెరుగు ..

ప్రతిభావంతులను ఆకర్షించడంలో భారత్ ర్యాంకింగ్ మెరుగుపర్చుకుంది. గతేడాది 92వ స్థానంలో ఉన్న భారత్ ఈసారి 81వ స్థానానికి ఎగబాకింది. టాలెంట్‌ను ఆకర్షించడంలో పోటీతత్వానికి సంబంధించిన సూచీ వివరాలను డబ్ల్యూఈఎఫ్ ప్రకటించింది. భారత్‌కి తీవ్రమైన మేధోవలస రిస్కు పొంచి ఉందని పేర్కొంది. స్విట్జర్లాండ్ మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సింగపూర్, అమెరికా ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

అపోలో మైక్రో సిస్టమ్స్ లిస్టింగ్ అదరహో..!

- 74 శాతం లాభంతో లిస్టింగ్
- 65 శాతం లాభంతో క్లోజింగ్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన అపోలో మైక్రో సిస్టమ్స్ కంపెనీ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో మెరుపులు మెరిపించింది. ఈ కంపెనీ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.275తో పోలిస్తే 74 శాతం లాభంతో రూ.478 వద్ద లిస్టయింది. ఇష్యూ ధరతో పోలిస్తే 65 శాతం లాభంతో రూ.454 వద్దముగిసింది. ఇంట్రాడేలో రూ.480 గరిష్ట స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఈలో రూ.465 వద్ద లిస్టయిన ఈ షేర్ ఇంట్రాడేలో రూ.480 గరిష్ట స్థాయిని తాకి చివరకు రూ.442 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 1.7 లక్షలు, ఎన్‌ఎస్‌ఈలో 10.38 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.

హెచ్‌ఎస్‌ఐఎల్ పైప్స్ ప్లాంటు ప్రారంభం


సందీప్ సోమానీ, పైప్స్ విభాగం ప్రెసిడెంట్ రాజేష్ పజ్నూ (ఎడమ)

తెలంగాణలో రూ.160 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శానిటరీవేర్ కంపెనీ హెచ్‌ఎస్‌ఐఎల్... తెలంగాణలో పైపుల తయారీ ప్లాంటును ప్రారంభించింది. తద్వారా సీపీవీసీ, యూపీవీసీ పైపుల విభాగంలోకి కంపెనీ ప్రవేశించింది. ట్రూఫ్లో బ్రాండ్ పేరుతో వీటిని విక్రయిస్తారు. హైదరాబాద్ సమీపంలోని ఇస్నాపూర్ వద్ద రూ.160 కోట్ల వ్యయంతో 30,000 టన్నుల సామర్థ్యంతో ఈ యూనిట్‌ను స్థాపించింది. 2020 నాటికి ప్లాంటు సామర్థ్యాన్ని రెండింతలకు చేరుస్తామని హెచ్‌ఎస్‌ఐఎల్ వైస్ చైర్మన్, ఎండీ సందీప్ సోమానీ ఈ సందర్భంగా సోమవారమిక్కడ మీడియాకు తెలిపారు. విస్తరణకు రూ.100 కోట్లు వెచ్చిస్తామన్నారు. సీపీవీసీ పైపుల విపణి దేశంలో 28 శాతం వార్షిక వృద్ధితో రూ.3,200 కోట్లుంది. రూ.100 కోట్లతో చేపట్టిన మెదక్‌లోని సెక్యూరిటీ బాటిల్ క్యాప్స్ ప్లాంటు విస్తరణ ఈ ఏడాది సెప్టెంబరుకల్లా పూర్తి అవుతుంది.

రూ.769కే స్పైస్‌జెట్ 'రిపబ్లిక్' ఆఫర్



న్యూఢిల్లీ: దేశీ మూడో అతిపెద్ద విమానయాన సంస్థ 'స్పైస్‌జెట్' తాజాగా రిపబ్లిక్ డే సందర్భంగా పరిమితకాల ప్రమోషనల్ ఆఫర్‌ను ఆవిష్కరించింది. 'గ్రేట్ రిపబ్లిక్ డే సేల్'ను ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రయాణికులు దేశీ వన్‌వే ప్రయాణానికి రూ.769 ప్రారంభ ధరతో టికెట్లను బుక్ చేసుకోవచ్చు. అదే విదేశీ వన్‌వే ప్రయాణానికి రూ.2,469 ప్రారంభ ధరతో టికెట్లను పొందొచ్చు. జనవరి 25 వరకు అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌లో భాగంగా టికెట్లను బుక్ చేసుకున్నవారు ఈ ఏడాది డిసెంబర్ 12 వరకు ఎప్పుడైనా ప్రయాణించొచ్చు.

'అమెజాన్ గో' వచ్చేసింది..



వాషింగ్టన్: అమెజాన్ ఎట్టకేలకు తన తొలి 'అమెజాన్ గో' స్టోర్‌ను కస్టమర్లకు అందుబాటులోకి తీసుకువచ్చింది. కంపెనీ.. మెషీన్ లెర్నింగ్, సెన్సార్స్ వంటి అత్యాధునిక టెక్నాలజీలతో అమెరికాలోని సీటెల్‌లో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఎలాంటి చెక్ పాయింట్స్ ఉండవు. అంటే కస్టమర్ స్టోర్ లోనికి వెళ్లి తనకు నచ్చిన వస్తువులు/సరుకులు తీసుకొని ఇంటికి వెళ్లిపోవచ్చు. కస్టమర్ అమెజాన్ అకౌంట్ నుంచి బిల్లు ఆటోమేటిక్‌గా డెబిట్ అయిపోతుంది. ఇదెలాగంటే... కంపెనీ స్టోర్‌లో ప్రత్యేకమైన కెమెరాలను ఏర్పాటు చేసింది. ఇవి కస్టమర్ కదలికలను గమనిస్తూ, వారు ఎంపిక చేసుకున్న ప్రొడక్టులను ట్రాక్ చేస్తాయి. ఇక అల్మారాల్లోని సెన్సార్లు తీసుకున్న వస్తువులకు బిల్లు వేస్తాయి. కాగా కస్టమర్లు స్మార్ట్‌ఫోన్‌లో అమెజాన్ గో యాప్‌ను కచ్చితంగా వాడాలి. స్టోర్‌లోకి ఎంటర్ అయ్యేటప్పుడు దీన్ని స్కాన్ చేయాల్సి ఉంటుంది.

హెచ్‌పీసీఎల్ చేతికి ఎమ్ఆర్‌పీఎల్ !

- త్వరలోనే విలీన నిర్ణయం
- హెచ్‌పీసీఎల్ సీఎండీ వెల్లడి

నగదు, షేర్ల మార్పిడి రూపేణా కొనుగోలు!



న్యూఢిల్లీ: మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ (ఎమ్ఆర్‌పీఎల్) కంపెనీని కొనుగోలు చేసే అవకాశాలున్నట్లు హెచ్‌పీసీఎల్ వెల్లడించింది. నగదు, షేర్ల మార్పిడి రూపేణా ఎమ్ఆర్‌పీఎల్‌ను కొనుగోలు చేసే అవకాశాలున్నట్లు హెచ్‌పీసీఎల్ సీఎండీ ముకేశ్ కుమార్ సురానా చెప్పారు. కాగా హెచ్‌పీసీఎల్‌ను ఓఎన్‌జీసీ రూ.36,915 కోట్లకు కొనుగోలు చేయనున్న విషయం తెలిసిందే. ఈ టేకోవర్ తర్వాత ఓఎన్‌జీసీకి రెండు రిఫైనరీ అనుబంధ సంస్థలు– హెచ్‌పీసీఎల్, ఎమ్ఆర్‌పీఎల్‌లు ఉంటాయి. హెచ్‌పీసీఎల్‌ను స్వతంత్ర లిస్టెడ్ కంపెనీగా కొనసాగించాలని, డౌన్‌స్ట్రీమ్ విభాగాలన్నింటినీ హెచ్‌పీసీఎల్ నేతృత్వంలోకి తీసుకురావాలని కూడా ఓఎన్‌జీసీ యోచిస్తోంది.

త్వరలో విలీన నిర్ణయం..

హెచ్‌పీసీఎల్‌లో ఎమ్ఆర్‌పీఎల్ విలీనాన్ని పరిశీలిస్తున్నామని ఇటీవలే ఓఎన్‌జీసీ సీఎండీ శశి శంకర్ కూడా చెప్పారు. రెండు కంపెనీల బోర్డ్‌లు దీనిపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాయని పేర్కొన్నారు. ఎమ్ఆర్‌పీఎల్‌లో ఓఎన్‌జీసీకి 71.63 శాతం వాటా ఉండగా, హెచ్‌పీసీఎల్‌కు 16.96 శాతం వాటా ఉంది. సోమవారం నాటి ట్రేడింగ్ ధరతో పోలిస్తే ఓఎన్‌జీసీ వాటా షేర్లను హెచ్‌పీసీఎల్ రూ.16,000 కోట్లకు కొనుగోలు చేయవచ్చు. లేదా షేర్ల మార్పిడి రూపంలో అయినా కొనుగోలు చేసే అవకాశాలున్నాయి. ఎమ్ఆర్‌పీఎల్‌లో వాటాను వదులుకోవడం ద్వారా మరిన్ని హెచ్‌పీసీఎల్ షేర్లను ఓఎన్‌జీసీ పొందే అవకాశాలుంటాయి. ఇక మూడో ఆప్షన్.. ఈ రెండింటిని కలగలపడం.. ఇదే అత్యుత్తమమైన మార్గమని సురానా చెబుతున్నారు.

మూడో రిఫైనరీ...

హెచ్‌పీసీఎల్‌కు ఎమ్ఆర్‌పీఎల్ మూడో రిఫైనరీ అవుతుంది. ఇప్పటికే హెచ్‌పీసీఎల్‌కు ముంబై, విశాఖల్లో రెండు రిఫైనరీలున్నాయి. ఓఎన్‌జీసీలో హెచ్‌పీసీఎల్ విలీనం పూర్తయితే. హెచ్‌పీసీఎల్‌కు చెందిన 23.8 మిలియన్ టన్నుల వార్షిక రిఫైనరీ సామర్థ్యం ఓఎన్‌జీసీ పరమవుతుంది. 15 మిలియన్ టన్నుల ఎమ్ఆర్‌పీఎల్ రిఫైనరీ సామర్థ్యాన్ని కూడా కలుపుకుంటే, భారత్‌లో మూడో అతి పెద్ద ఆయిల్ రిఫైనరీగా (రెండో అతి పెద్ద ప్రభుత్వ రంగ) ఓఎన్‌జీసీ అవతరిస్తుంది. ఇండియన్ ఆయిల్ కార్పొ, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఎమ్ఆర్‌పీఎల్ తమ చేతికి వస్తే, హెచ్‌పీసీఎల్ మరింత పటిష్టమవుతుందని ముకేశ్ కుమార్ సురానా చెప్పారు. హెచ్‌పీసీఎల్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న దానికంటే అధికంగా పెట్రోలియం ఉత్పత్తులను విక్రయిస్తోందని, ఎమ్ఆర్‌పీఎల్ తమ చేతికి వస్తే, ఈ లోటు భర్తీ అవుతుందని వివరించారు. ఎమ్ఆర్‌పీఎల్ తమకు తెలియని కంపెనీయేమీ కాదని సురానా చెప్పారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం 25% అప్

- మెరుగుపడిన రుణ నాణ్యత
- 9 శాతం పెరిగిన నికర వడ్డీ ఆదాయం
- ఏడాది గరిష్టాన్ని తాకిన షేరు



ముంబై: యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.726 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో సాధించిన నికర లాభం(రూ.580 కోట్లు)తో పోల్చితే 25 శాతం వృద్ధి సాధించామని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం స్వల్పంగా తగ్గినప్పటికీ, ఇతర, నిర్వహణ ఆదాయాలు కూడా తగ్గినప్పటికీ, కేటాయింపులు తక్కువగా ఉండడం, నికర వడ్డీ ఆదాయం అధికంగా ఉండడంతో నికర లాభంలో మంచి వృద్ధి సాధించినట్లు వివరించింది.

రిటైల్ రుణాలు 29 శాతం వృద్ధి...

ఈ త్రైమాసికంలో బ్యాంకు స్థూల మొండి బకాయిలు 5.22 శాతం నుంచి 5.28 శాతానికి, నికర మొండి బకాయిలు 2.18 శాతం నుంచి 2.56 శాతానికి పెరిగాయి. అయితే క్వార్టర్ ఆన్ క్వార్టర్ పరంగా చూస్తే రుణ నాణ్యత మెరుగుపడింది. ఈ క్యూ2లో స్థూల మొండి బకాయిలు 5.90 శాతంగా, నికర మొండి బకాయిలు 3.12 శాతంగా ఉన్నాయి. మొత్తం రుణాలు 21 శాతం వృద్ధితో రూ.4,20,923 కోట్లకు చేరాయి. రిటైల్ రుణాలు 29 శాతం వృద్ధితో రూ.1,93,296 కోట్లకు పెరిగాయి. మొత్తం రుణాల్లో 41 శాతంగా ఉండే కార్పొరేట్ రుణాలు 12 శాతం పెరిగి రూ.1,72,743 కోట్లకు చేరాయి.

స్వల్పంగా తగ్గిన మొత్తం ఆదాయం...

గత క్యూ3లో రూ.14,501 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.14,315 కోట్లకు తగ్గిందని బ్యాంక్ తెలిపింది. ఇతర ఆదాయం 24 శాతం తగ్గి రూ.2,593 కోట్లకు, నిర్వహణ లాభం 17 శాతం తగ్గి రూ.3,854 కోట్లకు పరిమితమయ్యాయి. క్యూ3లో రూ.3,796 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ3లో రూ.2,811 కోట్లకు తగ్గాయి. మొండి బకాయిలకు కేటాయింపులు 26 శాతం, క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన 11% చొప్పున తగ్గాయి. నికర వడ్డీ ఆదాయం రూ.4,334 కోట్ల నుంచి 9% వృద్ధితో రూ.4,732 కోట్లకు, వ్యాపారం 11% వృద్ధితో రూ.6,43,938 కోట్లకు పెరిగింది. డిపాజిట్లు 10 శాతం ఎగిశాయి. ఈ క్యూ3లో 105 కొత్త బ్రాంచీలను ప్రారంభించామని, మొత్తం బ్రాంచీల సంఖ్య 3,589కు పెరిగిందని బ్యాంకు తెలియజేసింది.

25 శాతం తగ్గిన కేటాయింపులు

ఏడు క్వార్టర్ల క్రితం రూ.22,600 కోట్లుగా ఉన్న సందేహాస్పద ఖాతాలకు సంబంధించిన వాచ్‌లిస్ట్ ఈ క్యూ3లో రూ.5,300 కోట్లకు తగ్గిందని బ్యాంక్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జైరామ్ శ్రీధరన్ చెప్పారు. మొత్తం కేటాయింపులు 25% తగ్గి రూ.2,811 కోట్లకు తగ్గాయని, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 65%కి పెరిగిందని వివరించారు. క్యూ2 ఫలితాలు ప్రకటించక ముందే వాట్సాప్‌లో లీకైన కేసు దర్యాప్తు విషయంలో సెబీకి సహకరిస్తున్నామని, ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఫలితాలు అంచనాలను మించడంతో షేర్ 3.5% లాభంతో రూ.611 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ ఏడాది గరిష్ట స్థాయి, రూ.621ను తాకింది.




నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

వస్తువు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	-- / --
మిర్చి (వరంగల్, తేజ)	-- / --
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	-- / --
ఉల్లి (కర్నూలు)	రూ.1,300 (కనిష్ఠం) / రూ.3,300 (గరిష్ఠం)
చక్కెర (చెన్నై)	రూ.3,500
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--











ఐపీఓకు రూట్ మొబైల్ ఇండియా!

ఇష్యూ సైజ్ రూ.600 కోట్లు

న్యూఢిల్లీ: రూట్ మొబైల్ ఇండియా కంపెనీ త్వరలో ఐపీఓకు రానుంది. మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు, వాణిజ్య సంస్థలకు క్లౌడ్ –కమ్యూనికేషన్ ప్లాట్‌ఫార్మ్ సర్వీసులనందించే ఈ కంపెనీ సోమవారం ఐపీఓ పత్రాలను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా సంస్థ రూ.600 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓలో భాగంగా రూ.350 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు ప్రమోటర్లకు చెందిన 65 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ విధానంలో జారీ చేయనున్నారు. మోతిలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, యస్ సెక్యూరిటీస్, ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్ ఈ ఐపీఓకు లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.



నాలుగో రోజూ రికార్డ్‌ల ర్యాలీ

- ఇంట్రాడేలో, ముగింపులో కొత్త శిఖరాలకు సూచీలు
- నేపథ్యం.. అంచనాలను మించుతున్న క్యూ3 ఫలితాలు
- బడ్జెట్‌పై ఆశలు

ముంబై: స్టాక్ మార్కెట్లో సోమవారం రికార్డ్‌ల ర్యాలీ కొనసాగింది. ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ స్టాక్ సూచీలు మళ్లీ కొత్త రికార్డ్‌లను సృష్టించాయి. స్టాక్ సూచీలు కొత్త శిఖరాలకు చేరడం ఇది వరుసగా నాలుగో రోజు. కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ఆరోగ్యకరంగా ఉన్న నేపథ్యంలో విదేశీ నిధులు నిలకడగా వస్తుండడం, దేశీయ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు జోరుగా ఉండడం, బడ్జెట్‌పై ఆశావహ అంచనాల కారణంగా స్టాక్ మార్కెట్ పరుగులు పెడుతూనే ఉంది. తొలిసారిగా సెన్సెక్స్ 35,800 పాయింట్లపైకి ఎగబాకగా, నిఫ్టీ 10,975 పాయింట్లను తాకింది. బ్యాంక్ నిఫ్టీ 27వేల పాయింట్లపైకి ఎగసింది. అమెరికా షట్ డౌన్ కారణంగా అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ఇటీవల కొన్ని వస్తువులు, సేవలపై జీఎస్‌టీ రేట్లను తగ్గించడం కూడా కలిసివచ్చింది. చివర్లో కొంత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల లాభాలు తగ్గాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 286 పాయింట్లు లాభపడి 35,798 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 72 పాయింట్ల లాభంతో 10,966 పాయింట్ల, బ్యాంక్ నిఫ్టీ 132 పాయింట్లు లాభంతో 27,041 పాయింట్ల వద్ద ముగిశాయి. కీలకమైన 11,000 పాయింట్లకు నిఫ్టీ కేవలం 34 పాయింట్ల దూరంలోనే ఉంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 316 పాయింట్ల లాభంతో 35,828 పాయింట్ల, నిఫ్టీ 80 పాయింట్లు లాభంతో 10,975 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి. కాగా గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,027 పాయింట్లు పెరిగింది.

3,000 దాటిన టీసీఎస్

స్టాక్ సూచీల లాగానే టీసీఎస్ షేర్ కూడా జీవితకాల గరిష్ట స్థాయి, రూ.3,130ను తాకింది. 5.3 శాతం లాభంతో రూ.3,113 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. హెచ్‌పీసీఎల్ విలీనానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఇంట్రాడేలో 6 శాతం వరకూ ఎగసిన ఓఎన్‌జీసీ షేర్ చివరకు 3.2 శాతం లాభంతో రూ.200 వద్ద ముగిసింది. ఫలితాలు అంచనాలను అధిగమించడంతో ఇంట్రాడేలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆల్ టైమ్ హైని తాకింది. హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా జీవితకాల గరిష్ఠ స్థాయిలను తాకాయి.



క్యూ3 ఫలితాలు బాగా ఉంటుండటంతో మార్కెట్ జోరు కొనసాగుతోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, బడ్జెట్‌పై అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,923
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	35,915
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,31,631
ఎఫ్ఐఐ	1,568
డీఐఐ	462

సూచీల ఆల్‌టైమ్ హై...

సూచీ	ఇంట్రాడే	ముగింపు
సెన్సెక్స్	35,828	35,798
నిఫ్టీ	10,975	10,966

వృద్ధి వేగంలో చైనాకన్నా భారత్ ముందు

2018పై ఐఎంఎఫ్ అంచనా



వాషింగ్టన్ /దావోస్: భారత్ 2018లో 7.4 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. చైనా వృద్ధి రేటు 6.8 శాతంగానే ఉంటుందని, తద్వారా ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా 2018లో భారతదేశమే ముందుంటుందని తన తాజా నివేదికలో విశ్లేషించింది. పెద్దనోట్ల రద్దు, వస్తు–సేవల పన్ను (జీఎస్‌టీ) అమలుకు సంబంధించి ఆర్థిక మందగమనం నుంచి భారత్ కోలుకుంటోందని తన వరల్డ్ అవుట్‌లుక్‌లో వివరించింది. 2019లో భారత్ వృద్ధి రేటు 7.8 శాతంగా ఉంటుందనీ ఐఎంఎఫ్ అంచనావేసింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సందర్భంగా దావోస్ (స్విట్జర్లాండ్)లో ఐఎంఎఫ్ ఈ అవుట్‌లుక్‌ను ఆవిష్కరించింది. 2018–19లో ఆసియా వృద్ధి 6.5 శాతంగా ఐఎంఎఫ్ అవుట్‌లుక్.

లక్ష కోట్లు పెరగనున్న సాగు రుణ లక్ష్యం!

ఈ బడ్జెట్‌లో రూ.11 లక్షల కోట్లకు చేరే అవకాశం



న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న 2018–19 వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రుణ లక్ష్యాలు పెరుగుతాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2017–18) బడ్జెట్ వ్యవసాయ రుణ లక్ష్యం రూ.10 లక్షల కోట్లు. 2018–19లో ఈ రుణ లక్ష్యాన్ని మరో లక్ష కోట్ల రూపాయలు పెంచవచ్చన్నది అంచనా. ఇదే జరిగితే రాబోయే బడ్జెట్‌లో రుణ లక్ష్యం రూ.11 లక్షల కోట్లకు పెరిగే అవకాశముంది.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేటాయించిన రూ.10 లక్షల కోట్ల వ్యవసాయ రుణ లక్ష్యంలో సెప్టెంబర్ 2017 నాటికి రూ.6.25 లక్షల కోట్ల రుణాలే మంజూరయ్యాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
- ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం... అత్యధిక వ్యవసాయ ఉత్పత్తి సాధన విషయంలో 'రుణ లభ్యత'కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ప్రైవేటు రుణ దాతల వద్ద రుణాలు రైతులకు ఇబ్బందికరంగా పరిణమిస్తున్న నేపథ్యంలో, తగిన వడ్డీ రేటున్న వ్యవస్థీకృతమైన పటిష్ట రుణ వ్యవస్థను రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఏషియన్ పెయింట్స్ ఆదాయం రూ.4,317 కోట్లు



న్యూఢిల్లీ: ఏషియన్ పెయింట్స్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ క్వార్టర్లో 16 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్లో రూ.489 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.567 కోట్లకు చేరిందని ఏషియన్ పెయింట్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.4,315 కోట్ల నుంచి రూ.4,317 కోట్లకు పెరిగినట్లు కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ కె.బి.ఎస్.ఆనంద్ వెల్లడించారు. వ్యయాలు తగ్గాయని, గత క్యూ3లో రూ.3,611 కోట్లుగా ఉన్న మొత్తం వ్యయాలు ఈ క్యూ3లో రూ.3,475 కోట్లకు తగ్గాయని వివరించారు.

హావెల్స్ ఇండియా లాభం రూ.194 కోట్లు



న్యూఢిల్లీ: వినియోగ ఎలక్ట్రికల్ వస్తువులు తయారు చేసే హావెల్స్ ఇండియా కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.194 కోట్ల నికర లాభాన్ని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో రూ.153 కోట్ల నికర లాభం వచ్చిందని హావెల్స్ ఇండియా తెలిపింది. మొత్తం ఆదాయం గత క్యూ3లో రూ.1,651 కోట్లుగా ఉండగా, ఈ క్యూ3లో రూ.1,994 కోట్లుగా ఉందని కంపెనీ సీఎమ్‌డీ అనిల్ రాయ్ గుప్తా చెప్పారు. ఎలక్ట్రికల్ ఉత్పత్తులపై జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ వినియోగదారుల సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపించిందంటూ... ఈ వృద్ధి జోరు కొనసాగగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్ఈలో హావెల్స్ ఇండియా షేర్ 0.9 శాతం లాభంతో రూ.552 వద్ద ముగిసింది.

ప్లానన్ ఇన్నోవేషన్ సెంటర్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వర్క్‌ప్లేస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సేవల్లో ఉన్న నెదర్లాండ్స్‌కు చెందిన ప్లానన్... హైదరాబాద్‌లోని తన ఇన్నోవేషన్ సెంటర్‌ను విస్తరిస్తోంది. 2008లో భారత్‌లో ప్రవేశించిన ఈ కంపెనీ, రానున్న రోజుల్లో సిబ్బంది సంఖ్యను మూడు రెట్లకు పెంచనుంది. హైదరాబాద్ కేంద్రంలో ప్రస్తుతం 130 మంది పనిచేస్తున్నారని కంపెనీ ఫౌండర్ పియరీ గులెన్ సోమవారమిక్కడ మీడియాకు తెలిపారు. ప్లానన్‌కు 40 దేశాల్లో 2,000 పైచిలుకు కస్టమర్లు ఉన్నారు.

ఎఫ్‌ఎంసీజీలోకి బైద్యనాథ్

Baidyanath
The most trusted name in ayurveda since 1917

న్యూఢిల్లీ: ఆయుర్వేదిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ 'బైద్యనాథ్' తాజాగా ఎఫ్‌ఎంసీజీ విభాగంలోకి అడుగుపెట్టింది. వివిధ రకాల నేచురల్ జ్యూస్‌లను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఓరల్ హెల్త్‌కేర్, వ్యక్తిగత పరిశుభ్రత, చర్మ సంరక్షణ ఉత్పత్తులను కూడా త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని కంపెనీ తెలిపింది. 'వినియోగదారుల ప్రాధాన్యతలు మారుతున్నాయి. యువత ప్రస్తుతం నేచురల్, ఆర్గానిక్, ఆయుర్వేదిక్ ప్రొడక్టుల వైపు మళ్లుతోంది. అందుకే ఆరోగ్యానికి ప్రయోజనకరమైన ఉత్పత్తులతో ఎఫ్‌ఎంసీజీ విభాగంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాం' అని బైద్యనాథ్ ఆయుర్వేద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనురాగ్ శర్మ వివరించారు.

బోర్డ్ మీటింగ్స్

కెన్‌ఫిన్ హోమ్స్, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్, సింఫనీ, సింజిన్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, ఫోర్స్ మోటార్స్, యునైటెడ్ స్పిరిట్స్, అలెంబిక్ ఫార్మా, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్సూమర్ ఎలక్ట్రికల్స్, స్వరాజ్ ఇంజిన్స్, ఎడిల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

అక్టోబర్ - డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో) 2017-18	2016-17	వృ/క్షీ(%)	మొత్తం ఆదాయం (కోట్లలో) 2017-18	2016-17	వృ/క్షీ(%)
దివాన్ హౌసింగ్ ఫైనాన్స్	306	245	25	2,643	2,363	12
ర్యాలీస్ ఇండియా	25	25	--	394	352	12
వి-గార్డ్ ఇండస్ట్రీస్	36	26	41	526	451	17
జస్ట్ డయల్	29	27	4	197	180	9

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,190
బంగారం (99.5, 10గ్రా)	30,040
వెండి (కిలో)	38,885
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	
బంగారం (22 క్యారెట్లు)	28,780
వెండి (కిలో)	
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,780
బంగారం (22 క్యారెట్లు)	28,780
వెండి(కిలో)	39,265
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	30,650
బంగారం (22 క్యారెట్లు)	28,410
వెండి(కిలో)	39,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	31,390
బంగారం (22 క్యారెట్లు)	28,780
వెండి(కిలో)	38,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	31,100
బంగారం (22 క్యారెట్లు)	28,750
వెండి(కిలో)	40,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,120
బంగారం (22 క్యారెట్లు)	28,780
వెండి(కిలో)	40,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.70	$63.31
బ్రెంట్	69.08	$68.61

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 23-1-2018

విశాఖ	412-00
చిత్తూరు	398-00
వరంగల్	404-00
ముంబై	447-00
చెన్నై	405-00
విజయవాడ	412-00
గోదావరి	412-00
నమక్కల్	390-00
22-1-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	408-00
ఢిల్లీ	425-00
కోల్‌కతా	464-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	438.05	433.45
AMBUJA C	268.45	268.6
ASIAN PA	1176	1189.9
AXIS BAN	611.55	590.25
BAJAJ AU	3274.5	3210.4
BAJAJ FI	1706.35	1701.9
BHARTI A	490.7	497.9
[illegible]	[illegible]	[illegible]

A B C D

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
20 MICRO	55.7	57.15
20 MICRO	55.85	55
3M INDIA	18806.2	18182.15
5PAISA C	323.65	329.65
63 MOONS	105	106.15
8K MILES	781.05	826.05
AARTI DR	715.6	698
AARTI IN	1135.4	1126.35
AARVEE D	53.4	54.85
AARVI EN	99	101.5
[illegible]	[illegible]	[illegible]

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
BASF IND	2200.6	2219.3
BATA IND	730.35	716.25
BAYER CR	4650.15	4575.35
BEARDSEL	68.8	66.75
BEML LIM	1515.9	1513.6
BERGER P	249.6	246.65
BETA DRU	175	170
BF INVES	344.8	338.2
BF UTILI	525.2	512
BGR ENER	139.75	135.65
BHAGERIA	293.15	278.65
BHANSALI	191.35	182.25
BHARAT B	1404.3	1387.05
[illegible]	[illegible]	[illegible]

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
DIC INDI	589.9	584.35
DILIP BU	932.5	946.2
DISH TV	71	72.65
DISHMAN	384.75	360.95
DIXON TE	3824.85	3830.15
DOLLAR I	455.8	455.4
DOLPHIN	128.2	128.05
DR. LAL	913.05	903.05
DYNAMATI	1948.05	1951.45
[illegible]	[illegible]	[illegible]

E F G H

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ECE INDU	340.5	343.5
[illegible]	[illegible]	[illegible]

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
GUJARAT	209.7	211.1
GUJARAT	264.6	257.6
GUJARAT	877.25	866.75
GUJARAT	890.6	876
GUJARAT	882.35	888.85
GULF OIL	899.15	923.25
GULSHAN	89	87.3
HARITA S	1021.15	1023.95
HATSUN A	810.35	833.2
HCL INFO	59.2	58.5
HDFC BAN	2040	1973
HDFC STA	470.2	481.5
HEALTHCA	300.9	299.6
[illegible]	[illegible]	[illegible]

I J K L

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
JINDAL S	115.9	114
JINDAL S	165.3	157.75
JINDAL S	202.95	208.6
JINDAL S	263.75	264.15
JINDAL W	638.35	622.55
JK CEMEN	1153.05	1128.15
JK LAKSH	430.7	433.65
JK PAPER	148	142.95
JK TYRE	177.85	179.7
JKUMAR I	336.05	320.4
JM FINAN	163.85	166.95
JMC PROJ	592.5	596.9
JOCIL LI	193.75	191.35
[illegible]	[illegible]	[illegible]

M N O P

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
MARATHON	594.7	587.35
MAS FINA	638.7	626.05
MASTEK L	445.75	425.9
MATRIMON	925.3	911.95
MAWANA S	67.05	66.5
MAX FINA	544.35	548.4
MAX INDI	118.25	117.25
MAX VENT	86.65	86.4
MAYUR UN	527.2	517.6
MAZDA LI	486.35	487.35
MCLEOD R	181.25	180.65
MEGHMANI	117.95	109.2
MENON BE	121.2	112.85
[illegible]	[illegible]	[illegible]

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
PLASTIBL	241.15	239.55
PNB HOUS	1292.25	1304.15
PNC INFR	192.3	191
PODDAR H	1169.9	1148.3
PODDAR P	305.7	304.5
POKARNA	228.95	229.85
POLY MED	259.75	265.3
POLYPLEX	551.25	543.7
PONNIE S	177.85	180.2
POWER ME	876.9	874.3
PPAP AUT	657.55	640.95
PRABHAT	220.4	212.45
PRAJ IND	114.2	112.9
[illegible]	[illegible]	[illegible]

R S T U

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
SHARDA M	2480.85	2477.2
SHEELA F	1585.65	1571.15
SHEMAROO	550.55	498.7
SHILPA M	600.5	586.9
SHIPPING	90.1	88.9
SHIRPUR	181.05	177.05
SHIVA TE	615.05	614.5
SHIVAM A	90.15	89.7
SHOPPERS	530.1	517.65
SHRADHA	68.5	70
SHREE PUS	295.55	298.05
SHREE TI	63.8	60.9
SHRENIK	654.75	634.95
[illegible]	[illegible]	[illegible]

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
THE NEW	617.75	606.5
THE P K	590.4	621.45
THE PHOE	617.5	606.8
THE RAMC	781.2	785.55
THE RUBY	400.15	404
THE TINP	300.3	291.85
THEJO EN	617	615
THEMIS M	607.45	621.95
THERMAX	1289.5	1293.4
THIRU AR	53.45	53.7
THIRUMAL	2251.95	2177.85
THOMAS C	250.2	249.95
THYROCAR	700	699.25
[illegible]	[illegible]	[illegible]

V W Y Z

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

బీఎస్ఈలో ఎస్ఎంఈ షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
[illegible]	[illegible]	[illegible]

Dwaraka



'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో గ్రూప్‌ను చూడండి.

శ్రవణ కార్తె : జనవరి 24 నుంచి

తీగజాతి కూరగాయల విత్తనాలు నాటుకునే సమయమిదే!




జనవరి నెల చివరికొచ్చింది. చలి వెనకపట్టు పట్టింది. వేసవికాలంలో కూరగాయల కొరత లేకుండా ఉండాలంటే ఇప్పుడు తిరిగి విత్తనాలను నాటుకోవాలి. కొన్ని రకాలను మినహాయిస్తే, దాదాపు అన్ని రకాలను నాటుకోవచ్చు.

మిర్చి, క్యాబేజి, క్యాలీఫ్లవర్, క్యారెట్, చిక్కుడు, టమాటా వంటివి ప్రధానంగా శీతాకాలపు పంటలు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వీటిని వర్షాకాలంలో కూడా పండించొచ్చు. కానీ, వేసవి కాలంలో పండించటం కష్టం.

తగిన నీడ ఏర్పాటు చేసినా, మిర్చి, టమాటాలలో పూత నిలవదు, కాపు రాదు! ఇప్పుడు వీటి జోలికి పోకపోవడమే మంచిది! చిక్కుడు మినహా అన్ని రకాల తీగజాతి కూరగాయల విత్తనాలను నాటుకోవచ్చు. బీర, సొర, కాకర, దోస, పొట్ల వంటివి నాటుకోవచ్చు. గుమ్మడి నాటకూడదు.

బెండ, గోరుచిక్కుడు, వంగ, అలసంద వంటివి నాటుకోవచ్చు.

ఇప్పుడు క్యాబేజి, క్యాలీఫ్లవర్ నారు దొరికితే నాటుకోవచ్చు. ఇప్పుడు నారు పోసి నాటుకోవాలంటే ఆలస్యం అవుతుంది. ఫిబ్రవరి మొదటి వారంలోగా అన్ని రకాల విత్తనాలను, నార్లను నాటుకోవాలి. యథావిధిగా మట్టిలో తగినంత ఎరువు ఉన్నదీ లేనిదీ చూసుకోవాలి. నాలుగైదు రకాలను నాటి ఊరుకోకండి. వీలైనన్ని ఎక్కువ రకాలను నాటుకోవాలి. ఇరవై రకాలను నాటుకుంటే, అందులో కొన్ని పోయినా, మరికొన్ని కాస్తాయి! వాతావరణం మన చేతిలో ఉండదు. కొన్ని విషయాలలో మనం ఏమీ చెయ్యలేం, ముందు జాగ్రత్తలు తీసుకోవడం మినహా! అందుకని ఎక్కువ రకాలను నాటుకోవాలి ('మిద్దె తోట – చీడ పీడలు' వాట్సప్ గ్రూప్‌లో సభ్యులు కాదలచినవారు పేరు, వాట్సప్ నంబర్‌ను ఈ కింది నెంబర్‌కు మెసేజ్ చేయవచ్చు).



- తుమ్మేటి రఘోత్తమరెడ్డి (90001 84107), సేంద్రియ 'మిద్దె తోట'ల నిపుణుడు

జీరిక నీరా, బెల్లం భేష్!

● తాటి కన్నా 6-7 రెట్ల నీరా దిగుబడినిస్తున్న జీరిక చెట్లు ● తాటి చెట్లకు మాదిరిగానే ఎరువులు, మందులు, నీరు వేయనవసరం లేదు ● ఆరేళ్లకే నీరా దిగుబడి ప్రారంభం.. 25 ఏళ్ల వరకు రోజుకు సగటున 30-40 లీటర్ల నీరా దిగుబడి ● ఛత్తీస్‌గఢ్‌లోని జగ్‌దల్‌పూర్ ప్రాంతంలో గిరిజనులకు జీరిక నీరా, కల్లే ప్రధాన ఆదాయమార్గం ● ఏటా రూ. 30 వేల నుంచి 40 వేల వరకు ఆదాయం ● తెలంగాణలో , ఆంధ్రప్రదేశ్‌లో సముద్రతలం నుంచి 250 ఎం.ఎస్.ఎల్. కన్నా ఎత్తయిన ప్రాంతాల్లో సాగుకు అనుకూలం ● తాటి బెల్లంలో మాదిరిగానే జీరిక బెల్లంలోనూ పోషకాలు, ఔషధ గుణాలు



జీరిక కాయలు

తాటి బెల్లం ద్వారా ఒనగూడే ఔషధ గుణాలు, పోషక విలువలు ఎన్నో. అనాదిగా మన పెద్దలు వాడుతున్న ఆరోగ్యదాయకమైనది తాటి బెల్లం. ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో ఇటీవల కాలంలో తాటి బెల్లానికి, ఆరోగ్య పానీయంగా తాటి నీరా వాడకానికి మళ్లీ ఆదరణ పెరుగుతోంది. తాటి బెల్లాన్ని సాధారణ పంచదార, బెల్లానికి బదులుగా వాడటం ఎంతో ఆరోగ్యదాయకమని వైద్యులు చెబుతున్నారు. అందువల్లే మధుమేహ రోగులు సైతం తాటి బెల్లాన్ని నిక్షేపంగా వాడుతున్నట్లు చెబుతున్నారు.

అయితే, ఈ బెల్లం తయారీకి అవసరమైన నీరా ఉత్పత్తి తాటి చెట్టుకు రోజుకు 5–6 లీటర్లకు మాత్రమే పరిమితం. తాటి నీరా కన్నా జీరిక నీరా రుచికరమైనది. తాటి బెల్లానికి దీటుగా ఔషధగుణాలు, పోషకాలు కలిగి ఉండే 'జీరిక' బెల్లాన్ని భారీ ఎత్తున ఉత్పత్తి చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు ఇటీవల వేలాది జీరిక మొక్కలను నర్సరీల నుంచి సేకరించి తమ నియోజకవర్గాల్లో పంపిణీ చేస్తున్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఇటీవల నల్లగొండ జిల్లా మల్లేపల్లిలో తాటి పరిశోధనా స్థానాన్ని మంజూరు చేసింది. ఈ కేంద్రంలో జీరిక చెట్లపై కూడా పరిశోధన ప్రారంభించటం మేలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ఈ జీరిక చెట్ల మాదిరిగానే కనిపించే అలంకారప్రాయమైన మరో జాతి చెట్లు కూడా ఉన్నాయని, వీటిని కేవలం అందం కోసం లాండ్‌స్కేపింగ్‌లో వాడుతున్నారని.. నీరా కోసం జీరిక మొక్కలను నాటుకునే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గిరిజనుల కల్పవృక్షం.. జీరిక

జీరిక చెట్టును సుల్ఫి లేదా ఫిష్‌టైల్ పామ్ అని కూడా పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో గిరిజనులు సాంప్రదాయకంగా జీరిక నీరాను, కల్లును ఆరోగ్యపానీయంగా వాడుతున్నారు. తాటి చెట్ల నీరా/కల్లు కన్నా రుచికరమైనది కావడంతో జీరిక నీరా/కల్లుకు జగదల్‌పూర్, బస్తర్ ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువగా ఉంది. ఇది గిరిజనులకు ముఖ్యమైన ఆదాయ వనరుగా కూడా ఉంది.

నాటిన ఆరేళ్ల నుంచే నీరా దిగుబడి..

జీరిక మొక్క నాటిన ఆరేళ్ల నుంచి 25 ఏళ్ల వరకు.. ఒక్కో జీరిక చెట్టు నుంచి సగటున 30–40 లీటర్ల నీరాను సేకరిస్తున్నారు. భూసారం తదితర సానుకూలతల వల్ల కొన్ని చెట్ల నుంచి రోజుకు 50–60 లీటర్ల వరకు నీరాను సేకరిస్తూ, ఆరోగ్య పానీయంగా వినియోగిస్తున్నారు. బియ్యాన్ని ఉడికించి అన్నం వండుకోవడానికి నీటికి బదులు జీరిక నీరాను గిరిజనులు వినియోగిస్తుంటారు. తద్వారా కేన్సర్, తదితర జబ్బులు నయమవుతున్నాయని కూడా గిరిజన సంప్రదాయ వైద్యులు విశ్వసిస్తున్నారు. ఆ విధంగా జీరిక నీరా/కల్లు ఛత్తీస్‌గఢ్ – ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జగదల్‌పూర్, మారేడుమిల్లి ప్రాంతాల్లో గిరిజనులకు ప్రధాన ఆదాయ వనరుగానే కాకుండా.. వారి ఆహార సంస్కృతిలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. అందువల్లనే గిరిజనులు జీరిక చెట్టును కల్పవృక్షంగా కొలుస్తారు.

ఆడ పిల్లకు ఒక్కో చెట్టు చొప్పున పుట్టింటి వాళ్లు కానుకగా ఇచ్చే అలవాటు కూడా అక్కడ అనాదిగా ఉన్నది. ఈ కారణంగా ఒక్కో చెట్టు నుంచి ఏటా రూ. 30 వేల నుంచి 40 వేల వరకు గిరిజనులు ఆదాయం పొందుతుండటం విశేషం.

మైదాన ప్రాంతాలకు జీరిక అనువైనదేనా?

జీరిక చెట్లు ప్రస్తుతం ఆంధ్ర–ఒడిశా– ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని ఎత్తయిన గిరిజన ప్రాంతాల్లో సహజసిద్ధంగా పెరుగుతున్నాయి. తాటి చెట్ల కన్నా 6–7 రెట్ల నీరా దిగుబడినిస్తున్నాయి. అయితే, మైదాన ప్రాంతాల్లో ఈ చెట్లు ఇదే మాదిరిగా అధికంగా నీరా దిగుబడిని ఇస్తాయా? లేదా? అన్నది వేచి చూడాలని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన తూర్పు గోదావరి జిల్లా పందిరిమామిడిలోని తాటి పరిశోధనా స్థానం సీనియర్ ఆహార శుద్ధి శాస్త్రవేత్త పి. సి. వెంగయ్య 'సాగుబడి' తో చెప్పారు. అనాదిగా జీరిక పెరుగుతున్న మారేడుమిల్లి తదితర ప్రాంతాలు సముద్ర తలం నుంచి 250 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. ఈ విధంగా చూస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రాంతాలు వీటి కన్నా ఎత్తయినవే. కాబట్టి, సముద్ర తీరానికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో మినహా ఎత్తయిన మైదాన ప్రాంతాల్లో కూడా జీరిక సాగు లాభదాయకంగానే ఉండొచ్చని ఆయన చెబుతున్నారు.

అయితే, జీరిక నీరా దిగుబడిపై వాతావరణం, భూములు.. ఇంకా ఇతర అంశాల ప్రభావం ఏమేరకు ఉంటుందో శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సి ఉంది. జగదల్‌పూర్‌లో రెండేళ్ల క్రితమే జీరికపై ప్రత్యేక పరిశోధనా స్థానం ఏర్పాటైంది. దీనిలో పరిశోధనలు ప్రస్తుతం శైశవ దశలోనే ఉన్నాయి. వెంగయ్య తమ పరిశోధనా స్థానంలో గత ఏడాది గిరిజనుల నుంచి సేకరించిన జీరిక మొక్కలను నాటారు. మైదాన ప్రాంతాల్లో కూడా నీరా దిగుబడి బాగా ఉందని రుజువైతే.. ఆరోగ్యదాయకమైన పానీయం నీరాతో పాటు ఔషధగుణాలుండే సహజ జీరిక బెల్లాన్ని కూడా భారీ మొత్తంలో ఉత్పత్తి చేసి, అశేష ప్రజానీకానికి అందుబాటులోకి తేవటం సాధ్యమవుతుందని వెంగయ్య అన్నారు. తాటి బెల్లంలో మాదిరిగా జీరిక బెల్లంలో కూడా గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి.. సాధారణ పంచదార/బెల్లానికి బదులు తాటి/జీరిక బెల్లాన్ని ఏ వయస్సు వారైనా, మధుమేహ రోగులు సైతం వాడొచ్చని ఆయన తెలిపారు.



100 లీటర్ల జీరిక నీరాతో 15 కిలోల బెల్లం

తాటి నీరా కన్నా జీరిక నీరా రుచికరమైనది కూడా. జీరిక నీరాతో తాటి నీరాతో మాదిరిగానే 12–15% బెల్లం రికవరీ(100 లీటర్ల నీరాను ఉడికించితే 12–15 కిలోల బెల్లం ఉత్పత్తి) వస్తున్నదని వెంగయ్య జరిపిన ప్రాథమిక అధ్యయనంలో తేలింది. అయితే, ఔషధగుణాలు, ఖనిజలవణాలు, పోషకాల విషయంలో కూడా తాటి, జీరిక నీరాల మధ్య తేడా ఏమైనా ఉందా అనేది పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉన్నప్పటికీ.. పెద్దగా తేడా ఉండకపోవచ్చు అని వెంగయ్య (94931 28932) తెలిపారు.

తాటి - జీరిక - ఈత మధ్య తేడా

వివరం	తాటి	జీరిక	ఈత
మొక్క నాటిన ఎన్నేళ్ల నుంచి నీరా దిగుబడి?	15 ఏళ్లు	ఆరేళ్లు	ఆరేళ్లు
రోజుకు నీరా దిగుబడి (లీటర్లలో)	5-6 లీ.	30-40 లీ.	1-2 లీ.
బెల్లం రికవరీ	10.5-15%	12-14%	9-12%
చెట్ల ఎత్తు	20 అడుగులపైన	10-12 అడుగులు	8-10 అడుగులు




పి.వెంగయ్య

జీరిక చెట్ల వద్ద రాలిపడిన కాయల ద్వారా మొక్కలు మొలుస్తుంటాయి. గిరిజనులు వాటిని తెచ్చి మారేడుమిల్లి, రంపచోడవరం ప్రాంతాల్లో వారపు సంతల్లో విక్రయిస్తుంటారు. జీరిక చెట్ల కాయలు పెద్ద రేగు కాయల సైజులో ఉంటాయి. జీరిక చెట్లలో వైవిధ్యం, అవి పెరుగుతున్న భూములను బట్టి వాటి కాయల రంగులో తేడా కనిపిస్తోంది. ఈ కాయల నుంచి విత్తనాలను సేకరించి.. నర్సరీలో మొక్కలను పెంచుకొని నాటుకోవటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

- పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

4న కర్ణాటకలో 'అటవీ కృషి'పై తెలుగు రైతులకు శిక్షణ



మెట్ట పొలాల్లో సంప్రదాయ అటవీ వ్యవసాయ పద్ధతుల్లో సిరిధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయ తోటల సాగుపై ఫిబ్రవరి 4(ఆదివారం)న స్వతంత్ర ఆహార, అటవీ వ్యవసాయ నిపుణులు డా. ఖాదర్(మైసూరు) కర్ణాటకలోని తన వ్యవసాయ క్షేత్రంలో తెలుగు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. కొర్రలు, అండుకొర్రలు, అరికలు, సామలు, ఊదలు వంటి సిరిధాన్యాలను మిక్సీ ద్వారా శుద్ధి చేసుకునే పద్ధతితోపాటు అటవీ చైతన్యం అనే ద్రవరూప ఎరువు తయారీ/వినియోగ పద్ధతులపై కూడా శిక్షణ ఇస్తారు. రైతులకు మైసూరుకు దగ్గరలోని హెచ్.డి.కొటె తాలూకా హెచ్.డి. కొటె హేండ్ పోస్ట్‌లోని వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి కేంద్రం(ఎం.వై.ఆర్.ఎ.డి.ఎ.)లో రైతులకు శిక్షణ ఇస్తారు. కాబిని డ్యామ్ సమీపంలోని బీదరహళ్లిలో డా. ఖాదర్ వ్యవసాయ క్షేత్ర సందర్శన ఉంటుంది. ఆసక్తి గల రైతులు 81234 00262 నంబరుకు పేరు, ఇతర వివరాలు పంపి.. ఫిబ్రవరి 2 లోగా ఫీజు చెల్లించి, పేర్లు నమోదు చేయించుకోవాలని నిర్వాహకుడు బాలన్ తెలిపారు. ఇతర వివరాలకు 097405 31358 నంబరులో సంప్రదించవచ్చు.

28న కొర్నెపాడులో ప్రకృతి సేద్యంపై శిక్షణ


గుంటూరు జిల్లా కొర్నెపాడులో జనవరి 28(ఆదివారం)న ప్రకృతి వ్యవసాయంలో వరి, మిరప, కూరగాయల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సీనియర్ రైతులు లావణ్యా రమణారెడ్డి, ధర్మారం బాజీ శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు వై. వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలకు.. 97053 83666, 96767 97777, 0863–2286255

27న హైదరాబాద్‌లో 'రైతుల వంగడాల' ప్రదర్శన

ఏడు దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో రైతు శాస్త్రవేత్తలు అభివృద్ధిపరిచిన అపురూపమైన వంగడాల ప్రదర్శన, కార్యశాల జనవరి 27న హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనుంది. న్యూఢిల్లీలోని రైతుల వంగడాలు, మేధోహక్కుల పరిరక్షణ ప్రాధికార సంస్థ ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, లక్షద్వీప్‌లలో తాము అభివృద్ధి చేసిన అపురూపమైన అనేక వంగడాలను రైతు శాస్త్రవేత్తలు ఈ ప్రదర్శనలో ప్రదర్శనకు పెట్టనున్నారు.

2-4 తేదీల్లో హైదరాబాద్‌లో దేశీ విత్తనోత్సవం


● 2న ముఖ్యఅతిథిగా పాల్గొననున్న పద్మశ్రీ సుభాష్ పాలేకర్



ప్రకృతి వ్యవసాయానికి ఆధారం దేశీ విత్తనం. అంతరించిపోతున్న దేశీ విత్తనాలను గత కొన్నేళ్లుగా సంరక్షిస్తూ రైతులకు అందుబాటులోకి తెస్తున్న సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విజయ్‌రామ్ వచ్చే నెలలో భారీ స్థాయి విత్తనోత్సవాన్ని నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం ఆవరణ(ఇందిరాపార్కు ఎదుట)లో ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో దేశీ విత్తనోత్సవాన్ని నిర్వహించ నున్నారు. సుమారు 200 దేశీ వరి రకాల విత్తనాలను సేకరించిన విజయరామ్.. ప్రతి రైతుకూ రెండేసి రకాలను ఉచితంగా అందించనున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న సుమారు 100 మంది దేశీ విత్తన పరిరక్షకులు తమ వద్ద ఉన్న అరుదైన ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, సిరిధాన్యాలు, ఇతర పంటల దేశీ విత్తనాలను రైతులకు అందుబాటులోకి తేనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 10 వేల మంది రైతులు పాల్గొంటారని విజయరామ్ తెలిపారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయోద్యమ పితామహుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఫిబ్రవరి 2వ తేదీన విత్తనోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ప్రవేశం, భోజనం ఉచితం. వివరాలకు.. 040 27654337, 27635867 నంబర్లలో సంప్రదించవచ్చు.




దిరిశెన / నిద్రగన్నేరు




బోడసరం



చిన్న పల్లేరు



బిళ్ల గన్నేరు



తమలపాకు



దిరిశెన ఆకులతో దానిమ్మ తెగుళ్లకు చెక్!

ఏయూ వృక్ష శాస్త్ర విభాగం పరిశోధనలో సత్ఫలితాలు

దిరిశెన తదితర మొక్కలతో బాక్టీరియా, శిలీంధ్ర తెగుళ్ల నియంత్రణ

ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో, తెలంగాణ రాష్ట్రంలో అనేక జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో విస్తారంగా సాగయ్యే దానిమ్మ పంటకు వివిధ రకాల బాక్టీరియా, శిలీంధ్ర మచ్చ తెగుళ్ల బెడద ఎక్కువ. ముఖ్యంగా బాక్టీరియా ఆకుమచ్చ తెగులు.. సర్కోస్పోరా ఆకుమచ్చ, ఆంత్రాక్నోస్, తదితర శిలీంధ్ర మచ్చ తెగుళ్లు సోకుతున్నాయి. ఈ తెగుళ్ల వల్ల ఆకులు, పండ్లపై నల్లటి మచ్చలు ఏర్పడటం, గింజలు పాడవడం వల్ల రైతులకు తీవ్ర దిగుబడుల నష్టం జరుగుతున్నది. ఈ తెగుళ్లకు వాడుతున్న రసాయనిక మందుల అవశేషాల వల్ల వినియోగదారుల ఆరోగ్యం దెబ్బతింటున్నది.

ఈ నేపథ్యంలో ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని వృక్ష శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ డి.సంధ్యా దీపిక పర్యవేక్షణలో పరిశోధకురాలు మొట్టాడి లక్ష్మిశ్రీ రైతులకు సులువుగా అందుబాటులో ఉండే మొక్కల కషాయాలతో దానిమ్మలో బాక్టీరియా, శిలీంధ్ర తెగుళ్ల నియంత్రణపై గత రెండున్నరేళ్లుగా చేసిన ప్రయోగాలు ఫలించాయి. విభిన్న మొక్కలతో పాటు మట్టిలో ఉండే బాసిల్లస్ జాతికి చెందిన బాక్టీరియాలతో దానిమ్మ తెగుళ్లను నియంత్రించే విధానాలను అభివృద్ధి చేశారు. ఇందుకు గాను లక్ష్మిశ్రీకి ఏయూ డాక్టరేట్ అందించింది.

మన ఊళ్లలో విరివిగా కనిపించే 50 రకాల పశువుల తినని మొక్కలను ఆమె పరిశోధనకు ఎంపిక చేసుకొని, ప్రయోగశాల(ఇన్‌విట్రో పద్ధతి)లో ప్రయోగాలు జరిపారు. 5 రకాల మొక్కలు చక్కని ఫలితాలనిచ్చాయి. దిరిశెన/నిద్రగన్నేరు (Albezzia lebbeck) చెట్టు ఆకులతో బాక్టీరియా, శిలీంధ్ర తెగుళ్లను సమర్థవంతంగా నియంత్రించవచ్చని నిర్ధారణకు వచ్చినట్లు డా. లక్ష్మిశ్రీ తెలిపారు. చిన్న పల్లేరు (Tribulus terristris) మొక్కతో శిలీంధ్ర తెగుళ్లను అరికట్టవచ్చని తేలిందన్నారు. వీటితోపాటు బిళ్ల గన్నేరు (Catharanthus roseus) కాండం, ఆకులు.. బోడసరం (Shperanthus indicus) మొక్క, తమలపాకు (beetle wine)లతో కూడా దానిమ్మ తెగుళ్ల నియంత్రణలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

రైతులకు భారం కాకుండా, రసాయన రహితంగా దానిమ్మ పంట సాగు జరగాలనేది ఈ ప్రయోగం ప్రధాన లక్ష్యమని ఆచార్య డి.సంధ్యా దీపిక తెలిపారు. దిరిశెన ఆకుల్లోని లుపియోల్ అనే రసాయనిక సమ్మేళనం వలన బాక్టీరియా నియంత్రణ సాధ్యపడినట్లు గుర్తించామన్నారు.

మట్టిలో ఉండే బేసిల్లస్ జాతికి చెందిన ఎనిమిది రకాల సూక్ష్మజీవులను సేకరించి ప్రయోగాలు చేశారు. వీటిలో నాలుగు బాసిల్లస్ సూక్ష్మజీవులు దానిమ్మకు వ్యాపించిన బాక్టీరియాను నాశనం చేయడంలో సమర్థవంతంగా పనిచేశాయి.

అక్టోబర్ నాటికి కషాయం మోతాదులు తెలుస్తాయి!

దిరిసెన తదితర ఐదు రకాల మొక్కల కషాయాలను, బాసిల్లస్ సూక్ష్మజీవులను ఈ ఏడాది మే నెల నుంచి రైతుల దానిమ్మ తోటల్లో ప్రయోగాత్మకంగా పిచికారీ చేసి, అధ్యయనం చేయబోతున్నాం. అక్టోబర్ నాటికి తుది ఫలితాలు వస్తాయి. ఏయే తెగుళ్లకు ఏయే మొక్కల కషాయాన్ని ఎంతెంత మోతాదులో వాడాల్సిందీ తెలుస్తుంది. భవిష్యత్తులో మరింత లోతైన పరిశోధనలు జరపాలని ఉంది.



డా. మొట్టాడి లక్ష్మిశ్రీ, వృక్ష శాస్త్ర విభాగం, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం

- వేదుల నరసింహం
సాక్షి, ఏయూ క్యాంపస్



హర్మన్‌ప్రీత్ కౌర్‌తో 'సియట్' ఒప్పందం

భారత మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో ప్రఖ్యాత టైర్ల ఉత్పత్తుల సంస్థ 'సియట్' జత కట్టింది. ఈ సంస్థకు అంబాసిడర్‌గా ఎంపికైన హర్మన్... ఇక ముందు తన బ్యాట్‌పై సియట్ లోగోను ప్రదర్శిస్తుంది. రోహిత్ శర్మ, అజింక్య రహానేలతో ప్రస్తుతం ఒప్పందం కొనసాగిస్తున్న సియట్ ఒక మహిళా క్రికెటర్ బ్యాట్‌కు ఎండార్స్ చేయడం ఇదే మొదటిసారి. గత ఏడాది హర్మన్ వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాపై 171 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. మహిళల బిగ్‌బాష్ టి20 లీగ్‌లో ఆడిన తొలి భారత క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది.

అయ్యో... జొకోవిచ్!

కొరియా యువతార హైన్ చుంగ్ చేతిలో అనూహ్య ఓటమి



జొకోవిచ్

కొంతకాలంగా ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతోన్న ప్రపంచ మాజీ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్‌కు కొత్త ఏడాదీ కలిసి రాలేదు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈ మాజీ విజేత ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టాడు. 21 ఏళ్ల కొరియా భవిష్యత్ తార హైన్ చుంగ్ అసమాన ఆటతీరుకు సెర్బియా యోధుడు తలవంచక తప్పలేదు. మూడేళ్ల క్రితం ఇదే వేదికపై తన ఆరాధ్య ఆటగాడి చేతిలో వరుస మూడు సెట్‌లలో ఓడిపోయిన చుంగ్ ఈసారి ఫలితాన్ని తారుమారు చేశాడు. జొకోవిచ్‌ను వరుస సెట్‌లలో మట్టికరిపించి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని సాధించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలో క్వార్టర్ ఫైనల్ చేరుకున్న తొలి కొరియా ప్లేయర్‌గా కొత్త చరిత్ర లిఖించాడు.



చుంగ్

మెల్‌బోర్న్: ఎలాంటి అంచనాలు లేకుండా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగు పెట్టిన అన్‌సీడెడ్ ఆటగాళ్లు హైన్ చుంగ్ (దక్షిణ కొరియా), టెనిస్ సాండ్‌గ్రెన్ (అమెరికా) సంచలనాల మోత మోగించారు. మాజీ చాంపియన్, మాజీ నంబర్‌వన్, 14వ సీడ్ జొకోవిచ్‌ను హైన్ చుంగ్... ఐదో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)ను సాండ్‌గ్రెన్ బోల్తా కొట్టించి తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో చుంగ్ 3 గంటల 21 నిమిషాల్లో 7–6 (7/4), 7–5, 7–6 (7/3)తో జొకోవిచ్‌పై... సాండ్‌గ్రెన్ 3 గంటల 54 నిమిషాల్లో 6–2, 4–6, 7–6 (7/4), 6–7 (7/9), 6–3తో థీమ్‌పై గెలుపొంది క్వార్టర్ ఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. సాండ్‌గ్రెన్ 20 ఏళ్లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ఆడిన తొలిసారే క్వార్టర్ ఫైనల్‌కు చేరిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు.

ప్రపంచ 58వ ర్యాంకర్ చుంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ ఏకంగా తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. మూడు సెట్‌లలోనూ జొకోవిచ్ వరుసగా 0–4తో, 1–4తో, 1–3తో వెనుకబడ్డాడు. సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ, జొకోవిచ్‌కు గట్టిపోటీనిచ్చిన చుంగ్ కీలక దశలో పాయింట్లు రాబట్టి విజయాన్ని దక్కించుకున్నాడు. 'రాకెట్ పట్టిన కొత్తలో నేను జొకోవిచ్ ఆటను అనుకరించేవాణ్ని. ఎందుకంటే అతను నాకు ఆరాధ్య ఆటగాడు. ఈ రోజు అతడినే ఓడించానంటే నమ్మశక్యంగా లేదు. అంతా కలలా ఉంది' అని చుంగ్ మ్యాచ్ అనంతరం వ్యాఖ్యానించాడు.

ఫెడరర్ జోరు: మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), 19వ సీడ్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్) అలవోక విజయాలతో క్వార్టర్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఫెడరర్ 6–4, 7–6 (7/3), 6–2తో ఫక్సోవిక్స్ (హంగేరి)పై, బెర్డిచ్ 6–1, 6–4, 6–4తో ఫాగ్‌నిని (ఇటలీ)పై నెగ్గారు.

హలెప్ అలవోకగా: మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా) 6–3, 6–2తో ఒసాకా (జపాన్)పై సునాయాసంగా గెలుపొందగా... 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6–3, 6–2తో ఎనిమిదో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్)ను ఓడించింది. మాజీ చాంపియన్, 21వ సీడ్ కెర్బర్ (జర్మనీ) 4–6, 7–5, 6–2తో సు వె సెయి (చైనీస్ తైపీ)పై, ఆరో సీడ్ ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6–7 (5/7), 6–3, 6–2తో 20వ సీడ్ బార్బరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరారు.

పోరాడి ఓడిన బోపన్న, దివిజ్ జోడీలు: పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పదో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–వాసెలిన్ (ఫ్రాన్స్) జంట 4–6, 7–6 (7/5), 3–6తో ఏడో సీడ్ మరాచ్ (ఆస్ట్రియా)–పావిచ్ (క్రొయేషియా) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. దివిజ్ శరణ్ (భారత్)–రాజీవ్ రామ్ (అమెరికా) ద్వయం 6–3, 6–7 (4/7), 4–6తో టాప్ సీడ్ మార్సెలో మెలో (బ్రెజిల్)–కుబోట్ (పోలాండ్) జంట చేతిలో పరాజయం పొందింది.



సానుకూల దృక్పథంతో ఆడండి

'సఫారీ' టూర్‌కి వెళ్లనున్న మిథాలీ జట్టుకు సచిన్ కిటుకులు

ముంబై: క్లిష్టమైన దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళల జట్టులో కొండంత ఆత్మవిశ్వాసం నింపాడు సచిన్ టెండూల్కర్. ఈ బ్యాటింగ్ దిగ్గజం సోమవారం బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో మిథాలీ రాజ్ బృందంతో భేటీ అయ్యాడు. విశేషానుభవం ఉన్న 'మాస్టర్' సుమారు గంటకుపైగా వారితో ముచ్చటించాడు. అనవసర ఒత్తిడిని తలకెత్తుకోకుండా సానుకూల దృక్పథంతో ఆడాలని సూచించాడు. సఫారీ పిచ్‌లపై ఎలా సన్నద్ధం కావాలో వివరించాడు. అక్కడి పరిస్థితుల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నాడు. పొరపాట్లకు తావివ్వకుండా ఆడాలని చెప్పాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భారత మహిళల జట్టు మూడు వన్డేలు, ఐదు టి20ల సిరీస్‌లో తలపడుతుంది.

పంజాబ్ రాయల్స్ గెలుపు

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్)లో పంజాబ్ రాయల్స్ నాలుగో విజయం సాధించింది. సోమవారం జరిగిన పోరులో పంజాబ్ 5–2తో ముంబై మహారథిపై గెలిచింది. దీపక్ పూనియా (పంజాబ్; 92 కేజీలు) 6–5తో సత్యవర్త్‌పై, సెలెన ఫంటా (పంజాబ్; 76 కేజీలు) 2–0తో వెస్కన్ సింధియాపై, పూజ (పంజాబ్; 57 కేజీలు) 4–2తో ఒడునయో ఫొలసడేపై, పెట్రియష్విలి (పంజాబ్; 125 కేజీలు) 7–0తో సతేందర్ మలిక్‌పై, గ్రిగొర్జెవా (పంజాబ్; 62 కేజీలు) 10–2తో సాక్షి మలిక్‌పై గెలుపొందారు. ఇలియాస్ (పంజాబ్; 65 కేజీలు) 6–7తో రమనోవ్ చేతిలో, ఉత్కర్ష్ కాలే (పంజాబ్; 57 కేజీలు) 0–10తో ఇదెనబటిన్ బెక్‌బయర్ చేతిలో పరాజయం చవిచూశారు.

టి20లోనూ పాకిస్తాన్ చిత్తు

కివీస్‌ను గెలిపించిన మున్రో



మున్రో

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌కు గురైన పాకిస్తాన్ ఆట టి20ల్లోనూ మారలేదు. ఫలితంగా తొలి టి20లోనూ ఆ జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.3 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (41 బంతుల్లో 41; 1 ఫోర్, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా... హసన్ అలీ (23) ఫర్వాలేదనిపించాడు. సౌతీ, రాన్స్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 15.5 ఓవర్లలోనే 2 వికెట్లకు 106 పరుగులు చేసి విజయాన్నందుకుంది. 8 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయినా... 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కొలిన్ మున్రో (43 బంతుల్లో 49 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), బ్రూస్ (26), రాస్ టేలర్ (22 నాటౌట్) కలిసి జట్టును గెలిపించారు. ఇరు జట్ల మధ్య రెండో టి20 మ్యాచ్ గురువారం ఆక్లాండ్‌లో జరుగుతుంది.

అర్ధరాత్రి దాకా చూడాల్సిన పనిలేదు

- ఐపీఎల్ రాత్రి మ్యాచ్‌లు 7 గంటలకే
- ఏప్రిల్ 7 నుంచి మే 27 వరకు లీగ్
- ముంబైలో తొలి, ఫైనల్ మ్యాచ్

న్యూఢిల్లీ: ఇకపై ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం అర్ధరాత్రిదాకా మేల్కొని ఉండాల్సిన అవసరం లేదు. ఎందుకంటే గతంలో మాదిరిగా రాత్రి మ్యాచ్‌లు 8 గంటలకు బదులు ఈ సీజన్‌లో 7 గంటలకే మొదలవుతాయి. సాయంత్రం మ్యాచ్ కూడా మారింది. వేసవి తాపంలో 4 గంటలకు మొదలయ్యే మ్యాచ్ కోసం మధ్యాహ్నం 2 గంటలకే స్టేడియానికి చేరాల్సిన అవసరం లేదు. ఈ మ్యాచ్‌లను సాయంత్రం 5.30 గంటల నుంచి నిర్వహించాలని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పాలక మండలి నిర్ణయించింది.



ప్రసార సంస్థ వినతి మేరకు షెడ్యూల్ సమయాన్ని మార్చినప్పటికీ... యేటికేడు పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఈ మార్పు స్టేడియంలోని ప్రేక్షకులకు పెద్ద ఊరటనే చెప్పాలి. ఎండ తగ్గాక మొదటి మ్యాచ్ మొదలైతే... అర్ధరాత్రి కంటే ముందే రెండో మ్యాచ్ ముగుస్తుంది. ఇంటికి చేరే సమయం కలిసొస్తుంది. సోమవారం 11వ సీజన్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను పాలక మండలి ఖరారు చేసింది. ఏప్రిల్ 7 నుంచి మే 27 వరకు ఈ సీజన్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆనవాయితీ ప్రకారం డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టుకు చెందిన వాంఖెడే స్టేడియంలో తొలి, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. కింగ్స్ ఎలెవన్ జట్టు తమ హోం మ్యాచ్‌ల్లో నాలుగింటిని మొహాలీలో, మరో మూడు మ్యాచ్‌ల్ని ఇండోర్‌లో ఆడుతుంది. రాజస్తాన్ రాయల్స్ మ్యాచ్‌ల నిర్వహణపై హైకోర్టు (ఈ నెల 24) విచారణ అనంతరం నిర్ణయిస్తారు. ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే వేలానికి 578 మంది ప్లేయర్లు అందుబాటులో ఉన్నారు.

అశ్విన్ అజేయ శతకం

కర్ణాటకపై ఆంధ్ర గెలుపు

చెన్నై: బీసీసీఐ అండర్–23 సౌత్‌జోన్ వన్డే లీగ్‌లో ఆంధ్ర జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. కర్ణాటకతో సోమవారం మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలి మ్యాచ్ సెంచరీ హీరో అశ్విన్ హెబర్ (121 బంతుల్లో 137 నాటౌట్; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) ఈ మ్యాచ్‌లోనూ మరో భారీ శతకంతో జట్టుకు ఘనవిజయాన్ని అందించాడు. తొలుత కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 324 పరుగులు చేసింది. దేవ్ పడిక్కల్ (112; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో పాటు... నిష్కల్ (67; 6 ఫోర్లు), భరత్ (65; 4 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయడంతో జట్టు భారీ స్కోరు సాధించింది. ఆంధ్ర బౌలర్లలో హరిశంకర్ రెడ్డి, కేవీ శశికాంత్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం అశ్విన్ జోరుతో ఆంధ్ర 44.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 325 పరుగులు చేసింది. రికీ భుయ్ (52; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), చైతన్య (32 బంతుల్లో 61; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు.



అశ్విన్

వీరిపైనా ఆసక్తి ఉంది

ఐపీఎల్ వేలంలో కొత్త కుర్రాళ్లు ◆ అనుభవం లేకపోయినా ప్రత్యేక ప్రతిభ

ఐపీఎల్ వేలం అనగానే అందరి దృష్టి స్టార్ క్రికెటర్లపైనే ఉంటుంది. వారికి ఇన్ని కోట్లు... వీరికి ఇన్ని కోట్లు అనే చర్చ సహజం. సీనియర్లే కాకుండా దేశవాళీ క్రికెట్‌లో రాణించి కొంత గుర్తింపు పొందిన భారత క్రికెటర్లకు కూడా లీగ్‌లో మంచి విలువ పలుకుతుంది. సొంత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించకున్నా టి20 స్పెషలిస్ట్‌లుగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న మరి కొందరు విదేశీ క్రికెటర్లకూ డిమాండ్ ఉంది. అయితే వేలంలో సంచలనాలు కూడా అంతే సహజం. సీనియర్ స్థాయిలో ఎక్కడా అనుభవం లేకున్నా కరియప్పలాంటి క్రికెటర్లు కోటీశ్వరులుగా మారగలరు. ముడి సరుకులాంటి ప్రత్యేక ప్రతిభ ఉంటే చాలు. ఇదే తరహాలో ఐపీఎల్–2018లో కొన్ని ఆసక్తికర పేర్లు ముందుకు వచ్చాయి. వేలంలో వీరందరినీ కచ్చితంగా తీసుకుంటారనే హామీ లేకపోయినా... ఫ్రాంచైజీలు కొన్ని పేర్లు ప్రత్యేకంగా ఏరి కోరి జాబితాలో ఉంచడం వారిపై ఉన్న ఆసక్తిని సూచిస్తోంది.


–సాక్షి క్రీడావిభాగం

సందీప్ లమిచానే (నేపాల్)



17 ఏళ్ల సందీప్ ఈ వేలంలో పాల్గొంటున్న ఆటగాళ్లలో అందరి కంటే వయసులో చిన్నవాడు. నేపాల్‌లోని స్యాంగ్జాకు చెందిన ఈ లెగ్ స్పిన్నర్‌లో అపార ప్రతిభ ఉంది. రెండేళ్ల క్రితం అండర్–19 ప్రపంచ కప్‌లో 'హ్యాట్రిక్' సాధించి అందరి దృష్టిలో పడ్డాడు. ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచిన సందీప్ సత్తాను ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ గుర్తించాడు. దాంతో అతడిని క్లార్క్ సిడ్నీలోని తన సొంత అకాడమీలో చేర్పించుకొని ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. సిడ్నీ వెస్ట్రన్ సబ్‌అర్బ్స్ జట్టు తరఫున ఆడే అవకాశం కల్పించి సందీప్ ఆటకు మరింత మెరుగులు దిద్దాడు. తన లెగ్ స్పిన్ బౌలింగ్‌పై షేన్‌వార్న్ ప్రశంసలు కూడా పొందిన ఇతడిని ఐపీఎల్‌లో ఏదైనా ఫ్రాంచైజీ ఎంచుకునేందుకు మంచి అవకాశాలు ఉన్నాయి.

హమ్జా తారిఖ్ (కెనడా)



పాకిస్తాన్‌లోని కరాచీలో పుట్టిన ఈ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్రికెట్ కోసం కెనడా తరలి వెళ్లాడు. కెనడా అండర్–19 స్థాయి నుంచే ఆ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వికెట్ కీపరే అయినా బ్యాటింగ్ శైలి రికీ పాంటింగ్ తరహాలో ఉంటుందని అతనిపై ప్రశంసలు కురిశాయి. ఇతని ఆటను చూసి ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో తీసుకుంది. గత సెప్టెంబర్‌లో ఆ జట్టు లీగ్‌లో విజేతగా నిలవడంలో చురుకైన వికెట్ కీపింగ్‌తో హమ్జా కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ వేలంలో కూడా కోల్‌కతా జట్టే అతడిని ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

బెన్ మెక్‌డెర్మాట్ (ఆస్ట్రేలియా)



నాటి ఆసీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ క్రెయిగ్ మెక్‌డెర్మాట్ కుమారుడే బెన్. తండ్రి అడుగు జాడల్లో కాకుండా ఇతను వికెట్ కీపింగ్‌ను ఎంచుకున్నాడు. టి20ల్లో 145 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు సాధిస్తున్న 23 ఏళ్ల బెన్‌కు చక్కటి రికార్డు ఉంది. గత ఏడాది బిగ్‌బాష్ లీగ్‌లో హోబర్ట్ జట్టు తరఫున ఆడుతూ 52 బంతుల్లోనే 114 పరుగులు చేసి బెన్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు

జోఫ్రా ఆర్చర్ (ఇంగ్లండ్)



నిలకడగా 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తున్న ఫాస్ట్ బౌలర్ ఇతను. వెస్టిండీస్‌లో పుట్టి ఆ జట్టు తరఫున అండర్–19 స్థాయిలో ఆడిన ఆర్చర్... గత ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు ఆడిన క్రిస్ జోర్డాన్ ప్రోత్సాహంతో ఇంగ్లండ్ తరలి వెళ్లాడు. టి20ల్లో డెత్ ఓవర్ల బౌలింగ్ స్పెషలిస్ట్‌గా 22 ఏళ్ల ఆర్చర్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం బిగ్‌బాష్ లీగ్‌లో 15 వికెట్లతో రెండో స్థానంలో ఉన్న ఇతనిపై అన్ని ఫ్రాంచైజీల దృష్టి పడింది.

ర్యాన్ నినాన్ (ఆస్ట్రేలియా)



ఇతని నేపథ్యం ఆసక్తికరం. కేరళలోని తిరువనంతపురానికి చెందిన 32 ఏళ్ల నినాన్ 2011 ఐపీఎల్‌లో బెంగళూరు తరఫున ఆడాడు కూడా. రంజీల్లో గోవాకు ప్రాతినిధ్యం వహించిన ఇతను ఉద్యోగాన్వేషణలో ఆస్ట్రేలియా తరలి వెళ్లాడు. అక్కడి ఫస్ట్ డివిజన్ స్థాయి, క్లబ్ క్రికెట్ ఆడుతూ టి20ల్లో మంచి ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. గత జూలైలో ఆస్ట్రేలియా శాశ్వత వీసా లభించింది. దాంతో వచ్చే సీజన్‌లో బిగ్‌బాష్ ఆడే అవకాశాలు కూడా మెరుగయ్యాయి. దూస్రా కూడా వేయగల ఆఫ్‌స్పిన్నర్ అయిన నినాన్ ఇప్పుడు ఆస్ట్రేలియా ఆటగాడిగా ఐపీఎల్ వేలంలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు.

ఐపీఎల్ వేలం తుది జాబితా సిద్ధం చేయడానికి ముందు అన్ని ఫ్రాంచైజీలు గతంలో ఐపీఎల్ ఆడని, ప్రత్యేక ప్రతిభ ఉన్న కొంత మంది ఆటగాళ్లను వేలంలో చేర్చాలంటూ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశాయి. వీరిలో లెగ్ స్పిన్నర్ సుధేశన్ మిథున్ (కేరళ) ఇటీవల ముస్తాక్ అలీ టోర్నీలో పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. కర్ణాటకకు చెందిన 23 ఏళ్ల అభినవ్ మనోహర్ కర్ణాటక ప్రీమియర్ లీగ్ ప్రదర్శనతో తనపై దృష్టి పడేలా చేశాడు. 19 ఏళ్ల ఉత్తర ప్రదేశ్ లెఫ్టార్మ్ పేసర్ మొహసిన్ ఖాన్ కూడా ముస్తాక్ అలీలో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నాడు. సోమవారం బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను 3 వికెట్లు తీశాడు. అయితే అటు బ్యాట్స్‌మన్‌గా, ఇటు బౌలర్‌గా ఏ స్థాయిలో కూడా తనదైన ప్రత్యేకతను ప్రదర్శించని భారత మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ కుమారుడు మొహమ్మద్ అసదుద్దీన్ కూడా ఈ 'ప్రత్యేక' జాబితాలో ఉండటం ఆశ్చర్యకర పరిణామం. మూడేళ్ల క్రితం మూడు ట్రయల్ మ్యాచ్‌లు మాత్రమే ఆడించిన తర్వాత ఉత్తరప్రదేశ్ వన్డే జట్టులోకి అసద్ ఎంపికైనా... అతను ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.

సురేశ్ రైనా ఫామ్‌లోకి వచ్చాడు

- 59 బంతుల్లో 13 ఫోర్లు, 7 సిక్స్‌లతో 126*
- బెంగాల్‌పై ఉత్తరప్రదేశ్ విజయం
- ముస్తాక్ అలీ టి20 టోర్నీ



రైనా

2 పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారత బ్యాట్స్‌మన్‌గా రైనా ఘనతకెక్కాడు. ఇందులో విరాట్ కోహ్లిది (7,068 పరుగులు–226 మ్యాచ్‌లు) అగ్రస్థానం కాగా... రైనా (7,053 పరుగులు–265 మ్యాచ్‌లు) స్వల్ప తేడాతో రెండో స్థానంలో ఉన్నాడు.

1 టి20ల్లో నాలుగో సెంచరీ సాధించి ఈ ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు చేసిన భారత క్రికెటర్లు కోహ్లి, రోహిత్ శర్మ సరసన రైనా చేరాడు.

కోల్‌కతా: ఫామ్‌లేమితో సతమతమైన భారత బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా ఐపీఎల్ 11వ సీజన్‌కు ముందు ఫామ్‌లోకి వచ్చాడు. ఈ ఉత్తరప్రదేశ్ (యూపీ) కెప్టెన్ మెరుపు సెంచరీతో జట్టును గెలిపించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీ సూపర్ లీగ్‌లో సోమవారం జరిగిన పోరులో యూపీ 75 పరుగుల తేడాతో బెంగాల్‌పై జయభేరి మోగించింది. మొదట యూపీ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీస్కోరు చేసింది. రైనా (59 బంతుల్లో 126 నాటౌట్; 13 ఫోర్లు, 7 సిక్సర్లు) అజేయ శతకం సాధించాడు. కేవలం 49 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బెంగాల్ 16.1 ఓవర్లలో 160 పరుగుల వద్ద ఆలౌటైంది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు 4 వికెట్లు దక్కాయి. ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో పంజాబ్ 4 వికెట్లతో ముంబైపై... రాజస్తాన్ 4 వికెట్లతో జార్ఖండ్‌పై, ఢిల్లీ 2 వికెట్లతో బరోడాపై గెలుపొందాయి.

పది రోజుల ముందే రావాల్సింది

దక్షిణాఫ్రికా పర్యటనపై కోచ్ రవిశాస్త్రి



జొహన్నెస్‌బర్గ్: రెండు ఓటముల అనంతరం... మూడో టెస్టు ముంగిట... టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రికి తత్వం బోధపడింది. జట్టు వైఫల్యానికి విదేశీ ప్రత్యేక పరిస్థితులే కారణమని విశ్లేషించిన ఆయన... దక్షిణాఫ్రికా పర్యటనకు ముందుగానే వచ్చి ఉండాల్సిందంటూ సోమవారం జట్టు ప్రాక్టీస్ అనంతరం నిర్వహించి మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. ఫామ్ ఆధారంగా రహానే కంటే రోహిత్ శర్మను మేలైన ఎంపికగా భావించామని చెప్పుకొచ్చారు. 'స్వదేశంలో పరిస్థితులు మనకు అలవాటై ఉంటాయి. పెద్దగా పోరాడాల్సిన అవసరం ఏర్పడదు. కానీ విదేశాల్లో అంతా భిన్నం. అందుకని ఇక్కడకు ఓ పది రోజులు ముందుగానే వచ్చి ఉంటే కథ మరోలా ఉండేది. రాబోయే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలకు ప్రధాన ఆటగాళ్లను ముందుగానే పంపించే యోచన ఉంది. పిచ్‌లు రెండు జట్లకు ఒకేలా ఉన్నాయి. మేం రెండు టెస్టుల్లో ప్రత్యర్థి 20 వికెట్లు తీశాం. కాబట్టి ఓటమికి మినహాయింపులు లేవు. మా టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రాణిస్తే మూడో టెస్టు కూడా మంచి మ్యాచ్ అవుతుంది' అని శాస్త్రి అన్నారు. 'మా బౌలర్లు ఇంత అద్భుతంగా రాణిస్తారని ఎవరూ ఊహించలేదు. ఈ పర్యటనలో ఇది మాకు పెద్ద సానుకూలాంశం. ఒకవేళ తొలి టెస్టులో రహానే ఉండి, అతడు విఫలమైతే రోహిత్‌ను ఎందుకు తీసుకోలేదనేవారు. ఇప్పుడు రోహిత్ విఫలం కావడంతో రహానే గురించి అడుగుతున్నారు. విదేశాల్లో ఆడేందుకు ఫామ్ ముఖ్యమా? పరిస్థితులు ముఖ్యమా? అంటే పరిస్థితులను త్వరగా అర్థం చేసుకునేవారు కావాలి. అయినా దేనికైనా మీకు అవకాశం ఉంది. పేస్ బౌలర్ల విషయంలోనూ ఇలాగే స్పందించేవారు. కానీ టీం మేనేజ్‌మెంట్ ఉత్తమ ఎంపికలపై చర్చించింది. వాటికే కట్టుబడి ఆడుతోంది' అని కోచ్ వివరించారు. 'రెండో టెస్టులో భారత ఆటగాళ్ల రనౌట్లు పాఠశాల విద్యార్థుల తప్పుల్లా ఉన్నాయి. అవి తీవ్రంగా బాధించాయి. మ్యాచ్ రెండు జట్ల మధ్య పోటాపోటీగా ఉన్న దశలో ఈ విధంగా వికెట్లు ఇవ్వడం సరికాదు. ఆటగాళ్లు కూడా అదే చెప్పారు' అని శాస్త్రి పేర్కొన్నారు.

ప్రైవేటుకు పార్కింగ్!

- ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనల ఆహ్వానం
- లైసెన్స్‌లు జారీ చేయనున్న జీహెచ్‌ఎంసీ
- కొత్త పార్కింగ్ పాలసీ అమలుకు చర్యలు



సాక్షి, హైదరాబాద్: రాజధానిలో ప్రైవేటు వ్యక్తుల ప్లాట్లు, ఖాళీ స్థలాల్లో పెయిడ్ పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు ఔత్సాహిక స్థల యజమానుల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించాలని పురపాలక శాఖ నిర్ణయించింది. హైదరాబాద్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు స్థలాల లభ్యత కష్టమైన నేపథ్యంలో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లో పెయిడ్ పార్కింగ్ సదుపాయాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గత జూలైలో ప్రకటించిన నూతన పార్కింగ్ విధానంలో ఈ అంశాన్ని పొందుపరిచింది. పెయిడ్ పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు ప్రైవేటు స్థల యజమానులకు జీహెచ్‌ఎంసీ లైసెన్స్‌లు జారీ చేయనుంది. జీహెచ్‌ఎంసీ నిర్ణయించిన పార్కింగ్ ఫీజు వసూలు చేసుకోవడం ద్వారా ప్రైవేటు స్థల యజమానులు ఆదాయాన్ని పొందనున్నారు. రోడ్లు/మాల్స్/వాణిజ్య సంస్థల సమీపంలోని ఖాళీ స్థలాల్లో పార్కింగ్ స్లాట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వనుంది. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (ఎస్టేట్స్ అండ్ హౌసింగ్) జి.రమేశ్‌కు ప్రభుత్వం వీటి ఏర్పాటు బాధ్యతలు అప్పగించింది. ఆసక్తి ఉన్న యజమానులు సెల్‌నంబర్ 9949546622కు గానీ, acestatehousing@gmail.com మెయిల్ ద్వారా గానీ సంప్రదించవచ్చు. ప్రతిపాదనలు అందాక పార్కింగ్ స్లాట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై పరిశీలించి 3 నెలలు, లేదా 6 నెలల కాల వ్యవధితో లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ నిర్ణయించిన పార్కింగ్ ఫీజులను అమలు చేయడంతో పాటు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల నిర్వహించిన ఓ సమావేశంలో హైదరాబాద్‌లో పార్కింగ్ స్థలాల కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రైవేటు పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు ప్రారంభించామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు.

ట్రాఫిక్ బేజారు..

అధికారిక లెక్కల ప్రకారం రోజూ సుమారు 700 కొత్త కార్లు, ద్విచక్ర వాహనాలు హైదరాబాద్ రోడ్లపైకి వస్తున్నాయి. ఇప్పటికే సరైన పార్కింగ్ సదుపాయాల్లేక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందికరంగా మారుతోంది. మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కార్యరూపం దాల్చేందుకు మరికొంత సమయం పట్టనుంది. సరైన పార్కింగ్ సదుపాయాల్లేక రోడ్లపై వాహనాలను అస్తవ్యస్తంగా నిలిపేస్తుండటంతో ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పార్కింగ్ సదుపాయం కల్పించేందుకు స్థలాల లభ్యత లేకపోవడం, స్థలాలు విలువైనవి కావడంతో ప్రభుత్వం ప్రైవేటు పార్కింగ్ స్లాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. అత్యవసరంగా పార్కింగ్ సదుపాయాలను పెంచాల్సిన అవసరముందని, తక్షణమే కనీసం 10 మల్టీ లెవల్ కార్ పార్కింగ్ స్లాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ పేర్కొన్నారు.

'పన్ను' గడువు ఏప్రిల్ వరకు పెంపు


రూ. 1.5 కోట్లకన్నా తక్కువ టర్నోవర్ ఉన్న వ్యాపారులకే వర్తింపు

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద పన్ను రిటర్నులు దాఖలు చేసే గడువును ప్రభుత్వం మరో మారు పొడిగించింది. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం రూ.1.5 కోట్లకన్నా తక్కువ టర్నోవర్ ఉన్న డీలర్లు (వ్యాపారులు) పన్ను రిటర్నులు (జీఎస్టీఆర్-1) దాఖలు చేయాల్సిన గడువు వివరాలివి..

త్రైమాసికం	చివరి తేదీ
జూలై-సెప్టెంబర్-2017	జనవరి 10, 2018
అక్టోబర్-డిసెంబర్-2017	ఫిబ్రవరి 15, 2018
జనవరి-మార్చి-2018	ఏప్రిల్ 30, 2018

ఆదేశాలను అపహాస్యం చేస్తారా?

- ఏపీ సీఎస్, డీజీపీలపై హైకోర్టు ఆగ్రహం
- కోడి పందేలను ప్రపంచమంతా చూసింది
- 29న హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా కోడి పందేలు జరగడానికి వీల్లేదంటూ తాము ఇచ్చిన ఆదేశాలను కేవలం కాగితాలకే పరిమితం చేశారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇది తమ ఆదేశాలను అపహాస్యం చేయడమేనని, ఇది అత్యంత దురదృష్టకరమని పేర్కొంది. కోడి పందేలు జరగడానికి వీల్లేదని ఆదేశించినా పందేలు యథాతథంగా జరిగాయని, స్వయంగా ప్రజా ప్రతినిధులే పందేలకు హాజరయ్యారని కోర్టు వ్యాఖ్యానించింది. జరిగిన కోడి పందేలను ప్రపంచమంతా చూసిందని పేర్కొంది. అరుదుగా టీవీలు చూసే తమకే, టీవీల్లో కోడి పందేల దృశ్యాలు పదే పదే కనిపించాయని తెలిపింది. 'కోడి పందేల విషయంలో ఏమీ చేయలేమంటూ మీరు నిస్సహాయత వ్యక్తం చేస్తే, ఆ విషయాన్ని మాకే చెప్పాలి.. అప్పుడు మిగిలిన సంగతులను మేం చూసుకుంటాం' అని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), ఏపీ డీజీపీలను ఉద్దేశించి హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది.

మా ఆదేశాలను సీరియస్‌గా తీసుకున్నట్లు లేదు

కోడి పందేలు జరిగిన తీరును చూస్తుంటే మా ఆదేశాలను అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోడి పందేలు జరగకుండా ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ నివేదికలు ఇవ్వాలన్న తమ ఆదేశాలను అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. నివేదికలు ఇవ్వకపోవడమే కాక, మరింత గడువు కోరడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. తమ ఆదేశాల ప్రకారం నివేదికలు సమర్పించనందుకు అటు సీఎస్ దినేష్‌కుమార్, ఇటు డీజీపీ ఎం.మాలకొండయ్యను స్వయంగా కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఎందుకు నివేదికలు సమర్పించలేదో వివరణ ఇవ్వాలని వారికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ మంతోజ్ గంగారావులతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది సంక్రాంతి సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, వెంప, శ్రీరాంపురం గ్రామాలలో కోడి పందేల పేరుతో జూదం, అశ్లీల నృత్యాలు, వ్యభిచారం నిర్వహించారని, ఈ సంక్రాంతి సందర్భంగా ఇవేమీ జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఒకటీ.. రెండూ.. మూడూ..

- రాష్ట్రంలో పులుల గణన ప్రారంభం
- ఈ నెల 29 వరకు కొనసాగింపు
- గణనలో పాల్గొన్న మంత్రి జోగు రామన్న



జంతు విసర్జనను పరిశీలిస్తున్న అటవీ శాఖ మంత్రి జోగు రామన్న

సాక్షి, హైదరాబాద్/ఉట్నూర్ రూరల్ (ఖానాపూర్): రాష్ట్రంలో పులులు, ఇతర అటవీ జంతువుల గణన ప్రారంభమైంది. నల్లమల, కవ్వాల్, బెల్లంపల్లి, తూర్పు కనుమలు తదితర అడవుల్లోని మూడు వేల ఫారెస్టు బీట్లలో అధికారులు సోమవారం ఏక కాలంలో జంతు గణన ప్రారంభించారు. దాదాపు 10 వేల మంది అటవీ, స్వచ్ఛంద సేవా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ నెల 29 వరకు లెక్కలను సేకరిస్తారు. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారి పీకే ఝా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. అధికారులు గతంలో పాద ముద్రల ఆధారంగా పులి కదలికలను, ఉనికిని గుర్తించేవారు. ఇప్పుడు తొలిసారిగా 'ఫేజ్4 మానిటరింగ్ విధానం' ద్వారా పులులను లెక్కిస్తున్నారు. అంటే ఛాయా చిత్రాలు, పాద ముద్రలు, పెంటిక విశ్లేషణ, భౌతిక గమనం అనే నాలుగు అంశాల ఆధారంగా పులిని గుర్తిస్తారు. ఒక పులి చారలు, పాద ముద్రలు ఎట్టి పరిస్థితుల్లోనూ వేరొక పులితో సరిపోలవు. వీటి ఆధారంగానే అటవీ శాఖ అధికారులు పులుల సంఖ్యపై స్పష్టతకు వస్తున్నారు. జంతు గణన వారం పాటు చేస్తారు. ఇందులో మూడు రోజులు వేటాడే జంతువులు(మాంసాహారులు) మూడు రోజులు శాఖాహార జంతువుల లెక్కలు సేకరిస్తారు. జాతీయ కార్యక్రమంలో భాగంగా ఈ జంతుగణన దేశవ్యాప్తంగా ఏకకాలంలో ప్రారంభమైంది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని కొలాంగూడ, రాంపూర్ అటవీ బీట్‌లోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్) ఫారెస్ట్‌లో అటవీ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి జోగు రామన్న పులులు, వన్య జంతువుల గణనలో పాల్గొన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అటవీ శాఖ అధికారులతో కలసి 6 కిలోమీటర్లు కాలినడకన పర్యటించి ఆయన జంతు గణనను పరిశీలించారు. వన్యప్రాణుల సంరక్షణ, వాటి సంఖ్యను పెంచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి అన్నారు.

చారలను సరిచూసి...

పులుల లెక్కింపులో ఇప్పుడు సీసీ కెమెరాలే కీలకంగా మారాయి. పులి శరీరానికి కుడి, ఎడమ వైపు ఉన్న చారలను కెమెరాలతో చిత్రీకరిస్తారు. చారల్లో ఉంటే తేడాల ఆధారంగా ఒక ఫొటోతో మరో ఫొటో సరిపోల్చుకుంటూ ఒక పులి నుంచి మరో పులిని వేరుగా గుర్తిస్తారు. రెండేళ్ల లోపు పులి కూనలను లెక్కలోకి తీసుకోరు. మరో పద్ధతిలో నీటి ముడుగుల సమీపంలో ఫారెస్టు అధికారులు తడిగా ఉండే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఫలకాలు పెడతారు. నీళ్ల కోసం వచ్చే పులి ఆ ఫలకాల మీద కాలు పెడితే అచ్చులు పడుతాయి. ఆ అచ్చుల ఆధారంగా కూడా పులులను లెక్కిస్తారు.

పెంటిక పరీక్ష...

పులులు సంచరించే అవకాశం ఉన్న ఆవాసంలో పెంటికల(పేడ) నమూనాలు సేకరిస్తారు. వాటికి సీసీఎంబీలో డీఎన్‌ఏ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. అన్ని నమూనాల్లో ఒకే రకమైన డీఎన్‌ఏ ఉంటే పెంటికలు అన్ని ఒకే పులివి అని నిర్ధారిస్తారు. డీఎన్‌ఏలలో తేడా ఉంటే అక్కడ మరో పులి ఉన్నట్లు గుర్తిస్తారు. డీఎన్‌ఏ నిర్ధారణ పరీక్షల్లో 100 శాతం విశ్వసనీయత ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.